అరుణతార

సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక

129 మే 1991

హక్కుల సాధనకోసం

కార్మిక వర్గం రక్తతర్పణం చేసినరోజు

మేడే

విషయసూచిక

సంపాదకీయం ... 3

కథ ....పక్షి నచ్చవైట్లు — సువర్ణముఖి ... 7

కవితలు

ఒక జాతర ముగిశాక — కరుణ 5

"ప్రజాస్వామ్యమా వర్థిల్లు" — బజరా ... 5

"మందు" — మిట్టకోల వెంకటేశ్వర్లు 6

జెండాని ఆయుధంచేసి — రుద్రజ్వాల 22

రైతు బతుకు — కో. ప్ర. ... 23

అడ్వాన్స్ — మానిక్ 25

ఇదీ వరస! — భారతి 26

విషపుత్రికలు — నల్లూరి రుక్మిణి ... 48

మూలం — ఆష్టచైతన్య ... 48

పాటని చంపటం నీవల్లే మౌతుంది? — ప్రభాత్ 49

మీ ఆఖరి ఘడియల్లో.... — ఎం ఎస్. ఆర్. 49

సూరీడులా ఉదయించు! — కె. లుగేంద్రనాథ్‌పిళ్ళై 50

అన్నలారా ఆర్టీసీబస్సు కాల్చకండి!

— ఎల్. వి. సుధీర్‌కుమార్ 54

ముసిపోకు — పి. కె 59

అక్టోబర్ 30 — ఆర్. శివశంకర్ 60

అత్యాధునిక కవిత్వ ధోరణులు

పాపినేని శివశంకర్, ఏసీరాల సమాధానాలు 16

విశ్వనాథ సాహిత్యం, మత, కుల విషం

రాజు శాశ్వతముగా జీవించునుగాక

— త్రిపురనేని మధుసూదనరావు 27

శ్రీకాకుళ పోరాట పాటలు

జేగంటలు సేకరణ: మానేపల్లి 51

సమీక్ష అజ్ఞాత సముద్రం — వీరయ్య 55

లేఖ చరిత్ర రచన వీరుల భోజ్యంగా రాయాలా?

— బి. ఎస్. రాములు 56

విరసం విశేషాలు 58

అరుణతారకు రచనలు, చందాలు, విరాళాలు పంపవలసిన అడ్రసు

వి. వెంపయ్య, 6-5-13, కావలి-524 201., నెల్లూరు జిల్లా.

3 KLVA101M106

సంపాదకీయం :

గెలిచేదెవరైనా ఓడేది ప్రజలే!

నాలుగున్నర దశాబ్దాల 'స్వతంత్ర' భారతదేశం రుజువుచేసిన నగ్న సత్యం ఒక్కటే- ఎన్నికల్లో గెలిచేదెవరైనా ఓడిపోయేది ప్రజలేనని.

ఉన్న రాజ్యాంగం చాలక పాలకవర్గాలు ఎన్ని మార్పులు, చేర్పులు చేసినా రోజురోజుకూ రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులే ప్రజలకు కరువవుతున్నాయి.

సామ్రాజ్యవాద దేశాలనుండి, అంతర్జాతీయ ద్రవ్యసంస్థనుండి వేలాది కోట్ల రూపాయల అప్పును ఎప్పటికప్పుడు తెస్తూవున్నా ఆర్థిక సంక్షోభాలు పెరుగుతున్నాయేగాని దారిద్ర్యరేఖకు దిగువ ఉన్నవారి సంఖ్య తగ్గడంలేదు.

సహాయం పేరుతో అందుతున్న విదేశీ అప్పులు రెండు లక్షల కోట్లకు పెరిగి, ప్రతి సంవత్సరం వేల కోట్ల రూపాయల వడ్డీ చెల్లిస్తున్నామంటే మన పాలకవర్గాలు దేశాన్ని సామ్రాజ్యవాదులకు ఎంతగా తాకట్టుపెట్టాయో అర్థం అవుతోంది.

ఎన్నికల సందర్భంగా నక్సలైట్ల 'హింస'ను ఎదుర్కోడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్న క్రమంలోనే దేశవ్యాప్తంగా బూర్జువా మతతత్వ పార్టీల హింస వందమందిదాకా పొట్టనపెట్టుకొంది.

మొట్టమొదటిసారిగా ఢిల్లీలోని చాందినీచౌక్ నియోజకవర్గంనుండి లోక్‌సభకు పోటీచేస్తున్న నిమ్మీబాయి అనే వేశ్య తమ దుస్థితికన్నా దేశం స్థితి మరింత అధ్వాన్నంగా ఉందని మన పార్లమెంటరీ వ్యవస్థని వెక్కిరిస్తోంది.

దళిత ముస్లిం మైనారిటీస్ సురక్ష మహాసంఘ్ అధ్యక్షుడు హాజీమస్తాన్ ఎన్నికల్లో తమ పార్టీ అనివార్యంగా పోటీచేయవలసి వస్తున్నదంటూనే, దేశం మతకలహాలతో, విద్రోహాలతో, దుండగులతో సతమతమవుతున్న దశలో ఎన్నికలు జరపడాన్ని ఖండిస్తున్నాడు.

ఒకరు సుస్థిర ప్రభుత్వం ఇస్తామంటున్నారు. ఒకరు సాంఘికన్యాయం కల్పిస్తామంటున్నారు. మరొకరు ప్రజలకు ఇళ్ళు కట్టించలేకపోయినా కనీసం రాముడికయినా గుడి కట్టిస్తామంటున్నారు. ఇంకొకరు నిరుద్యోగ సమస్యకు పరిష్కారం చెప్పండానే ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తామంటున్నారు. వీళ్ళు అందరూ ఒకరిపై ఒకరు సవాళ్ళు విసురుకుంటున్నారు. ప్రజల్ని ప్రజలుగా

గాక ఓటర్లుగానే చూస్తున్నారు. మన పార్లమెంటు ఒక మాక్ పార్లమెంటుగా తయారయింది.

నలభైనాలుగు సంవత్సరాల పార్లమెంటరీ విధానం భూమిని పేదలకు పంచలేకపోయింది. కోట్లాది మానవుల శ్రమను దేశానికి వినియోగించలేక పోయింది. జీవితానికి కనీసపు భద్రతనూ, గ్యారంటీనీ కల్పించలేకపోయింది. ప్రజాస్వామ్యపు విలువల్ని కాపాడుతున్నట్టు కనీసం నటించలేకపోతోంది. ఇవి దాచేస్తే దాగని సత్యాలు.

ఈ సత్యాల్ని గుర్తించిన ప్రజలు నాయకుల్ని నిలదీస్తున్నారు. ప్రజల కేంజేశారని అడుగుతున్నారు. ఈ బూటకపు పార్లమెంటరీ విధానంలోని గుట్టును రట్టుచేస్తున్నారు. తమకు దక్కవలసిన భూమిని తామే పంచుకుంటు న్నారు ఏ రాజ్యాంగమూ అమలుచెయ్యలేని భూసంస్కరణల్ని స్వయంగా అమలుచేసుకుంటున్నారు. ప్రజల్ని మత్తులో ముంచే సారాయికి వ్యతిరేకంగా పోరాడుతున్నారు. ప్రాణాలర్పించడానికైనా సిద్ధపడుతున్నారు. పాలకవర్గాల హింసను ప్రతిహింసతో ఎదుర్కొంటున్నారు. ప్రజల సమస్యల్ని ప్రజలే పరిష్కరించుకోగలరన్న ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తున్నారు.

సంతాపం

ప్రముఖ ప్రగతిశీల రచయిత్రి అనుపమా నిరంజన్ 1991 ఫిబ్రవరి 14న మరణించారు. కర్నాటకలో శివమొగ్గ జిల్లా తీర్థహళ్ళిలో 1934 మే 7న పుట్టి, 1956లో ప్రముఖ రచయిత నిరంజన్‌తో వివాహమై, కమ్యూనిస్టు ఉద్య మంవైపు ఆకర్షింపబడి ప్రజలకోసం కలంపట్టిన రచయిత్రి అనుపమ. వైద్య వృత్తిలో ఉంటూనే 8 కథా సంకలనాలు, 22 నవలలు, శిశుసాహిత్యం 12 సంపుటాలు, ఆత్మకథ, యాత్రాకథలు మొదలైన 58 గ్రంథాల్ని వెలువరిం చారు. మహిళా ఉద్యమాలకు నాయకత్వం వహించారు. అనేక అవార్డులు పొందారు. తల్లి లక్ష్మీదేవమ్మ, తండ్రి శివరామయ్య. 10 సంవత్సరాలు క్యాన్సర్‌తో పోరాడి జీవితాన్ని చాలించినా ఆమె రచనలు సజీవంగానే ఉంటాయి

అనుపమా నిరంజన్ నవలల్లో ప్రసిద్ధమైన 'మాధవి' అనే నవల తెలు గులో అనువాదమయింది. భారతదేశంలో భూస్వామ్య వ్యవస్థ తొలిదశలో రాజులు, పురోహితవర్గం స్త్రీలపై ఏవిధంగా పెత్తనం చెలాయించేవారో, స్త్రీని భోగవస్తువుగా ఎలా వాడుకునేవారో ప్రతిభావంతంగా చిత్రించారు. వీరి మృతికి విరసం సంతాపం ప్రకటిస్తోంది

ఒక జాతర ముగిశాక

కూలుతున్న గోడలన్నీ కొత్తరంగులు పులుముకుంటాయి
చివికిన గుడిసె తడికమీద పాతముఖాలే మళ్ళీ విచ్చుకుంటాయి
నింగినంటే కటౌట్ల మధ్య గొంతు చించుకునే ఇనుప గొట్టాల మధ్య
మనుషులు - పరగుజ్జులూ, మూగవాళ్ళూ అవుతారు
కరకు గొంతులు సౌమ్యంతోనూ, ఇనుపచేతులు వినయంతోనూ
వేదికమీంచి వేడుకుంటాయి
ఎరచుట్టూ చేపలు నిర్లిప్తంగానే తిరుగుతుంటాయి
చేతులు మారిన జండాలు ఆయుధాలతో ఊరేగుతున్నప్పుడు
గూళ్ళల్లో బిక్కుబిక్కుమనే అన్ని లక్షల జతల కళ్ళల్లో
భయమొక్కటే సారూప్యమౌతుంది
వేడుకలన్నీ జరిగాక, రంగుల హోళీ ముగిశాక
బ్యాలెట్ పెట్టె విప్పుతున్నప్పుడు నెత్తుటివాసన గుప్పుమంటుంది
కన్నీళ్ళు తాగి బలిసి, సారా, అత్తరు జల్లుకు మురిసి
తప్పకుండా 'ప్రజాస్వామ్యం' గెలుస్తుంది కాకుంటే ప్రజలే ఓడిపోతారు
సాదృశ్యంకాని గొలుసులు ఈడ్చుకుంటూ
మౌనంగా తిరిగి తమ బొరెక్స్‌లోకి అదృశ్యమౌతారు
ఎవరి చేతుల్లోదో ఆకురాయి ఒకక్షణం మెరిసి మాయమవుతుంది.

-కరుణ

"ప్రజాస్వామ్యమా వర్ధిల్లు"

పార్లమెంటు భవనంలో రాజ్యాంగం పొంచాలై
పార్లమెంటేరియన్ల వస్త్రాపహరణకు గురవుతుంది
రాత్రివేళలో రాజ్యాంగం ఎర్రకోటమీద జెండా అయి ఏడుస్తుంది
చెదలు పట్టిన పేజీలు దులపకుండా రాసే పలకవుతుంది
పతాకంలోని పులులు నాలుగూ నాలుక చాపుకొని ముందుకురుకుతాయి
అశోకచక్రం బదులు హస్తమేదో కనిపిస్తూ కవ్విస్తూవుంటుంది
రాముడేమో విరామాలకి బదులు ఓట్లడుగుతాడు
జెండాకు వేలాడే తాడు వురై భారతి మెడకు బిగుసుకుంటుంది
ఏ క్షణానో కూలిపోయే ప్రధాన సింహాసనానికుండే

నాలుగు కాళ్ళ కాట్లాడి పోట్లాడి తలోదిక్కు పరిగెడతాయి
ఎలక్షన్ల వేగుళ్ళొచ్చి ఓట్లు వాంతులు చేసుకుంటాయి
నెలలు నిండకముందే ప్రజాస్వామ్యానికి గర్భస్రావమవుతుంది
ఐదేళ్ళకి పురుడు తప్పి మళ్ళీ గర్భం ధరిస్తుంది
మంత్రసాని బ్యాలెట్ పెట్టెల్ని ఓటర్లకుకాక ఓనర్ల కందిస్తుంది
గాదిలో వుండే ఎలుకలు గారకాయల్లాంటి పిల్లల్నే తినేస్తాయి
విటులందరూ విరాటరాజు కొలువు దీరుస్తారు
కుర్చీ నాలుగుకాళ్ళ కుమ్ములాట మళ్ళీ మొదలవుతుంది
లేగబెయ్యలన్నీ గుక్కెడుపాలు మింగకుండానే నలిగిపోతాయి
ప్రజాస్వామ్యపు పురిటి నొప్పులు మళ్ళీ మొదలవుతాయి.

–బజరా

"మందు"

చెవిని సోకిన రోకటి రొదకు
మెలకువ వచ్చింది.
కళ్ళు నలుచుకొని దృష్టి సారించా
కనుచూపుమేర ఒకటే కోలాహలం
ప్రతి రోటిదగ్గర ఎవరో, ఏదో
నూరుతూనే వున్నారు.
అదేఁవిటో తెలుసుకోవాలనే
కుతూహలం.
ఎవరో ఒకతను ఏదో చేతపట్టుకొని
నావైపే వస్తున్నాడు.
నా చూపును మరోవైపు తిప్పాను
చటుక్కున నిల్చున్నాయి నాకళ్ళు.
ఆశ్చర్యంగా వుంది.
నిన్న ఇదే వ్యక్తి పీనుగలా ఉన్నాడు
నేడు ఏనుగులా వున్నాడు.
నమ్మశక్యంగాలేదు మహాత్యమేమో.
"కాదు"
"కాదా! నువ్వెవరు?"
"నేనెవరో తర్వాత చెప్తాకాని,
నువ్ నిద్రపోయి ఎన్నాళ్ళయింది?"
"నిన్ననే కదా!"
"కాదు, నిన్నైదేళ్ళ క్రిందటే
నిద్రపుచ్చారు
నేటికి మేలుకున్నావు
అదిగో! ఆ తాపత్రయం చూడు
వాళ్ళు నూరే ఆ మందు,
నీ గాయాలకు రాసేది కాదు.
నిన్ను మరో ఐదేళ్ళు నిద్రపుచ్చే
మహాత్యం ఉంది, ఆ మందులో
ఐదేళ్ళకు సరిపడు మత్తుంది జాగ్రత్త!"

—మిట్టకోల వెంకటేశ్వర్లు

కథ

...మళ్ళీ వచ్చెత్తాం

—సుపర్ణపక్షి

హోరెత్తిన సముద్రపు అలల్లాగ కొండలు పరచుకొనున్నాయి. చలికాలంలో సీటిల దించిన పందుల్లాగ ఒకదానిమీద ఒకటెక్కినట్టు కొండలుగూడా అలాగే ఒకదానిమీదికి ఒకటి ఎగబ్రాకినట్టు కినపడతన్నయి. కొండలన్నీ మొండిబారిపోయి బిడ్డల్ని పోగొట్టుకున్న తల్లుల్లాగ అడ్డాలుజాపి కూకున్నయి. ఒకప్పుడు ఆ కొండలమీద కూడుడికీదట! ఆ కూడు తిండానికి కూలోలు కదిలొచ్చేరట. ఉన్నోలు ఉన్నపాలంగా పారిపోనారట! ఆ ఆకుపచ్చని కొండలు ఎచ్చగుండీవట! పల్లపోళ్ళ కళ్ళు బడ్డాయో? పోలీసోళ్ళ కాళ్ళు బడ్డాయో? గావి దుంపనాశనమైపోనావట! ఆ కొండలమీద మొనదేలిన రాళ్ళు చూత్తుంటే.... ఆ సూదిరాళ్ళు చూత్తుంటే ఆ కొండ - తల్లికొడుకుల జ్ఞాపకానికి కట్టిన స్తూపాల్లా వున్నాయి. ఆ రాళ్ళమీదున్న మరికలు చూత్తే, ఆ మరకలు అప్పుడు రత్తాలా? లేపోతే ఆ రత్తానికి కొండ గార్చిన కన్నీరా? అన్నట్టుగ కళ్ళకి మరిపిత్తన్నయి.

ఒకప్పుడు ఆ కొండలంటే బెదిరిపోయేలట! కొండలన్నీ దండుగట్టినాయట తెల్లారితే పల్లపండీపట! రాత్రత్తే రాజకీయాలు చెప్పీపట! కుదబలిసినోడిదగ్గర కూడు నాక్కొని అడుక్కునోడికి అదరించీపట! 'పుళ్ళిపీడు'ల మెడ బలిసినోడికి మర్దర్ జేసినాయట జంపరకోటల జనంలో జెండాయెత్తినావట! కూటములో కూలోల్లతోటి కూడీపోనాపట! అదిచ్చూసి ఉన్నోలు ఉచ్చబోసినారట, చదువుకున్నోలు చదువు వొదిలేసి కొండకెలిపోత్రనట కొండోలు గొప్పయిపోత్రనట మా రాజ్యమొత్తాదని గెంతీసినారట కానిప్పుడవేవీ లేవే? చదువుకున్నోలు చచ్చిపోనారు కొండోడొరిగిపోనాడు. గారిడి గురువుగారు జైల్లపోనారు బోరుకొండలు బోరుమన్నాయి. చీకటికొండల చిచ్చుబుట్టింది వొట్టిగెడ్డ వొట్టిపోయింది సికాకుళంలో ఏముంది సావురాని సవరజాతపలు వారికున్న వర్గకపితప్ప! వత్తామొత్తామనంటుండ్డే కళ్ళముందే కార్లమీద తిరగలెత్రను. కల్లబొల్లి కమ్మేనిస్టులు. ఇక్కడ కొండోడుమాత్రం కుడుతులబడిన ఎలకలాగ కుంపటిలబడిన గేతులాగ కొట్టుకుంతండు ఎవులూ రచ్చించరు. ఇలగుంది కొండల పరిస్థితి. చెప్పడానికి బాధగుంది కానిదంతా ఎందుకు చెప్పుతున్నానంటే,

"మళ్ళీ కొండల్లోకి నచ్చలైట్లు వచ్చినారట"

కార్లు మీదొచ్చినారో ? యిమానమ్మీదొచ్చినారో ? ఆకాశంనుండి పడి పోయిన్రో ! భూమి పెల్లగించి పుట్టికొచ్చినారోగాని మళ్ళీ ఏలిపొచ్చినారట !

జంపరికోట కి మొఖ్యోడికి కబురు పంపినారట ! కాపలెట్టుకుండట !

మేరింగి.రాజు మేడకోత్తానని ఉత్తరం రాసినారట - పోలీసోళ్ళని కాపలెట్టుకుండట.

సేతంపేట ఐ.టి డి.ఏ వోడ్ని అదరగొట్టినారట ! పారెస్టోడికి పరుగు బెట్టించినారట ! ఓలమ్మో అంతకొ మనిషాట, ఆరడుగుల అజానుబాహులట, అంతకొక్క తుపాకులట, ఇక్కడ నొక్కితే అక్కడ పేల్తన్నయట ! కొండల్ల నొక్కితే మొండిఖల్లు స్టేషన్ల పేల్తన్నయట అలకి కొండలేటీ గావట, చెట్లు పుట్లేటీ గావట, లైట్లు ఎయ్యకుండ నైటుని గాటీల మీదనుంచి పరిగెడుతున్రట !

ఓలమ్మో ఆదోళ్ళు వున్నారట, అదోళ్ళ గాదట - ఆదిశక్తులటమ్మో !

వంటిచెయ్యికి అయిదుగురు ఏటీగాదట !

చెప్పకేమి !

ఈ కొండమీదనుంచి ఆ కొండమీదకి గెంతేత్తన్నరట !

పుకార్లుమీద పుకార్లు, ఉన్నోళ్ళ ఊకిదంపుళ్ళు, లేనోళ్ళ సంబరాలూ ఆకాశాన్ని అంటిపోతన్నయి.

అవును మరి !

ఆ కొండలకున్న చరిత్ర అది. అక్కడ సీమలుకదిలితే గవర్నమెంటు సి.ఆర్.పి ని దించుతాది. గవర్నమెంటు అంత పెద్ద సి.ఆర్ పి ని దించినపుడు తలుపూద్వారం లేని నోరు ఈమాత్రం పుకార్లు కుయ్యడం అంత పెద్ద తప్పేమీ గాదు. ఇంతకీ మీకింకా అనుమానమే గదా! పువ్వుపుట్టకుండా వాసనరాదు గదండీ. వచ్చినారు. అయితే వచ్చినోలు వచ్చినట్టగే వున్నారు ఇన్ని పుకార్లు అలు పుట్టించనేలేదు. ఉన్నోలు ఉండబట్టలేక, ఊసుపోక, ఊదిన పుకార్లే అవి. ఆ కొండలమీద వెలుగు చూత్తుంతే తెలీడంలేదా! వచ్చినారు.

* * *

కొండెనక్కి వెళ్ళి నక్కినక్కి చూస్తూ మంటకాగుతున్నట్టుగ వున్నాడు సూరీడు. అతిగాడు మారిపోయి చెందమామ ఇంకా రావల్సుంది.

నిలువుగుంది గాటీ. అనుభవం గడించినోడైనా గాటీదిగుతుంటే గతుక్కు మంతాడు. ఆ గాటీ తిరుగుడులోనే ఆగింది దళం. అక్కడకాని (అక్కడనుంచి)

కిందకి చూస్తే అవతల కొండకి ఆనుకొని వరకట్టిన పల్లపుభూములు తిరుపతి కొండకి మెట్టుల్లాగున్నాయి. అక్కడ కూకొని అంటుకున్న అంటిరేకల్ని ఏరు కుంటున్నారు. అటింగజేసి గాటీమీద గేటేసినట్టు పరిమికంప వేలాడుతంది. నిండాపళ్ళు ద్రాక్షపళ్ళలాగ. మద్దిరొడ్డకీ మేకపిల్లలు తగులుకున్నట్టు, పట్టు కుంటే వదలని పరింకంపకి పట్టుకొని వదలకుండా పల్లేరుకోని పరపరా నవులు తంద్రు. వీరన్న ఒకపక్క బీడీకాలుస్తూ రెండోపక్క పళ్ళు తింతండు.

అప్పుడే కొండమీదనుంచి వీచిన రివ్వాటుగాలికి పువ్వులతోటున్న కందికంపలు నవ్వుకుంటూ నాట్యం జేస్తున్నట్లున్నాయి. కొండమీద పోడు నుంచి "డబుకు టుబూ డబుకు టుబూ" అంటూ కర్రమీద కొడుతున్నట్లు శబ్దం వినిపించింది. అందరి కళ్ళా అటూయిటూ తిరిగి చూస్తన్నాయి. చివరికి ఆ కళ్ళన్నీ పోడుమీద శబ్దంమీదే నిలిచాయి. "డబుకు టుబూ డబుకు టుబూ" "జజ్జనకరి"లోకి మారిపోయింది. ఇద్దరు కామ్రేడ్స్ కళ్ళు మెరిపించి శబ్దాని కనుగునంగా వళ్ళూపుతంద్రు. పొయ్యి పొకక్కళ్ళలా కూర్చున్న ఆ ముగ్గురు కామ్రేడ్స్‌లోనూ, దూరంగా కూర్చున్న అక్కల మనస్సుల్లోనూ, ముళ్ళు వేసు కుంటున్న దివాకర్‌లోనూ అందరి మనసుల్లోనూ శ్రీకాకుళం గడ్డని మళ్ళీ ఎరు పెక్కించాలనే ధ్యాస, ఆశ, పట్టుదల కొట్టొచ్చినట్టు కనబడతన్నాయి.

కమాండర్ మాటతోనూ, యాదన్న "దళం కదులుతున్నదా దండు కదులుతున్నదా" పాటతోనూ కదిలిపోయింది పక్కనున్న వూరివైపు దళం. కొండవాలుమీద గాటీపక్కన భూమిలోంచి పుట్టుకొచ్చిన కాగడాలాగ తిరగలి కంద దానిపక్కనున్న సిరిచెట్టు చూసుకుంటూ వుండిపోయాయి. దళం గాటీ పూర్తిగా దిగగానే రూపక్క పైకిచూచి గుండాగిపోయినట్టుగ "ఓర్నాయన! ఇంత గాటీ దిగామా?" అంది.

* * *

"అమ్మో మిలట్రోలొత్తన్రు", "న్నాయనో సిక్కరోలు ఇళ్ళ దగ్గ రున్నారు దొర్కిపోత్రు గల్నాయినో" అని దళాన్నిజూసి, ఆ డ్రెస్సులజూసి, తుపాకులుజూసి మేకలొదిలేసి రాయారప్పా చూడకుండా కిందామీదా పడి పారి పోతన్రు యెనక్కెనక్కి జూసి పారిపోతున్న గవిరియ్యకి గతంలో పాత బడిపోయిన ఇంటినుండి పట్టులు పట్టేసిన పెట్టిదెచ్చి ఈదిల బెడితే, పెట్టిపెట్ట గానే బొద్దింకలు ఎటుబడితే అటు పారిపోయినట్టుగ జీపుల్లో వచ్చిన మిల ట్రోళ్ళు చుట్టుపక్కలకు గెంతి ఎక్కించుకుపోయిన సంఘటన ఈల్ని చూస్తే

గేపక మొత్తంది. "అన్నా మేం మిలట్రోల్లం గాదు, ఫారెస్టోళ్ళం గాదు బయ పడొద్దు బయ: డొద్దు" ప్రైలెట్ టీంనుంచి వచ్చిన ఈమాట వాలినిపించుకోలేదు.

వూరంతా ప్రశాంతంగా వుంది. ఆదియ్య అరుగుమీద చుట్టచుడతండు. పిక్కరుగుంట (చిన్నపిల్ల) పక్కన కూకుంది. రెండిల్లు కటంగజేసి ఎవులో మొగుడూపెళ్ళాలు దెబ్బలాడుకుంటండ్రు. దొడ్డిల మంచంమ్మీద ఆముదం పిక్కలారేసినారు. ఆదియ్య చుట్టచుడుతండేగాని, రెమ్మ సిరిగిపోద్దోనని మనసులో బయమే. కొసిరి కొసిరి కోరుకున్న అంటుండి పొవ్వాకు దెచ్చి నాడు. చిన్నకొడుకుక్కాడ చుట్టపీక నేర్పిసినాడు. ఎక్కడ డబ్బులూ చాల్దంలేదు తెల్లారిగట్ల కావిడి బట్టికెళినపుడు పదిరూపాయిలకొత్తే పొవ్వాక, పుల్లికాయ, ఉప్పుగెడ్డ తేవచ్చుననుకున్నాడు. దొంగనంజికొడుకులు సంతకొచ్చిన సావు కార్లంపిరూ ఏకాసెకీ బేరిమాడ్డమే. ఏమంతే "అడివిల బుట్టిన కర్రికి నువ్వు కుడుతెట్టి పెంచినావా? నేపోవ్తే గిడ్డేసినావా?" అనంతాడు. అన్నన్నసీసి అనాపరకైనా ఎక్కువివ్వకుండ ఎనిమిది రూపాయలు చేతిలెట్టినాడు. అలు బేరమాశత్రనుగదా నానూ బేరిమాడతానని "ఒక రెమ్మెకు్కవెయ్యి షావుకారి" అంతే "అడదాన్నాగ కొసురుతావేటేస్! అందుకే అన్నారు కోడొడితోటి జేరం కొండముచ్చుతోటి సుట్టరికమని" ఆమాట షావుకారి అనేసరికి సిగ్గుంపోనాడు ఆదియ్య.

చుట్టచుడతండేగాని సంతల జరిగినవన్నీ గేపక మొత్తన్నయి. పక్క నున్న పిక్కరుదాయి చుట్టదుక్కు తదేకంగా చూడ్డంతో తేపకారతంది. ఆ తేప (తేగుడు) నోటికీ భూమికీ మద్యన తీగలాగ వేలాడతంది మధ్యలో పరాగ్గా చూసిందీదిలోకి. దళం వీదిలోకొస్తుంది. ఆదియ్య తొడమీద బర్రికి అటు చూపిం చింది. సంతలో ఆలోచనల్నుంచి చేరుకొని గతుక్కుమన్నాడు ఆదియ్య. పక్కింటి అరుగుమీదనుంచి నల్లయ్య తొంగిచూత్తన్నడు ఆడోళ్ళు మగా ల్లందరూ ఇల్లల్లోంచి బయటకురాకుండా సినేమా చూచినట్టుగ చూత్తన్ను. అప్పుడే పోడుకంచి ఒకలూ ఇద్దరూ దిగుతన్ను

దళంలో కామ్రేడ్స్ కిట్లు దించుతన్ను. "అన్నా" అని కమాండర్ ఆదియ్యకేసి సౌమ్యంగా సంబోధించేసరికి ఆదియ్య గుండెల్లో తీగమీటినట్టు, ఎక్కడో ఎప్పుడో ఎన్నేళ్ళకిందటో విన్న పాత గొంతులాగ అనిపించింది. కమాండర్ మాటలు అందరి ఇల్లదిక్కు చూసి "అన్నలారా! అక్కలారా! మేం ఫారెస్టోళ్ళంగాదు, మిలట్రోల్లంగాదు. మేం కమ్యూనిస్టుపార్టీవాళ్ళం, మీ

ఓడ్డల్లాండోళ్ళం, మీకపకారం చేయడానికి రాలేదు. బయపడొద్దు. బయటకు రండి" అని కమాండర్ మాట్లాడుతుంటే రాజన్న కిట్టులోంచి ఎర్రజెండా తీసి కర్రకి బెట్టి నిలబెడుతండు. అప్పుడుదాకా చూసిన వల్లయ్య ఎన్నాళ్ళనుండో విడిపోయిన కొడుకుని చూసిన తల్లిలాగ, ఎర్రజెండా చూడ్డంతోనే గబుక్కున అరుగు గెంతి ఎర్రజెండా పట్టుకోని "ఈ జెండా మనది, మీరు మనోలు, మన ఎర్రజెండా" అని ముద్దెట్టుకోని జెండాను గుండెకేసి కౌగిలించుకుంటుంటే వూరి జనమంతా దగ్గరికి పోగవుతున్నారు.

దళం సభ్యులందరికీ కల్లల్లో మెరుపు, గుండెల్లో సంతోషం పెడుతున్న పరుగులకి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు వేడెక్కాయి. ఆ కామ్రేడ్ అలాగ ముద్దెట్టుకుంటుంటే రవన్న మనసులో పెల్లుబుకుతున్న ఆవేశాన్ని ఆపుకోలేక,

"జోహార్! అమరవీరులకూ!"

"జోహార్" కొన్ని కొత్త గొంతులు.

"కొనసాగిద్దాం అమరవీరుల ఆశయాలను!"

"కొనసాగిద్దాం! కొనసాగిద్దాం!" జనంలోంచి.

ఒకరొకరే చేరతంద్రు. ఒకలూ.... ఇద్దరూ.... గూడగూడంతా చేరి పోతన్రు.

వాళ్ళింకా మరిసిపోలేదు "కామ్రే" "కామ్రే" అని అందరితో చేతులు కలుపుతుంటే ఇందాక పారిపోయిన గవిరియ్యకూడా వచ్చి అందరికీ చేతులు కలిపి సమావేశంలో కూకున్నడు. గూడ మెంబరు ముందల కూకున్నడు.

వూరి పక్కనే ఏటవాలుగా వున్న పోడుదాడిలోంచి ఎవ్వలో పెద్ద బండ గొంతులో "కష్మనిట్టులం మేం కట్టజీవులం అవునన్నా కాదన్నా అడేయిట్టులం మేం అడే నిట్టులం" అని పాడుకొని దిగుతుంటే వూరిజనమంతా ఎంతో ఆనందంగా అటు చూశారు. "మ్మాకీ గేపకాలు తాపులే మిగిలిపోన్యి మళ్ళీ యింత కాలమవుతున్నా ఎప్పలు రానేము మన రాజ్జెం రానేదూ" దళందుక్కూచూసి ఎంతో బాధగా అన్నాడు మెంబరు.

సూరీడు కొండెనక్కి ఉంశగానే చందమామ పెళ్ళంతో దెబ్బలాడుకున్నాడేటోగాని చీకటిపడకుండా వెలుగులోనే వచ్చేసినాడు అప్పుడే తల్లిమేక దగ్గర పాలుత్రాగి వీధిలో సరదాగా గెంతుతున్నాయి మేకపిల్లలు. అది చూస్తున్నోళ్ళకు చాలా సరదాగా వుంది. కాని అవి మేపినోడికి పెంచినోడికి మాత్రం అట్టి చూస్తుంటే గుండె పెల్లగిల్లిపోద్ది. కిందేడు తీసుకున్న నోన్ (లోన్)

కట్టపోతే ఆ మేకపిల్లలు జెప్తిచేత్తానన్నాడట బేంకాపీసరు. ఒకపక్క నోన్ కట్టక్కరనేదని చెప్పుతంది రేడియో. పదేలు నోపు నోన్ మాఫీజేశారట. కాని మాదలేటో మాకు కట్టమంటున్రు. ఎండల పడిపోవడమోనని రోజూ అతనికి బాదే.

చల్లటి మంచు పడతంది. అందరూ ఆరిగీలు (కుంపట్లు) రాజేత్తన్నరు. ఆటి చుట్టే కూకున్రు అందరూ మునకాలు కర్రలు మీదికి నిలబెట్టి ముంగాలు మీద కూకున్నరు. ఆ మునకాలుకర్రల దుక్కుచూత్తుంటే ఎన్నిరిసిన జొన్న కొడల్లాగున్నాయి చిన్నాపెద్దా గూడగూడంతా అక్కడ కూకున్నరు సెంట్రీ కామ్రేడ్ చంద్రన్న ఒప్ప. రాజన్న అందరికీ కూకోబెడుతండు అంత పెద్ద పాటుకుడూ గాదూ! అలాగని గొంతు లేనోడూ కాదూ! కాని ఆ విప్లవోత్తేజంతో "ఎర్రజెండెర్రజెండెన్నియలో ఎర్రెర్రనిదీ జెండెన్నియలో" పాటందుకున్నాడో కామ్రేడ్. అప్పుడే వీచిన రివ్వాటుగాలికి అడవి అడవంతా జుయ్‌మని వంతపాడింది. ఇరవయ్యేళ్ళ తరువాత వీచిన ఆ చల్లగాలికి గూడ అడవీ వళ్ళు విదిలించి పులకరింపుగా వింటున్నాయి. పాటయిపోయింది.

కమాండర్ నెమ్మదిగా ఒకలెక్కప్రకారం అప్పుడు శ్రీకాకుళ పోరాటం ఎందుకు చేశారు, అపుడున్న దోపిడి ఏమిటో విపులంగా ఉదాహరణతో చెబుతుంటే అక్కడున్నోళ్ళ మనసులుకూడా అలాగే ఇరవయ్యేళ్ళ కిందకి పరుగెట్టాయి.

అరుగుమీదున్న ఎర్రయ్య కళ్ళు కొంచెం చెదురుతన్నయి. కొడుకు మీటింగులో ముందే కూకున్నాడు అప్పుడూ ఇలగే వచ్చినారు అలగయ్యింది. ఇప్పుడెటు దారితీత్తదో! అని ఆలోచిస్తుంటే అతని మనసుకి ఇల్లుకాల్చిన సంఘటనలు, కట్టేసి కాల్చిన సంఘటనలు, అట్టికొండలో ఆరుగుర్ని కాల్చడం, చిలకాంలో నలుగుర్ని కాల్చడం గేపకమొచ్చి మనసు మరింత చెదిరింది. "మొత్తమ్మీద మనం ఓడిపోయాం. మనవాల్లందరినీ చంపారు. కానీ మన ఆకలి తీరలేదు మన బాధలు తీరలేదు" అని కమాండర్ తన మాటల్ని మంపు తిప్పి ప్రస్తుత పరిస్థితుల్ని చెబుతండు.

కుంపటిచుట్టూ కూకోని మాటలింతండ్రు మంగడు, కద్రకోడు, ఆరికోడు. కద్రకోడు చుట్ట చిగురు నలుపుతండు. ఆరికోడు చుట్ట ముట్టించాడు. మంగడి దృష్టంతా మాటలకేసే వుంది. ఆలాముగ్గురూ అప్పుడు శ్రీకాకుళ పోరాటంలో పయ్యారు. మంగడైతే ఏకంగా ఐదు సమచ్చరాలు జైల్లోనే వున్నాడు.

ఎదురుగా అరుగుమీదకూకున్న మంగడు భార్య ఆలోచనలు ఎక్కడో ఉన్నాయి ఆలోచనల్లోనే మంగడిని ఇంటికి పిలిచి "సీక్కేటి పోతంది కామిరెడ్డిలొత్తే ఆలతోనే తిరుగుతావు. పిల్లాజెల్లా చట్టముక్క వుల్లికాయ ఏలాగుందవి అసలే ఎరగవు. ఎన్ని రొక్కటాలొచ్చినా నానే బరించాలి"

"ఇప్పుడే వచ్చినారూ ఇప్పుడుకాసే తిగులుకుంటన్నవ్. ఆలు సెప్పిన మాటలినే వుల్లికాయా? చట్టముక్కా బ్రతుకా? రేపు సిక్కురోడికి ఏటిడీసి సర్తావా?" మంగడు అనేసి విసురుగా మీటింగుకాసి నడిచాడు

"సెప్పడమేగావి మొండోడువు, ఇంతావేటి" అన్న మంగడి పెళ్ళాం గూడా మీటింగులోకొచ్చి కూకుంది.

తెలంగాణాలో భూస్వామ్య వ్యతిరేక పోరాటాల గురించి కమాండర్ ఉత్తేజంగా చెబుతున్నాడు. నందగొర్రి చుక్కడు ఆలోచనలన్నీ ఆలప్పగారి వూళ్లో భూములన్నీ దొబ్బిన సావుకారిమీదే వున్నాయి. ఉల్లికాయ వుప్పుగడ్డ ఇచ్చి ఆర్నాలనుంచి ఐదు రూపాయలవరకూ వడ్డీకి పత్రాలు రాయించుకొని వూళ్లోవున్న ముప్పై ఎకరాల భూమిని దొబ్బాడు సావుకారి. ఈ విషయం అన్నలతో చెప్పాలని ఆత్రపైపోతండు. ఎప్పుడు చెబతానా అని కాకోనెవొస్తుంటే వుచ్చొచ్చినెట్టగయి వూరవతలకెళ్ళాడు అవతలున్న సెంట్రీ పద్దంటున్నా అంతా చెప్పాడు.

కూకున్న జనంలో చిన్నచిన్న సొనుగుడు వినబడతంది. అది గమనించిన కమాండర్ "వీరన్నా మంచి ఎమోషనల్ సాంగ్ పాడిమి" అన్నాడు. అంతే! "వత్తన్నాడొత్తన్నాడు ఆ భూములున్న బుగతోడు పోలీసుల తోడుతోను అడుగడుగో అటుసూడు" పాట రబ్బరుతాడుకి రాయిగట్టినట్టు సాగి వూగి వూగించింది జనాన్ని. జనం మళ్ళీ ప్రశాంతంగా వున్నారు. కమాండర్ ముందుకొచ్చి యాపిత్ తెలంగాణ దండకారణ్యాల్లో పోరాటవార్తలు చెబుతిండు

చిన్నగుంటలు ఆదోలా చూస్తున్నారు కమాండర్ వైపు. ఆ చూపుల్లో బాపం "ఏహే! హాయిగా పాటలు పాడుతుంటే ఇతగాడొకడు మధ్యమధ్య నెలిపొచ్చి మాటలాడెత్తడు" అన్నట్టుగుంది.

మెంబర్ ఆలోచనలన్నీ అన్నల తిండిమీదే వున్నాయి. ఇంటింటికీ దండాలా? నెహ్వేతే వండాలా? అన్నదానిచుట్టే వున్నాయి. అక్కడ కూచున్న యువకులందరూ ఎంతో ఆనందంగా మళ్ళీ పోరాటం చెయ్యాలి, మన రాజ్యం వచ్చిందాకా చెయ్యాలి అన్నటువంటి ఆసక్తితో వింటున్నారు.

కమాండర్ "చివరిగా ముఖ్యమైన విషయం" అని మొదలెట్టి "ఈ గవర్నమెంటు గిరిజనులు పోడు చెయ్యకూడదని చట్టమొకటి చేసింది. అది ఈపాటికే మీకు తెలిసుంటుంది. పోడు చెయ్యకపోతే మనం ఏలా బతకాలి? ..." అని చెబుతూ పోడులో సాధకబాధకాలన్నీ చెప్పి "మళ్ళీ మనం సంగాలు పెట్టి మన సమస్యలు పరిష్కరించుకోవాలి" అని ఆపాడు. మరో పాట మొదలయ్యింది.

అవతల వీడి గుడ్డోడు అతికష్టంమీద మీటింగు ప్రారంభంలో బయల్దేరి ఇప్పటికి చేరుకున్నాడు. ఆయన వెనకాల మరో ముసలాయనగూడ అప్పుడే చేరాడు. పాటలయిపోయాయి. వూరిజనం మధ్య కమాండర్ కూర్చొని వాళ్ళ బాధలు రాసుకుంటుంటే గుడ్డోడు వచ్చి "కామ్రేడ్ నాకు పేణం వుంటుండగా మళ్ళీ చూ త్తాననుకోలేదు కామ్రేడ్. చూచ్చేను కామ్రేడ్, ఇక న చచ్చినా పూసీలేదు కామ్రేడ్" అని సంతోషంగా వాళ్ళు చేతులూ తడిమాడు. దళమంతా ఎంతో ఉత్సాహంగా గుడ్డోడిచేత పాత శ్రీకాకుళ పోరాటంగురించి అడిగి తెలుసుకుంటున్నారు

కమాండర్ వూర్లు పేర్లు దార్లు అడుగుతున్నాడు. ఎర్రయ్య ఎప్పుడు నుంచి అడగాలనుకుంటున్నాడోగాని కమాండర్ పక్కకొచ్చి "మీరు సంగాలెట్టి పోరాటం చెయ్యమంతరు. తీరాచేత్తే మ్మా పీకలమీదికి రానిచ్చి మీరు తప్పుకుంతరు. అప్పుడలగే చేసినారు" అనేసి తల కిందికి దించుకోని కాలుమీది పుట్టిన పుండు గోకుతుండు. వెంటనే కమాండర్ అందరి నుద్దేశించి చెప్ప సాగాడు. అప్పుడు శ్రీకాకుళ పోరాటంలో జరిగిన అవకతవకలు అవకాశవాదాలగురించి చెబుతూ "నేడా పరిస్థితి లేదని, ఈ దళం కష్టాలకు గురయితే మరో దళాన్ని పంపడానికిగూడా పార్టీ సిద్ధమేనని" చెప్పాడు.

"నేనిలగడుగుతున్నని ఏటనుకోవద్దు. మాకోసమేగదా మీరొచ్చింది.... అయితేటంతే ...సకంలోన వదిలిత్తే ఏటయిపోతమోనని అడిగాను" అన్నాడు ఎర్రయ్య.

చుక్కయ్య ఆలప్పగారూర్లోన షాపుకారి దోపిడీగురించి చెప్పి "ఎప్పు డెల్తామ్ కామ్రేడ్" అని తొందరచేశాడు. "ఈలాంటి సమస్యలన్నింటినీ పరిష్కరించాలన్నదేకదా మన లక్ష్యం. ఎల్దాం" అనిచెప్పి పేజీ తిరగేసి ఆ విషయం రాసుకున్నాడు కమాండర్.

వాళ్ళకున్న సమస్యలు పేజీలు తిరగబడుతున్నయి. దోపిడీ రూపం మార్చుకుంది. భూస్వామ్య దోపిడీ ఇంకా పోలేదు ఇంతలో రేడియో వార్తలు

వింటున్న చంద్రన్న గాబరాగా వచ్చి "అన్నా వక్కసారిల్లా చూడండి" అని ఇలా మొదలెట్టాడు "ఈవాళ వార్తల్లో చెప్పేదేంటంటే మనజిల్లా మందసలో 8 మంది ప్రభుత్వోద్యోగుల్ని కిడ్నాప్ జేసింర్రట. విషయమేంటంటే మన కామ్రేడ్ పాణిగ్రాహి వర్ధంతి సభజేసింర్రట. ఆసభ భగ్నంజేయజూసింర్రట. అయినా మన గిరిజనులు వేలాదిమంది సభ జరిపించింర్రట దాంతో పిచ్చెక్కిన వాడు మనాళ్ళను అరెస్టుజేసిండట అందుకే మనాళ్ళు కిడ్నాప్‌చేసి మావాళ్ళని వదలకుంటే మీవాళ్ళని జంపుతామని హెచ్చరించింర్రట" అని చెప్పీచెప్పగానే ఎవులో విజిలేశారు. ఇంకెవులో "మంచిపని జేశారు" అన్నారు జనంలోంచి. అది దళ సభ్యులకి కొత్తవిషయం అవ్వడంతో అంతా సరదాలో మునిగారు.

తిండికి రమ్మని మెంబరు గాబరాపెట్టడంతో అందరూ వెళ్ళి టోంచేశారు వచ్చీరావడమే కమాండర్ మాటతో అందరూ కిట్టులేసుకున్నారు

ఊరువూరంతా వచ్చి నిలబడ్డారు దళంతోపాటు వూరవతల వరకూ వచ్చారు. దళాన్ని వదలాలనిపించలేదు వారికి. ఆపక్కగా నున్న యువకుల్లో నుంచి ఎవులో అన్నారు "మళ్ళీ ఎప్పుడొస్తారన్నా" అని. ఆమాటలో వస్తారో రారో అనే సంశయం, రాకపోతే ఎలాగ అనే భయం ధ్వనించాయి "తొందరలో వస్తాం, అందరూ వుండండి" అనిచెప్పి పైలెట్ టీం చిక్కని మంచుని మనిషి ఆకారంలో చీల్చి ముందుకు నడిచారు. వూరిజనమంతా పాత జ్ఞాపకాల్లోంచి పిడికిలి పైకెత్తారు. వూర్లోవున్న కుంపట్లన్నీ ఎర్రగా ఎలిగి పిడికిలికి మరింత శక్తినిచ్చాయి. పిడికిళ్ళన్నీ ఎర్రగా మెరిసిపోయాయి.

అదండి! అందుకేనండి ఇందాకటినుంచి ఇదంతా చెప్పాను. శ్రీకాకుళం కొండలు మళ్ళీ పోరాటానికి సిద్ధమైపోనావండోయ్. ఇందులో అనుమానంలేదు గదండి! మరొక్కసారి అటుచూడండి

ఎదురుగా వున్న కొండలకాసి దళం నడుస్తుంటే ఆ చీకటిలో సింత కీర్లు కీచుకీచుశబ్దాలు, పాటలూ మాటలూ వినడానికి చుక్కలు దిగొచ్చాయా అన్నట్లు మినుగును పురుగులు వూరంచుమడిలో మకాంవేశాయి. కొండల మధ్యలోంచి తుడుముల శబ్దం అన్నలకు ఆహ్వానం పలుకుతోంది. ఆ మొండిబారిన కొండలిప్పుడు దండకారణ్యంవైపు చూస్తున్నాయి.

అత్యాధునిక కవిత్వ ధోరణులు

కె.వి.ఆర్. ప్రశ్నలకు కవుల సమాధానాలు

* పాపినేని శివశంకర్

1) 'ఆధునికత' అనే భావనని కాలాన్నిబట్టిగానీ, కేవలం నూతనత్వాన్నిబట్టిగానీ నిర్ణయించటం తగదు. కాలాన్నిబట్టి ఆధునికతని నిర్వచించబోతే - క్రిందటి దశాబ్దం అప్పటి పరిశీలనకి ఆధునికంగా కనిపిస్తే ఈ దశాబ్దం నేటి పరిశీలనకి ఆధునికంగా కనిపించవచ్చు. అలాగే సామాజిక లేదా సాహిత్య రూపంలో కనిపించే కొత్తకొత్త అంశాల్నిబట్టికూడా ఆధునికతని నిర్వచించలేము. ఉదాహరణకి నేటి వచనకవితారూపంలో గతకాల సంస్కృతిని ప్రతిపాదించవచ్చు ఇది నవ్యతమాత్రమే అవుతుంది. ఆధునికత కాదు.

సామాజిక వస్తువులో రూపంలో గుర్తించదగిన ప్రగతిశీలకమైన మార్పు ఆధునికత.

కళాసాహిత్యాలకి సంబంధించి ఫ్యూచరిజం, సింబాలిజం, సర్రియలిజం వగైరా ధోరణులకు మన దేశ కాల పరిస్థితుల్లో పునాదులు లేవు. అవి కేవలం అతిదేశాలే. కాబట్టి అవి మన కళాసాహిత్య రంగాల్లో చూపించిన ప్రభావం ఉపరితల ప్రభావమే. అంతేగాక ఫ్యూచరిజం, సింబాలిజం, సర్రియలిజం లాంటివి మన సాహిత్యరంగంలో ధోరణులుగాకూడా బలపడలేదు వాటి ప్రభావాలు వ్యక్తినిష్ఠంగానే ఉన్నాయని నా అభిప్రాయం. మన సమాజానికి సంబంధించి స్థూలంగా 19వ శతాబ్ది రెండోపాదం నుంచి 'ఆధునికత' ప్రవేశించిందని చెప్పుకోవచ్చు. దీనికి ప్రజాస్వామ్య భావజాలం, శాస్త్రవిజ్ఞానపు వెలుగులో హేతువాదం, మానవతాదృష్టి ప్రేరణలుగా ఉన్నాయి.

2) మనుషుల భావావేశాలమీద - అమాటకొస్తే భావావేశాలమీదనే - కవిత్వ ప్రభావం సూటిగా వుంటుంది ఉన్నప్పుడు ఆ భావావేశాల్ని పాజిటివ్ దిశగా మళ్ళించటం మంచి కవిత్వం చేసే ఉపకారం. మనుషులపట్ల, మనుషుల శ్రమపట్ల ప్రేమ, గౌరవం పెంపొందించటం, మనుషుల దుస్థితిపట్ల సానుభూతి కలిగించటం, దుర్నీతిపట్ల ఆగ్రహం రగిలించటం, అంతిమంగా పాఠకుల్లో జీవితవిశ్వాసం పాదుకొల్పటం కవిత్వ ప్రయోజనమనుకుంటాను.

కవుల విషయంలోనే కాదు, ఏ వ్యక్తి విషయంలోనైనా ఒంటరితనం (lonliness) అభిలషణీయం కాదు. 'No man is an island'. సామూహిక సంబంధాల్లోంచే మనిషి భాష, ఆలోచన, సంస్కృతి రూపొందినప్పుడు ఆ సంబంధాలకు దూరంకావడం దుస్సాధ్యం. కవులు కొంతమంది సమాజం పట్ల అసంతృప్తితోనో, అసహ్యంతోనో, పిరికితనంతోనో ఏకాంతమందిరాల్లో కూర్చొని కవిత్వం రాయటం కద్దు. సమూహంతో సంబంధం అనవసరమనుకుంటే వాళ్ళ కవిత్వమూ అనవసరమే. కవిత్వంకూడా కవి పాఠకుల మధ్య భావావేశ సంబంధమే గదా!

3) వ్యక్తి సంస్కారానికీ స్వత్రప్రవర్తనకీ ఆచరణే గీటురాయి.

4) ఏ కవీ తనకోసమే తాను రాసుకోవటం ఉండదు. తనగురించో, తనకోసమో రాసుకున్నట్టు అనిపించినా రాసిన తక్షణం దానితో పాఠకుడుగానే సంబంధం పెట్టుకుంటాడు. కవి పాఠక సంబంధంలేని కవిత్వమే లేదు

5) 'చైతన్యస్రవంతి' (stream of consciousness) కేవలం మనోగతమైంది కాదు. సామాజికమూలం లేని కళారూపం లేదు. పాశ్చాత్యదేశాల్లో వ్యక్తికీ, సమాజానికీ ఏర్పడ్డ (శత్రు) వైరుధ్యంలోంచి 'చైతన్యస్రవంతి' పుట్టిందనుకుంటాను. అచ్చమైన ఉపచేతనా (subconscious) రూపాన్ని సాహిత్యంలో ఆవిష్కరించటం సాధ్యంకూడా కాదు. సాహిత్యరూపం పొందే క్రమంలో stream of consciousness, channelled stream of consciousness అవుతుంది. ఇక చైతన్యానికి మూలం సమష్టి జీవితమే. వ్యక్తి చైతన్యానికి 'కేవలత్వం' ఉండదు.

6) కవులు జనసామాన్యంకంటే ఆలోచనాపరులుగా అధికులే. అయితే ఆ ఆధిక్యం జనసామాన్యంవల్ల వచ్చిందే. శ్రామికజనంయొక్క అదనపు శ్రమ ఫలితమే కవులకూ, కళాకారులకూ ఆలోచనా వ్యవధిగా, సృజనాత్మకతకవసరమైన విరామంగా ఏర్పడుతుంది. కళారూపాల కన్నిటికీ జనసామాన్య జీవితమేగదా ముడిసరుకు! ప్రజల్లోంచి వచ్చిన ఏ కవీ, కళాకారుడూ ప్రజలకంటే అధికుడినని గర్వించడు. అలాగే అతని కవిత్వం ప్రజలందరికీ చేరాల్సి, చెందాల్సి వుంటుంది.

కవి అంతర్ముఖుడు కావటం తప్పుకాదు. అంతర్ముఖత్వం ఆత్మపరిశీలనకి తోడ్పడుతుంది. అయితే కవి ఎంతగా అంతర్ముఖుడవుతాడో అంత బలీయంగా బయటికీ రావాలి. మన సాహిత్యంలో ఆత్మాశ్రయ కవిత్వంతోపాటు

అంతర్ముఖత్వమూ మొదలరైందనుకుంటాను. శతకాలూ, తత్వకీర్తనల్లో ఈ లక్షణం కనిపిస్తుంది

7) సర్రియలిజం అంతిమంగా కవి పాఠకుల అసంబంధానికి (non-correspondence) దారితీస్తుంది. వ్యక్తివాదం లేనిదే సర్రియలిజం లేదు. కాబట్టి దాన్ని వదులుకోక తప్పదు. ఇప్పటి తరంలో సర్రియలిస్టు కవులు అనేకులున్నారని నేననుకోను. వాళ్ళ రాతలు ఒక ధోరణిగా బలపడతాయని కూడా నేననుకోను కవితావస్తువుకంటే అభివ్యక్తిరీతి ముఖ్యంకాదు.

8) మనచుట్టూ సాగుతున్న అన్యాయాలకు, అక్రమాలకు కవిగా నేను తప్పనిసరిగా స్పందిస్తాను. ఉదాసీనత, తటస్థత కవిత్వంలో మోసానికి మరో పేరు. జార్జి లూకాచ్ చెప్పినట్టు partisanship అనేది కవితావస్తువులోనే అంతర్భాగం. ఏదో ఒక పక్షాన్ని అవలంబించని కవిత్వం లేదు.

9) నేటితరం కవుల్లో కొందరు ప్రజలపట్ల తేలికభావంతో ఉన్నమాట నిజమే. తాము విశిష్ట వ్యక్తులమనుకునే కవులందరూ ఆత్మకేంద్రక కవిత్వం (self-centred poetry) రాస్తున్నవాళ్ళే వాళ్ళ రాతల్లో పైపై మెరుగులు కన్పిస్తాయి. అతిస్వల్పకాలంలోనే ఆ రాతల్లోని నిజాయితీలేనితనం బయట పడుతుంది.

10) సామాజికవస్తువు సంక్లిష్టంకాకుండా కవిత్వం సంక్లిష్టం కాజాలదు. పెట్టుబడిదారీ వ్యవస్థ ఫలితాలైన ఆధునిక సంక్షుభిత సంబంధాల్లోంచి వచన కవిత్వం పుట్టింది. వచనకవిత్వంలోంచే సంక్లిష్టత పుట్టుకొచ్చింది. సంక్లిష్టత మౌలికంగా ఆధునిక కవిత్వ లక్షణం.

కవిత్వ వస్తువులో రూపంలో అనేకానేక విభిన్నాంశాలు దట్టంగా కల గలిసిన స్థితి సంక్లిష్టత.

నిన్నటి, ఇవాల్టి వచనకవులు ఇంచుమించు పట్టణ మధ్యతరగతి జీవులు పెట్టుబడిదారీ నాగరికత పట్టణాల్లో వ్యాప్తిచెందుతోంది. యంత్రీకరణ జరుగు తోంది. వస్తుసంబంధాలు బలపడుతున్నాయి. సమూహంలో ఒంటరితనం పట్టణ నాగరికత ముఖ్యలక్షణం. నానాటికీ జీవనవలయం విస్తరించేకొద్దీ ప్రపంచం మనిషి ముంగిట్లోకి వస్తున్నది. అనేకానేక నూతన పరిణామాలు కొత్తకొత్త ఆవిష్కరణలు, సంఘటనలు తనని కదిలిస్తూ ఆలోచనా శాఖల్ని విస్తరింపజేస్తున్నాయి.

ఇలా జీవితంలో వేగం పెరుగుతున్నప్పుడు విరుద్ధ సన్నివేశాలకి ఎక్కడికక్కడ వేర్వేరుగా ముక్కలుముక్కలుగా స్పందించాల్సి వస్తోంది. ముక్కలమధ్య సామరస్యం కుదిరటంలేదు. ఒక స్పందనకి సంపూర్ణవ్యవధి లేకుండానే మరో క్లిష్ట సన్నివేశం మీదపడుతోంది మనుషులమధ్య మానవీయ సంవాదం దెబ్బతింటోంది ఈవిధంగా చిక్కుముళ్ళు పడ్డ సామాజిక వాస్తవికతలో కవిగా నన్ను నేనెలా వ్యక్తీకరించుకోవాలి? నేనెలా ఇతరులతో సంబంధం పెట్టుకోవాలి? - అనే సమస్యల్లోంచే సంక్లిష్టత తలెత్తుతోంది కాబట్టి కవికి సమూహంలో ఏర్పడే సంవాదభగ్నత (break of correspondence) సంక్లిష్టతకి మూలకారణం.

కాగా, జీవితం ఆధునికం అయ్యేకొద్దీ కవిత్వమూ ఆధునికం కావాలి. అపూర్వం కావాలి. ఆధునిక కవి వెనకటి కవులకంటే ఎక్కువగా జీవితం మారుమూలల్లోకి తొంగిచూడాలి. కొత్తకొత్త ఆవిష్కరణలు చెయ్యాలి నూతన వ్యక్తీకరణ విధానాలు పట్టుకోవాలి బిచ్చగత్తె ఆకలిగురించి చెప్పాలంటే శ్రీశ్రీ 'భిక్షువర్షీయసి' ఛాయలు లేకుండా రాయాలి ఈవిధంగా కవిత్వం ఆధునికం అయ్యే క్రమంలో సంక్లిష్టం అవుతోంది కాబట్టి కవిత్వంయొక్క ఉన్నతీకరణావసరం (Necessity of heightening the poetry) సంక్లిష్టతకి ఉపరితల కారణం.

అయితే సంక్లిష్టత అర్ధసత్యం. పాశ్చాత్య సామాజిక సంక్లిష్టతకీ మన సామాజిక సంక్లిష్టతకీ మూలస్వభావంలో తేడా లేకున్నా పరిమాణంలో ఎంతో తేడా ఉంది. మనదేశంలో మహానగరాలు, పట్టణాలు తక్కువ. పట్టణ సంస్కృతిలోనూ మనిషి పరాయితనం (alienation) పాశ్చాత్యదేశాల స్థాయిలో లేదు. కవి తనను తాను అక్లిష్టంగా వ్యక్తీకరించుకునే అవకాశముంది.

అదీగాక మన ప్రజల్లో ఎక్కువభాగం పల్లెల్లో ఉన్నారు. అక్కడి భూస్వామ్య సంబంధాల సారాంశం ఇంకా విచ్ఛిన్నం కాలేదు. మరి ఆధునికం కాని ఆ జనానీకానికి కూడా ఏదో ఒక మేరకి కవి అర్థంకావాలి. కాబట్టి కవి తనకితాను అక్లిష్టంగా వ్యక్తీకరించుకోవాల్సిన అవసరమూ ఉంది.

సంక్లిష్టత, అస్పష్టత వేరు. సంక్లిష్టమైన కవిత్వంకూడా పాఠకుడికి స్పష్టంకావచ్చు. లేదా అస్పష్టమూ కావచ్చు. ఒక కవిత లేదా అందులోని వాక్యం ఎన్ని మెలికలైనా తిరగొచ్చు. ఎన్నెన్ని భావ, పద చిత్రాలైనా ఉండొచ్చు. వాటిమధ్య సమ్మేళన సంబంధం ముఖ్యం సంఘర్షణా సంబంధం

ఉండరాదు. అంతిమంగా కవితాసారాంశాన్ని పాఠకుడికి సవ్యంగా అందించే సూత్రం అంతర్లీనంగా ఉండాలి ఇది గమనించకపోతే "రాత్రంతా రోదిస్తుంది / తెగిపోతున్న చంద్రుడి శిరస్సుమీద వెచ్చటి సూర్యుడి వేళ్ళని నవరిస్తున్న / నిర్లక్ష్య నైరూప్య కాలపురుషుని స్వరంతో" (అఫ్సర్) ఇలాంటి గందరగోళ రూపాలేర్పడతాయి.

మితిమీరిన సంక్లిష్టత వ్యక్తివాద లక్షణం. వ్యక్తివాద కవులు పాఠకుడితో అనుసంధానంకన్న తమ ప్రత్యేకతే ప్రధానంగా భావిస్తారు కవితని పట్టుబట్టి సంక్లిష్టం చేస్తే ప్రగాఢత వస్తుందనుకుంటారు. కానీ అతిసరళమైన కవితల్లోనూ ప్రగాఢత సాధించవచ్చు

సంక్లిష్టత, రచనావిధానమే గాని రచనా పరమార్థం కారాదు. అంతిమంగా కళారూపాలన్నీ జీవితాన్ని మరింత అక్లిష్టం, అర్థవంతం చెయ్యటానికే. జీవితసంక్లిష్టత ఒకానొక చారిత్రక దశలోని సామాజిక పరిస్థితి ఆ పరిస్థితిని ప్రతిఫలించే రచన దానిని అధిగమించి జీవితవిస్పష్టతకి దారితీయాలి. సాహిత్యంయొక్క అధిచారిత్రకలక్షణం (supra-historical character) ఇది.

* పసీరా

1) సింబాలిజం, సర్రియలిజం, ఫ్యూచరిజం మొదలైనవి రూపానికి సంబంధించిన ఆధునిక అంశాలు. హేతువాదం, మానవతావాదం మొదలైనవి సారాంశానికి సంబంధించినవి. కేవలం రూపంలో మాత్రమే ఆధునికత ఉంటే అది కేవలం ఆధునికతకోసమే ఆధునికతగా (కళకోసమే కళ అన్నట్టుగా) తయారౌతుంది. అందుచేత కవిత రూపంలోనూ సారంలోనూ కూడా ఆధునికంగా ఉండాలంటే నేటి మానవుని దైనందిన జీవితాన్ని ప్రభావితంచేసే అనేక నూతన ఆర్థిక, రాజకీయ అంశాలను శక్తివంతంగా సుబోధకంగా చెప్పడానికి ఎన్నుకునే కొత్త ధోరణులను ఆధునికత అనవచ్చునని నేను భావిస్తున్నాను.

2) మనుషుల భావావేశాలమీద కవిత్వ ప్రభావం ఉంటుంది. రాచకొండ విశ్వనాథశాస్త్రిగారు చెప్పినట్లు — మంచికి చెడు చేయకూడదు. చెడుకి మంచి చేయకూడదు. మంచిని పెంచే దిశలోకి మళ్ళించాలి.

వైయక్తిక ఆలోచనా ఫలితమే విడిబాటుతనం. విడిబాటుతనం ఫలితమే వైయక్తిక ధోరణి. ఈ రెండూ పరస్పర ఆశ్రితాలు. ఇక తన జీవితానుభవం, తోటిమనుషుల సంపర్క సాంగత్యాలద్వారా, రచనలద్వారా తెలుసుకున్న జీవి

తానుభవం, ఈ అనుభవాల మధ్య పోలికలు, తేడాలు మనిషిలో మార్పుకు దోహదంచేస్తాయి.

3) వ్యక్తి సంస్కారానికి, సంస్కరణకి గీటురాయి సాటి మనుషుల కష్టసుఖాలకు ప్రతిస్పందించే తీరు.

4) కవి ఎవరికోసం రాస్తాడన్నది కవితలోని వస్తువే చెపుతుంది.

5) చైతన్యస్రవంతి సామాజికమైనది. చైతన్యానికి మూలం సమిష్టి జీవితం.

6) కవులు జనసామాన్యకంటే అధికులమని భావించడం సరైందికాదు. కవిత్వం ఎవరో కొద్దిమందికి చెందిందనుకోవడం సత్యంకాదు. కవిత్వంలో అంతర్ముఖత్వం ఎప్పటినుండి ఎందుమూలంగా వచ్చిందో నాకు తెలీదు.

7) సర్రియలిజాన్ని పనికట్టుకుని వదులుకోనక్కరలేదు. అది కొంత తెలుగు కవిత్వంలో ఇంకిపోయింది. విప్లవ కవుల కవితల్లోనైతేం ఎంతో కొంత సర్రియలిస్టు ధోరణి కనిపిస్తోంది. అర్ధభూస్వామ్య సామ్రాజ్యవాద సంస్కృతిలోని హేతుబుద్ధి విరుద్ధమైన అమానవీయత, సర్రియలిజం మన కవిత్వంలోకూడా ఇంకిపోవడానికి కారణం కావచ్చు రానురాను తెలుగు కవిత్వానికి సర్రియలిజం అవసరం పెరగవచ్చుకూడా. వ్యక్తీకరణ రీతికి ఎంతవరకు ఉపయోగించుకోవాలో అంతవరకే ఉపయోగించుకునే ఔచిత్యం కవికి ఉండాలి వస్తువును మరింత బలంగా కమ్యూనికేట్ చేయడానికిమాత్రమే సర్రియలిస్టు ధోరణిని వాడాలి. వస్తువుకి అడ్డుతగిలేపక్షంలో మరో రీతిని ఎన్నుకోవాలి. అభివ్యక్తిని బలంగా, సులభగ్రాహ్యంగా చెప్పే అభివ్యక్తి రీతి ముఖ్యం.

8) కవులుగా స్పందిస్తున్నాము.

9) కవులు విశిష్ట వ్యక్తులమని భావించడం సరికాదు.

10) సంక్లిష్టతకి నగరజీవితం ఒక్కటే కాదు. అర్ధవలస, అర్ధ భూస్వామ్య సామ్రాజ్యవాద సంస్కృతుల కలయికతో ఏర్పడిన కొత్త వికృత సంస్కృతి, ఈ సంస్కృతి ప్రజలమధ్యనుండే వైరుధ్యాలను దోపిడీకి అనుగుణంగా వాడుకుంటున్న నేపథ్యం, వీటన్నిటిపట్ల కవి దృక్పథం, వస్తువును కవి ఎటువిలబడి ఎలా వ్యక్తీకరిస్తున్నాడనే అలంకారాలను కొందరు కవులు ఔచిత్యం తెలియకుండా ఉపయోగించడం, పాఠకునికి వ్యక్తీకరణ సాంప్రదాయాలతో కొత్తపరిచయం మొదలైన అనేక కారణాలు ఉండవచ్చు.

అస్తిత్వవాదం గురించి నాకు తెలియదు.

జెండాని ఆయుధంచేసి....

సమాజ జీవిత భ్రమలు చెదిరి దూదిపింజలై
చిమ్మచీకటి విలయవిలయాలుగా కమ్ముకొంటున్న పుచ్చల వలయంలోకి
అడుగులు మోపుతున్న అనుంగుచెల్లీ! చిట్టితమ్ముడూ!!
స్వార్థం తడిగుడ్డ జెండాలుగా - జెండాలు మునగకొమ్మలుగా...
సభలు, సమావేశాలు మోస్తున్న సమయమిది.
పనికిమాలిన ప్రచార వుద్వేగానికి వుయ్యాలగాకండి!
పరవళ్ళు దొక్కుతున్న ప్రజాప్రవాహానికి దూరమై
పెంచే కులాల కొమ్ములకు చిక్కుకోక కనుంచూపులై ప్రవహించండి!
పుట్ట పగిలి పాములు చెలరేగినట్టు
పార్లమెంటు పగిలి జెండాలు చెంచెల్లాడుతున్నై.
పుక్కిట పొర్లే నల్లధనం విరజిమ్ముతూ
మెలమెల్లగా అకాల కాల జలధరాలై గుంపులుగట్టి మూగుతున్నై.
పెనగుతూ, పెరుగుతూ, బుసగొడుతూ, నసపెడుతూ....
పడగలమీద పథకాలు ధరిస్తూ .. పగ్గెలుదీస్తూ ప్రజల్లోకి వస్తున్నై.
పట్నం గుంటబతుకు ఆచి తూచి పాకుతాయి.
మురికి గల్లీల ముచ్చటంతా ఆబగా దేకుతాయి.
మొన్న నక్కినక్కి మొరిగిన జెండా నేడు ముందుకొచ్చి తోకూపుతోంది;
నిన్న చిలువలాపట్టి ఎముకలు కొరికిన జెండా నేడు ముసిముసి నవ్వుతోంది;
మూటలు విప్పుతోంది; మాటలు పేనుతోంది; ముంజేయి చుట్టుకొంటోంది.
భూమిని మింగి నెమరేసిన జెండాలే పల్లెసీమ వల్లేస్తుంటే....
కష్టజీవిని వేటాడిన జెండాలే భద్రత నందిస్తానంటుంటే....
పొంగే ప్రశ్నని జెండాగా ముడవొద్దు.
పద్దెనిమిదేళ్ళ పూతప్రాయాన్ని వోట్లజెర్రి కాళ్ళకింద పరవొద్దు.
మురికిసోకని అగ్నినేత్రాల అమ్మసారించి
మబ్బుల్లా వంగిన ఆకాశజెండాల అగాధం ఛేదించు,
నిరుడు దుమ్ము చల్లుకున్నవి ఈ యేడు కల్పి నడుస్తున్నవి.
నిరుడు కల్పి నడిసినవి ఈ యేడు కత్తులు దూసుకొంటున్నవి.
నమ్మకం చెపుతున్నవి, నీతులు పోతున్నవి;
నంగినంగి గొడుగుల నృత్యం చేస్తున్నవి.

నలుబది మూడు నిండు శిశిరాలు
నింగివేపేగా మనజాతి కన్రెప్పలిప్పవుంచింది!
ఏ మేఘమైనా వడగాలి తప్ప వీచిందా?
ఏ మొయిల్రైనా వాగ్దానం తప్ప వర్షాన్నిచ్చిందా?
నీరా, సారా, నీరెండ తప్ప నీటిచుక్కనిచ్చిందా?
మీ తాత వి_త్తిన జెండా కలవాళ్ళ కోరలకు తెరచాపైంది.
మీ నాన్న వి_త్తిన జెండా మీ నాన్ననే కటకటాల్లోకి తోసింది.
తలెత్తిన మీ చిన్నాన్న చైతన్యంమీదికి తూటాలు పేల్చింది.
తిరగబడిన నీ ముందుతరం ఆశయాన్ని అరణ్యాలకు తోలింది.
ఇంకా గుంజాటనెందుకు?—
మీ దిక్కు చేయిచాచిన జెండా
ఇప్పటికెన్ని మానవ రక్తకాసారాలీది వచ్చిందో చెప్పు.
లోలోన కొట్టుకులాడే మీ తాత వెతల వెక్కిళ్ళు చెప్పు.
మీ నాన్న పచ్చి పచ్చి గాయాలు చెప్పు.
ఇరుగుపొరుగు కన్నీళ్ళ స్వాగతం చెప్పు.
ఎండిన జాతి గుండెలపై మరుగుతున్న కల్లోల కలవరం చెప్పు.
ఈ భూగోళ దృశ్యం పచ్చబడటానికి మీ చిన్నాన్నలు, అన్నలు వదచిన
నెత్రుటడుగుల చాళ్ళ రెపరెపలు చెంగటపెట్టు.
కాదంటే—
ఆ చాళ్ళ జెండానే ఆయుధంచేసి
ఆక్రమించిన అమానుష బ్యానెట్ ధూమాన్ని
అనంత దిగంతాల అవతలకు తరిమికొట్టు.

—రుద్రజ్వాల

రైతుబతుకు

వినరా తమ్ముడ రైతు అన్నల కన్నీటి కథ వినరోరన్న ॥వినరా॥
భూమితల్లిరా - భూమితల్లిరా
నీకూ నాకూ బువ్వపెట్టి మరి - నీడనిచ్చేటి నేలతల్లిరా
ఆ నేలతల్లికే నీడనిచ్చిన - రైతుల కథ వినరోరన్న
ఆ భూమితల్లికే బతుకునిచ్చిన - రైతుల కథ వినరోరన్న

భుజంమీదరా కాడిపెట్టి నడు - బురదనేలలో కాలుపెట్టి నడు
మేడిపట్టి నడు మానుతోలి నడు - అడుసుదున్ని నడు అకుతొక్కి నడు
విత్తనాలుగా నెత్తురు జల్లిండే — రైతన్న
నరాలు పెరికి నాటులు నాటిండే — రైతన్న
ఏసిన పైరు ఏపుగ ఎదిగి - జంటజంటలుగ గంటులుపెట్టి
కలువరేకులల్లె ఆకులు పొదిగి - నీ కలలను నేను పండిస్తానని
బక్కరైతుతో బాసలుచేసిండా — వరిపైరు
పక్క పొలంతో పందెంగాసిందా — వరిపైరు
పైరుని నమ్మిన పేదరైతురా - ప్రభుత్వ బ్యాంకులో పెదబాబులకడ
అప్పులు సప్పులు ఆశగజేసి - ఎరువులువేసి సత్తువజేసి
పుట్టిన బిడ్డల పైరును పెంచిండా — రైతన్న
పుట్టెడు ఆశలు తనపై బెట్టిండా — రైతన్న
రైతునుజూసి కన్నుకుట్టిన - ఊరిలోని భూస్వామిగాడురా
తూముకు మొగుదాలి తనకయ్యలను - కుతికలలోతు నీళ్ళతో నింపి
రైతు పొలంను ఎండగొట్టినాడా — భూస్వామి
రెచ్చిపోయి అరె పిచ్చిగ నవ్విండా — భూస్వామి
మేలిమి బంగరులాంటి పంటరా - మలమల మలమల మాడిపోయినది
నీళ్ళులేక అయ్యొ నోళ్ళెళ్ళబెట్టి - యుద్ధవీరునిల వొరిగిపోయినది
ఆకాశంవైపు ఆశగ జూసిండా — రైతన్న
ఆశలు గుల్లయ్యి గొల్లున ఏడ్చిండా — రైతన్న
అయ్యొ తీసిన చమట తాళైదక్కెను - పోసిన నెత్తురు తరకై మిగిలెను
కాయకష్టమే కటిక నష్టమై - చేసిన అప్పులు మెడకు చుట్టుకొని
మరణమే నాకు శరణమన్నాడా — రైతన్న
మగాణం నీకు శెలవే అన్నాడా — రైతన్న
అరే స్వతంత్ర భారతదేశంలోన - సచ్చే హక్కు నీకు యాడిది
చేసిన అప్పులు చెల్లించకుండా - సచ్చుట నేరం శిక్షిస్తామని
రైతు చేతులకు బేడీలేసిందా — సర్కారు
చావుకుకూడా ఖరీదుగట్టిందా — సర్కారు
రోజు రోజు గిట్ల సచ్చేకన్నా
బతుకు పోరు - అరె బతుకు పోరు
ఛల్ బతుకు పోరులో చావుట మిన్నని

కంటినీరు పోసి కత్తులు నూరిండా — రైతన్న
పొంటి పేగు పెరికి వాడిశేలిసిరింగా — రైతన్న
దండకరిణ్యం దారేబట్టిండా — రైతన్న
ఎర్రదండుకు గుండో నేనండా — రైతన్న

॥ఎర్రదండుకు॥

—కో. ప్ర.

అడ్వాన్స్

మోళ్ళు చిగురిస్తున్నాయి - ఎండిన బీళ్ళూ చిగురిస్తున్నాయి
ఒక్కొక్క గ్రీష్మంలోనుండి కళ్ళుతెరుస్తున్న చిగుళ్ళు
ప్రాణం పోసుకొని ప్రతిహరితాన్ని గుండెలనిండా నింపుకుంటున్నాయి
పచ్చగా పసరు కక్కుతున్న లేచిగుళ్ళు
ఆలివ్ గ్రీన్‌తో ఒరెయిన్‌ను ఐక్యంచేస్తున్నాయి
మౌనం, విషాదం రాజ్యమేలినచోట
విరంతర చలన ప్రవాహ కలకలం కదలబారుతుంది
కన్హాట్ నేషనల్ పార్క్ ఎర్రగా కదుంగట్టి కదులుతుంది
క్రూరజంతువులపై సాధుజంతువులు సమరానికి సై అంటున్నాయి
అబూజ్ మహాడ్* అమరత్వానికి ప్రతీకలా
అమరత్వ శిఖరంపై నిలిచిన యుద్ధశకటంలా
నిబ్బరంగా నిలిచి ఉంది
దండకారణ్యం మొత్తం దండోరా.... ఒకటే దండోరా .
ప్రతి మలుపు బంకర్‌లా, ప్రతి లోయ కందకంలా
పొంచి ఉన్నాయి
లెఫ్ట్ రైట్ లెఫ్ట్.... లెఫ్ట్ రైట్ లెఫ్ట్
లెఫ్ట్ రైట్ లెఫ్ట్... లెఫ్ట్ రైట్ లెఫ్ట్
లెఫ్ట్ ... లెఫ్ట్ ... లెఫ్ట్ ...
డౌన్.... పొజిషన్ ... అడ్వాన్స్ ...

* అబూజ్ మహాడ్‌పై సుమారు 300 గ్రామాలున్నాయట.

(దండకారణ్యంలో పర్యటించిన జననాట్యమండలి కామ్రేడ్ అనుభవాల ప్రేరణతో.)

—మౌనిక్

ఇదీ....వరస!

ఇదో.... విన్నే.... వింటున్నావా? రేపు నాకు సన్మానమే పిచ్చిమొద్దా!
సభకు రాకూడదూ; పొద్దుగూకులూ వంటింట్లో ఈదులాడతావు....
ఏవిటి స్పెషల్స్? బొబ్బట్లా .. ఊ....
చేతిమీదికి మంచి నెయ్యి తెప్పించావా?
సన్మానం దేనికనన్నా అడిగావా? మహాజడత్వం!
'స్త్రీ విముక్తి' గేయాలు రాసినందుకు.
అంటే ఏమిటంటావా? చెప్పినా అర్థంకాదులే మట్టిబుర్రకి.
పుల్ల మజ్జిక్కి పోపువేసి, ఉల్లిముక్కలు తిరిగెయ్యి
కొత్తిమిర మరిచేవు... ఆఁ! అలా వీధిలోకెళ్ళొస్తా, తలుపేసుకో
ఏమేవ్ నిన్నే! నాలుగు పచ్చిమిరపకాయలు వేయించు.... వినబడిందా....
ఏవిటో నాలాంటివాడికి నీలాంటి పెళ్ళాం.... ప్చ్ ..

* * *

ట్రింగ్...ట్రింగ్...ట్రింగ్... హలో! నేనే... లంచ్‌కి రావడంలేదు
యా....సమ్ సెమినార్ కాంపస్‌లోనే - 'విమెన్ ఎండ్ ప్రాపర్టీ రైట్స్'
నో! నో! డిసీజ్ నాట్ ద ప్లేస్ ఫర్ యూ....
తోచకపోతే క్లబ్బుకి వెళ్ళు.... అదీ విసుగయితే షాపింగ్ కెళ్ళు.
రిమెంబర్.... లాల్‌చంద్ పెరల్ నెక్లెస్ ఇచ్చేదిరోజే
ఏవిటీ! వొద్దు ... అన్నాను. దట్సాల్.
ఛ....ఛ... టు హెల్ విత్ విమెన్ లిబరేషన్.

* * *

ఏడబోయినవ్? జీతమిచ్చింన్రా?
రెంన్రూపాలిలగియ్యి బొత్తగ పైసల్లేవు.
గంటాయి చూస్తున్నా.... ఏడబోయినవ్?
ఏంది బెల్లంగొట్టిన రాయోలె మాట్లాడవు ...
ఎట్టా! ... అదోళ్ళ మీటింగుకి పోయినవా!
పైసల్లేవా! ... నూకలు కొన్నావా?....
ఆడముండకి మీటింగు కావల్సొచ్చెనా? ...
ఫట్....ఫట్....ఫట్....

—భారతి

విశ్వనాథ సాహిత్యం, మత, కుల విషం

—త్రిపురనేని మధుసూదనరావు

రాజు శాశ్వతముగా జీవించుసుగాక.

"సముద్రపు దిబ్బ నవలలో విశ్వనాథ ఏం చెప్పాడు? విప్లవాల్ని గురించి చెప్పాడు" అంటాడు వల్లభాచారి. విప్లవాల్ని గురించి ఏం చెప్పాడు? విప్లవాల్ని వ్యతిరేకించాడా? సమర్థించాడా? విప్లవాల్ని గురించి శాస్త్రీయంగా చెప్పాడా? పిట్టకథలు చెప్పాడా? ఏ దేశంలో జరిగిన, ఏ విప్లవాల్నిగురించి చెప్పాడు? ఇలాంటి మౌలిక ప్రశ్నల్ని గురించిన చర్చలేకుండా నవలలో వస్తువుని మరుగుపరిచి పాఠకుల్లో తప్పుడు అభిప్రాయాల్ని కలిగించటానికి వల్లభాచారి కుటిలప్రయత్నం చేశాడు విశ్వనాథ సముద్రపు దిబ్బ నవలను 1960లో రాశాడు. ఆనాటి సామాజిక, రాజకీయ పరిస్థితులు ఏమిటి? 1955లో పత్రికలద్వారా ఇతర ప్రచార సాధనాలద్వారా కమ్యూనిజంమీద పాలక వర్గాలూ, ఆ వర్గాల రచయితలూ, పాత్రికేయులూ, కళాకారులూ భయంకరమైన, వికృతమైన అత్యంత జుగుప్సాకరమైన విషప్రచారం చేశారు కమ్యూనిస్టుపార్టీ అధికారంలోకి వస్తే భారతీయ సంస్కృతి నాశనం అయిపోతుందనీ, వ్యక్తి స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు సమాధి అయిపోతాయనీ, దారుణమైన హింసాకాండ జరుపుతుందనీ, రైతులనుంచి భూమి లాగేసుకుంటుందనీ, స్త్రీలను సమాజపరంచేసి విశృంఖల లైంగిక సంబంధాల్ని ప్రవేశపెడుతుందనీ ప్రచారంచేశారు. ఈ ప్రచారదాడిని తిప్పికొట్టటంలో కమ్యూనిస్టుపార్టీ విఫలంకావడమే కాక, కొంతమంది పార్టీనాయకుల చేతలూ కూతలూ శత్రువులకే దోహదంచేశాయి. ఆ ఎన్నికల్లో పార్టీ ఘోరపరాజయం పొందటంతో పార్టి కార్యకర్తలు, సానుభూతిపరులైన అభ్యుదయ రచయితలూ, మేధావులూ నిరాశానిస్పృహలకి లోనయ్యారు. అభ్యుదయ రచయితలూ, ప్రజానాట్యమండలి కళాకారులూ సినిమారంగంలోకి, ఇతర వ్యాపకాల్లోకీ వెళ్ళిపోయారు. ఆర్థికంగా కనీస పోషణకికూడా శక్తిలేక పార్టి కార్యకర్తల సంఖ్యని తగ్గించుకుంది. ఆ కార్యకర్తలు పుస్తకాల, కాంట్రాక్టుల, హోటల్ వ్యాపారాల్లోకి పోయారు. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలోకూడా తీవ్రమైన మార్పులు వచ్చాయి. 1953లో స్టాలిన్ మరణించాడు ప్రపంచంలో ఒక పెద్ద వటవృక్షం కూలిపోయిన భావన కలిగింది. 1955లో స్టాలిన్ జన్మదినోత్సవాన్ని ఆనందోత్సాహంతో జరిపిన

సోవియట్ కమ్యూనిస్టుపార్టీ, 1956లో క్రుశ్చేవ్ నాయకత్వంలో 'వ్యక్తిపూజని ప్రతిఘటించండి' అనే పేరుతో స్టాలిన్‌ని ఒక క్రూర నియంతగా చిత్రిస్తూ తీర్మానంచేసింది స్టాలిన్‌మీద ఉధృతం అవుతున్న ఈ దుష్ప్రచారాన్ని చైనా కమ్యూనిస్టుపార్టీ ఖండించండి మహత్తర సైద్ధాంతిక సంఘర్షణ ప్రారంభమైంది. కమ్యూనిస్టు ఉద్యమంలో గందరగోళం వ్యాపించింది. దీన్తో భారత కమ్యూనిస్టుపార్టీ ఇంకా నీరసించిపోయింది. 1958 ఆవడి సమావేశంలో సమ సమాజ స్థాపన తన లక్ష్యంగా కాంగ్రెస్‌పార్టీ ప్రకటించుకుంది. 1959లో ఒక ప్రయోగంగా ఆంధ్రప్రదేశ్‌లో పంచాయితీ రాజ్యవ్యవస్థని ప్రవేశపెట్టారు. వీటితో పట్టణ మధ్యతరగతి ప్రజలూ, గ్రామాల్లోని మధ్య, పేద రైతులూ కమ్యూనిస్టుపార్టీకి దూరమయ్యారు. ఈ అన్ని కారణాలవల్లా ఆంధ్రప్రదేశ్‌లో అభ్యుదయకర, ప్రగతిశీల ప్రజాస్వామ్య శక్తులు వెనకడుగు వేయగా సామ్రాజ్యవాద ప్రజావ్యతిరేక ధోరణులు విజృంభించాయి. ఈ సాంస్కృతిక, రాజకీయ వాతావరణంలో విశ్వనాథ సత్యనారాయణ 1957లో ప్రభుత్వం స్థాపించిన సాహిత్య ఎకాడమీ ఉపాధ్యక్షులయ్యారు. 58లో శాసనమండలి సభ్యులుగా నియమితులయ్యారు. 1958-60 సంవత్సరాల మధ్యకాలంలో విశ్వనాథ మతబృందం 'జయంతి' పత్రికద్వారా సంప్రదాయిక సాహిత్యాన్నీ, గ్రాంథికభాషనీ సమర్థిస్తూ అభ్యుదయ సాహిత్యంమీదా, ఆధునిక సంస్కారం మీదా దాడిని ఉధృతంచేసింది. ఈ నేపథ్యంలో విశ్వనాథ సముద్రపు దిబ్బ నవలను పరిశీలించాలి.

సముద్రపు దిబ్బ రాజకీయ నవల. ఇందులో విశ్వనాథ రాచరికవ్యవస్థ ప్రజాస్వామ్యం, సామ్యవాదం, మతతావాదం మొదలైన రాజకీయ ఆర్థిక వ్యవస్థల్నిగురించీ, విధానాల్నిగురించీ విపులమైన చర్చ చేశాడు. కాని వీటిల్లో ఏ ఒక్క విషయంగురించీ విశ్వనాథకు సాధికారమైన పరిజ్ఞానం లేదు. కేవలం శృతపాండిత్యంతో రచనకు పూనుకున్నాడు. రాజకీయాలు వాస్తవ సామాజిక జీవితానికి సంబంధించిన వాస్తవ విషయాలు. వాటిని దేశకాల బద్ధంగా ఆచరణాత్మకంగా నిర్దిష్టంగా అధ్యయనంచేసి, విశ్లేషణచేసి అనిర్దిష్టస్థాయిలో సిద్ధాంత రూపం ఇవ్వాలి. ప్రజాస్వామ్యం అంటే కుదరదు అది ఏ దేశంలో, ఏ కాలంలో ఏ సామాజిక, ఆర్థిక పరిస్థితుల్లో ఎలా ఆవిర్భవించి, ఏరకంగా ఆచరణలో ఉన్న ప్రజాస్వామ్యమో స్పష్టంగా చెప్పాలి. ప్రజాస్వామ్యానికి సామాన్య లక్షణాలూ, ప్రత్యేక లక్షణాలూ కూడా ఉంటాయి రూపంలో సామాన్య లక్షణాలు కనిపించినప్పటికీ, సారంలో ప్రత్యేక లక్షణాల్ని సంత

రించుకుంటుంది. సారంలోకి వెళ్ళకపోతే దేనినిగురించీ వాస్తవస్థితిని చెప్పలేం. వాస్తవస్థితి తెలియకపోతే దేన్నీ మార్చలేము, అభివృద్ధిచెయ్యలేము, లోపాల్ని సవరించలేము. మన అవసరాలకూ, ఆశయాలకూ అనుగుణ్యంగా చేసుకోలేము. రాచరికవ్యవస్థ, ప్రజాస్వామ్యం, సామ్యవాదం దేనినిగురించి అయినా ఈ పద్ధతిలోనే అధ్యయనం చెయ్యాలి ఇవి పురాణాల్లోని పద్నాలుగు లోకాల్లాగా, నాలుగు యుగాల్లాగా ఊహాసృష్టి కాదు. పురోగమన క్రమంలో చారిత్రికంగా, సామాజికంగా ఏర్పడే వ్యవస్థలు. ఇవి రూపొందటానికి భౌతిక పరిస్థితులు పరిపక్వం కావాలి. వానిని సాధించటానికి ప్రజలు చైతన్యవంతులై సంసిద్ధులు కావాలి. అది ఒక సుదీర్ఘ, సంకీర్ణ చలనక్రమం. ఈ మార్పు గుణాత్మక దశకు చేరుకున్నప్పుడు పాతవ్యవస్థ స్థానంలో కొత్తవ్యవస్థ వస్తుంది. దన్నే విప్లవం అంటారు. అది రాజకీయ రూపంలో ఉండే సాంఘిక విప్లవం. అంటే సామాజిక జీవితంలోని అన్నిరంగాల్లోనూ మౌలికమైన మార్పులు వస్తాయి. విప్లవం వ్యవస్థనే మారుస్తుంది. దాన్నిబట్టి ప్రభుత్వరూపాలు మారతాయి. భూస్వామ్య వ్యవస్థ, పెట్టుబడిదారీ వ్యవస్థ, సమసమాజ వ్యవస్థల్ని వ్యవస్థలు అంటారు. రాచరికం, ప్రజాస్వామ్యం, సామ్యవాదం ప్రభుత్వ రూపాలు అంటారు. ఈ స్వల్ప విషయంకూడా విశ్వనాథకు తెలియదు. విప్లవం చేసేది ప్రజలు విప్లవం హింసాయుతంగానే ఉంటుంది. పాలకవర్గ హింసని, రాజ్యహింసని, వ్యవస్థీకృతహింసని ప్రజలు విప్లవహింసతో ఎదుర్కొంటారు ఆందోళన, తిరుగుబాటు, ప్యాలస్‌కుట్ర, సంస్కరణలూ యథాతథ స్థితిని కాపాడటానికి అవసరమైన మార్పుల్ని సాధించటానికి మాత్రమే సాధనాలు. భారత జాతీయోద్యమం విప్లవం కాదు. భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజులు చేసింది విప్లవం కాదు. కాంగ్రెస్ పార్టీ స్థానంలో జనతా పార్టీ రావటం విప్లవం కాదు. ఆ స్థానంలో కమ్యూనిస్టుపార్టీ వచ్చినా విప్లవం కాదు 1972లో భుట్టో పాకిస్తాన్‌లో పార్లమెంటరీ విధానాన్ని అధ్యక్షపాలనగా మార్చటం విప్లవం కాదు సైనిక తిరుగుబాటు విప్లవం కాదు. ఇందిరా గాంధీని సిక్కులు హత్యచేయటం విప్లవం కాదు. ప్రజలు ఒక వర్గాన్ని రాజ్యాధికారంనుంచి కూలదోసి అంతకంటే ప్రగతిశీలమైన వర్గాన్ని రాజ్యాధికారంలోకి తీసుకువస్తారు. విప్లవానికి ఒక సిద్ధాంతం, వ్యూహం, ఎత్తుగడలు, ప్రజా పునాది సాధించబోయే సమాజంమీద ఒక స్పష్టమైన దర్శనం ఉంటాయి. ఏ చిన్న మార్పు అయినా విప్లవమే అని వాదంకోసం ఆమోదించినా, ఆ మార్పులకుకూడా భౌతిక కారణాలు ఉంటాయి. విప్లవం సమాజం కోసం

సమాజంలో కారణాలనుంచీ జరిగేదే. విప్లవం ఊహాజనిత కారణాలవల్ల రాదు. కొద్దిమంది ఇష్టాయిష్టాలవల్ల రాదు.

"స్వపక్షమును సమర్థించుట పరపక్షములను నిందించుట. ఓహో మానవబుద్ధి ఆ పక్షమునకు చెందినవాని కా గ్రంథము లారాధ్యములు. ఇతర పక్షములను ఖండించుటలో వాదనా బలహీనత యెంతయున్నను వారికి సమంజసముగానే కనిపించును. తమ పక్ష సిద్ధాంతములే సముచితములుగా, తర్కసహనములుగా కనిపించును" (స. ది. 531) ఇది విశ్వనాథకి అన్వయించినంతగా తెలుగు సాహిత్యంలో మరొకరికి అన్వయించదు అది మానవ బుద్ధి కాదు. మత్తమూఢవిశ్వాసబుద్ధి. మతవాదులందరూ పుస్తకపూజామూఢులే వేదాలు అపౌరుషేయాలు అన్నది ఎవరు? వేదాల్ని ప్రమాణగ్రంథాలుగా అంగీకరించని వాళ్ళని నాస్తికులనీ, పాషండులనీ తిట్టిందెవరు? వేదాల్ని ధిక్కరించిన చార్వాకుల్ని చంపిందెవరు? మనుధర్మాన్ని అనుసరించకపోతే కఠోరశిక్షలు విధించింది ఎవరు? గీతా గీతా భగవద్గీతా అని రోడ్లమీద అరుస్తున్నది ఎవరు? విశ్వనాథ. విశ్వనాథ ఆరాధించే ఆయన పూర్వులు. ఆయన శిష్యులూ "సంశయాత్మావినశ్యతే" అన్నది మీరు. "సర్వధర్మాన్ పరిత్యాజ్య మామేకం శరణంవ్రజ" అన్నది మీరు. ఖొరాన్‌ని విమర్శిస్తే మరణదండన విధించే మత నియంతలూ, బైబిల్‌ని ఆరాధించేవాళ్ళూ మీ సంప్రదాయాన్ని అనుసరించే వాళ్ళే. ఏ పుస్తకమైనా ఎవడో ఒకడు రాసిందే. వాడూ మనలాంటి మనిషే. పుస్తకపూజ మూర్ఖుల లక్షణం. ఒక పుస్తకాన్ని అయినా, ఒక నాయకుడ్ని అయినా, ఒక మత ప్రవక్తని అయినా విమర్శకు అతీతంగా భావించడం మనోవికాసానికీ, సత్యాన్వేషణకీ, మానవ వ్యక్తిత్వానికీ గొడ్డలిపెట్టు. మతవాదులయినా, మార్క్సిస్టులయినా, గాంధీయిస్టులయినా మరొకరయినా పుస్తకపూజా సిద్ధాంతాన్నీ, పురుషోత్తమ సిద్ధాంతాన్ని ఆమోదించటం అధమాధమమైన పని. గుడికోసం, బోడిగుండ్లకోసం, జండాలకోసం ప్రాణాలు తీసుకోవడం ఆటవిక సంస్కృతికంటే హీనం అధికార గ్రంథాలు వేరు. ప్రమాణగ్రంథాలు వేరు. అధికార గ్రంథాల్ని పూజిస్తారు. వాటిల్లో ప్రతి వాక్యాన్ని విశ్వసిస్తారు తు చ తప్పకుండా పల్లిస్తారు. పవిత్ర గ్రంథాలుగా భావిస్తారు. వాటిమీద ఈగనుకూడా వాలనివ్వరు. వాటిని విమర్శిస్తే దైవద్రోహమని నిరసిస్తారు. ఒక్క మాటలో చెప్పాలంటే అధికారగ్రంథాలు మనుషుల్ని బానిసలుగా, కేవలం విశ్వాసులుగా చేస్తాయి. ప్రమాణ గ్రంథాలు విజ్ఞానానికి మూలగ్రంథాలు. ఎవరో ఒక మేధావి ప్రకృతికో, సమాజానికో సంబం

ధించిన ఏదో ఒక విషయంమీద విపులమైన అధ్యయనంచేసి, ప్రయోగంచేసి సహేతుకంగా ఒక సిద్ధాంతాన్ని, ఒక సమాచారాన్ని ప్రతిపాదించిన గ్రంథాన్ని ప్రమాణ గ్రంథం అంటారు. ఆ గ్రంథంలోని ప్రతి వాక్యాన్ని విమర్శించవచ్చు ఇది తప్పు ఇది ఒప్పు అని ఖండితంగా చెప్పవచ్చు. ఆ సిద్ధాంతాన్ని ఇంకా అభివృద్ధి చేయవచ్చు. సృజనాత్మకంగా జీవితానికి అన్వయించవచ్చు. ఒక్కమాటలో ప్రమాణ గ్రంథాలు విజ్ఞానానికీ, ఆచరణకీ మార్గదర్శకంగా, సత్యాన్వేషణకి సాధనాలుగా ఉపయోగపడతాయి. విశ్వనాథ అధికార గ్రంథ ఆరాధకుడు. విశ్వాస పంజరంలో చిలక. స్వపక్ష సమర్థనలో పరపక్ష ఖండనలో విశ్వనాథకున్న బలహీనత, దాన్ని కప్పిపుచ్చుకోవటానికి ఆయన చేసే కుటిల తర్కం మరి ఎవ్వరూ చేయలేదు. కార్యానికి కారణం చెప్పవలసిన చోట, వాదానికి ప్రమాణం చెప్పవలసినచోట అదృష్టం, కర్మ, జన్మ, భగవంతుడ్ని లాక్కురావటంకంటే వాదబలహీనత ఏమున్నది? విశ్వనాథ సముద్రపు దిబ్బ నవల అంతా ఆయన వాదబలహీనతకి ప్రత్యక్ష నిదర్శనం.

సముద్రపు దిబ్బ నవల కాకులు దూరని కారడవి. చీమలు దూరని చిట్టడవి. నిర్మాణ శైథిల్యం, వస్తుగందరగోళంతో నిండిన ఈ నవలని ఎంతో ఓర్పు, సహనం, ఏ పుస్తకమైనా చదివే అలవాటు ఉన్నవాళ్ళు తప్ప సాధారణ పాఠకులు చదవలేరు. పౌరాణిక, జానపద, సాంఘిక విషయాల్ని కలగలిపి తీస్తున్న తెలుగు సినిమావంటి నవలారాజం ఇది సముద్రపు దిబ్బలో నాలుగు దేశాలు ఉన్నాయి అందులో ఒకటి తూర్పుదేశం. అ తూర్పుదేశంలో రాచరిక వ్యవస్థ పతనమైంది. కులీన వ్యవస్థ వచ్చింది. అది పతనమైంది. ప్రజాస్వామ్యం వచ్చింది అది పడిపోయింది సామ్యవాద పరిపాలన వచ్చింది. అది పతనమైంది. సైనిక పరిపాలన వచ్చింది. అది పోయింది. మళ్ళీ రాచరిక వ్యవస్థ వచ్చింది. ఈ రాకపోకలు ఊరికినే జరగవు. మధ్యలో చిన్నసైజు విప్లవాలూ, కుట్రలూ, హత్యలు జరుగుతాయి. "మరల రాజు, మరల ప్రజాస్వామికము, అందులో మరల నిన్ని భేదములు, మరల సామ్యవాదము చక్రనేమి క్రమేణ." (590) అంటే చరిత్ర పునరావృత్తం అవుతుంది. ఎలా అవుతుంది? చక్రనేమి అంటే ఏమిటి? బండికంటి కడకమ్మిని నేమి అంటారు ఇది చక్రంతోపాటు వృత్తాకారంలో తిరుగుతూ వుంటుంది. అలాగే రాజు, ప్రజాస్వామ్యం, సామ్యవాదం మళ్ళీ రాజు క్రమంలో చరిత్ర పునరావృత్తం అవుతుంది. చక్రనేమిది యాంత్రిక చలనం. ఆ చలనంలో వైవిధ్యం ఉండదు. మరి విశ్వనాథ చెపుతున్న చరిత్ర చలనంలో వైవిధ్యం

ఉండే. అలాగే నేమి చలనంలో పురోగమనం ఉందా లేదా అనేది నేమి చలనంలో చూడకూడదు. ఆ చలనంద్వారా అది బండిని ఒక ప్రదేశంనుంచి ఇంకొక ప్రదేశానికి వెళ్ళటానికి దోహదం చేయటంలో చూడాలి. బండి ఆగి పోతే నేమిచలనం ఆగిపోతుంది చరిత్రచలనం ఎక్కడా ఆగిపోదే కాబట్టి గతి తార్కికమైన సామాజిక చలనాన్ని చక్రనేమి యాంత్రిక చలనంతో పోల్చటం అర్థరహితం. సరే, పోలిక విషయం వదిలేసి, అసలు చరిత్ర పునరావృత్త మవుతుందా కాదా ? కాదు. ఒక నిర్దిష్ట సమాజంలో భూస్వామ్య వ్యవస్థపోయి బూర్జువా వ్యవస్థ వస్తే మళ్ళీ తిరిగి భూస్వామ్య వ్యవస్థ రాదు. ఏ వ్యవస్థల విషయం అయినా అంతే. ఇప్పుడు సోవియట్ రష్యాలో వస్తున్న మార్పులు తిరిగి జార్ల పరిపాలనని పునరుద్ధరించలేదు. ఫ్యూడల్ వ్యవస్థ తిరిగిరాదు. ఆ మార్పులవల్ల వచ్చేది కొత్తదే. ఆ కొత్త మంచా చెడా అనేది వేరే విషయం ఒక వ్యవస్థ పోయినప్పుడు ఆ వ్యవస్థలోని ప్రగతిశీల అంశాలు కొత్త వ్యవస్థలో ప్రవేశించి సారంలోనూ రూపంలోనూ ఉన్నత స్థాయిని పొందుతాయి. దీన్నే అభావం అభావం కావటం అంటారు. చరిత్ర పురోగ మిస్తుందేకాని పునరావృత్తం కాదు. విశ్వనాథ భావిస్తున్నట్టు, కోరుకుంటు న్నట్టు చరిత్ర పునరావృత్తమయినా రాజుతో ప్రారంభమై మళ్ళీ రాజును చేరు కోవటం ఏమిటి? రాచరిక వ్యవస్థకంటే ముందు మానవజాతికి కొన్నివేల సంవత్సరాల చరిత్ర ఉందని పదోతరగతి పిల్లలకికూడా తెలుసుగదా? పాత రాతియుగాల్లో, కొత్త రాతియుగాల్లో, ఆదిమ గణ సమాజాల్లో, ఎంతో అభివృద్ధి పొందిన సింధు, హరప్పా సమాజాల్లో రాజు లేడే? ఎప్పుడో భూస్వామ్య వ్యవస్థో, ఏషియాటిక్ వ్యవస్థో పటిష్ఠమైనప్పుడు దాని కేంద్రీకృత రాజకీయ రూపంగా రాజు వస్తాడు. విశ్వనాథ స్వప్నం ప్రకారం చరిత్ర పునరావృత్తం కావాలంటే మళ్ళీ తిరిగి ఏ మంచు యుగాల్లోకో వెళ్ళాలి. కానీ అలా కాదు. చరిత్ర 'విశ్వనాథ మహర్షి' ఇష్టం వచ్చినట్టే పునరావృత్తం అవుతుంది. అసలు విషయం ఏమిటంటే కుహనాచరిత్ర పునరావృత్త సిద్ధాంతం ముసుగులో విశ్వనాథ రాచరిక వ్యవస్థ శాశ్వతం అని చెప్పదలచుకున్నాడు. మనుధర్మ రక్షణార్థం, బ్రాహ్మణ క్షత్రియ శాశ్వత సఖ్యత రక్షణార్థం రాచరిక వ్యవస్థ చిరంజీవంగా ఉండాలి ఉంటుంది. విశ్వనాథ చరిత్రని గుర్తించడు. చరిత్రని గుర్తిస్తే చరిత్రలో మార్పుల్ని గుర్తించాలి మార్పుల్ని అంగీకరిస్తే మనుధర్మానికి కాలదోషం పట్టే దశని అంగీకరించాలి. అది ఇష్టంలేదు కాబట్టి దేవుడు శాశ్వతం, మానవులు అశాశ్వతం; రాజు శాశ్వతం, ప్రజాస్వామ్య

సామ్యవాదాలు అశాశ్వతం అని చెప్పదలుచుకున్నాడు కాబట్టి విశ్వనాథకి 'దివ్యదృష్టే' కానీ చారిత్రకదృష్టి అవసరంలేదు.

"రాజున్నప్పుడు రాజు చేసిన సంఘవ్యవస్థ లేదు. అనాదినుండి వచ్చుచున్న సంఘవ్యవస్థయే వ్యవస్థ. ఆ వ్యవస్థ నెవరు చేసిరో తెలియదు. మానవులు జీవించుచుండగా నా వ్యవస్థ దానియంతటనది యేర్పాటైనదేమో తెలియదు. అంత సహజముగా నా వ్యవస్థ యేర్పాటైనచో నట్లేర్పడుటకు గారణములు సంఘమునందే యుండియుండవలయును. మానవబుద్ధికి సహజములై యుండవలయును మానవుడు బ్రతికెడి వైఖరిలో దాని రహస్యము లిమిడియుండవలయును. అది భగవంతుడు చేసినదని చెప్పవచ్చును." (329-30) ఒక శాశ్వతమైన తుది మొదలు లేని ఒక సనాతనధర్మం ఉంది. అది స్వయంభవం. అంటే దానిని భగవంతుడు సృష్టించాడు. 'మనుధర్మమే ఆ సనాతనధర్మం. దాన్ని మత్స్యన్యాయంనుంచి రక్షించటానికి భగవంతుడే ఆదిరాజును సృష్టించాడు రాజుకంటే సనాతనధర్మం గొప్పది "రాజు నిత్యముగా జీవించునుగాక. పలుమంది రాజులు చనిపోయిన జనిపోవుదురుగాక. రాజన్నవాడు బ్రతికియే యుండవలయునని యర్థము. అనగా రాజు నిత్యుడు. వానికి చావులేదు. ఆ జాతి నిర్మించుకొన్న యీ నిత్యుడైన రాజు శబ్దమున కర్థమేమి? ప్రజలున్నచో రాజుండును. రాజు ప్రజలను పాలించవలయును. ప్రజలు పాల్యులు. రాజు పాలకుడు." (12) భారతీయ రాచరిక వ్యవస్థకు మనుధర్మం రాజ్యాంగం. రాజు లేకపోతే మనువు లేడు మనువు లేకపోతే రాజు లేడు. అందుకని రాజు నిత్యముగా జీవించునుగాక, మనుధర్మం వర్ధిల్లాలి. విశ్వనాథ నిర్భరానందంతో నాట్యంచెయ్యాలి ఇలా ఈ నవలలో ప్రజాస్వామ్యం, సామ్యవాదం మన దేశానికి పనికిరావనీ, మనుమార్గవర్తనుడైన రాజు పరిపాలనమే మన దేశానికి అనుగుణ్యమైనదనీ కూటతర్కంతో, వికృతీకరణలతో, దుర్వ్యాఖ్యానాలతో, అబద్ధాలతో నిరూపించటానికి ఊహాయుద్ధం చేశాడు.

సముద్రపుదిబ్బలో తూర్పు దేశం భారత దేశమే అనుకోవాలి. అయితే అది ఏకాలంలో భారత దేశమో చెప్పటం సాధ్యంకాదు. అలాగే అది ఉత్తర భారత దేశమో, మధ్య భారత దేశమో, దక్షిణ భారత దేశమో తెలియదు. అది విశ్వనాథ ఊహాజనిత భారత దేశం అనుకోవాలి. ఆ దేశాన్ని తులానాథుడనే రాజు పరిపాలిస్తున్నాడు. ఈ రాజు గొప్పవాడే కానీ ఎందుచేతనో భోగలాలసుడయ్యాడు. ప్రజలమీద పన్నులు ఎక్కువ వేశాడు. అతడు రాజ్యంలోకానీ రాజధానిలోకానీ ఉండేవాడు కాడు. భార్య ఇందుమతితో కలిసి సముద్రంలో

ఎక్కడో విశ్వనాథ 'మంత్రిదండం' సృష్టించిన భోగదీవిలో ఉండేవాడు. సంవత్సరానికి ఒకసారి దేశ రాజధాని లక్షణాపురం వచ్చి నాలుగు రోజులు ఉండిపోతుంటాడు. పరిపాలనాభారం అంతా మంత్రి జీవలుడు మోసేవాడు. ఈ జీవలుడు దుర్మార్గుడు హరిప్రసాదుడనే పండితుని ఆస్తిని కాజేసి తన అల్లుడికి ఇచ్చుకున్నాడు. ప్రశ్నించినందుకు హరిప్రసాదుడ్ని కారాగారంలో పడేస్తాడు. తులానాథుడు రాజ్యభ్రష్టుడవుతాడని జోస్యం చెప్పినందుకు మత్స్య నాథుడనే జ్యోతిష్కుడ్ని బంధిస్తాడు. పత్రికలో జీవలుడ్ని విమర్శించినందుకు అక్రూరుడనే పత్రికాధిపతికూడా బంధితుడవుతాడు. రాజుల కాలంలో పత్రిక లుండేవా అనే విషయం అడగకూడదు. ఇలా పండితుల్ని కారాగారంలో పెట్ట టంతో ప్రజల్లో అశాంతి వచ్చింది పరగణాల్ని నాడుల్ని పరిపాలించే రాజ ప్రతినిధులుకూడా దుర్మార్గాలు చెయ్యటంతో అశాంతి ఇంకా పెరిగింది. "దేశము నందలి పండితులను వ్యతిరేకులుగా జేసికొనుటకంటె యొక రాజుయొక్క నీతి లేదు" (109), "పండితులనగా వీరు పోయి ప్రజలకు బోధింతురు. వారి సాంఘికాచారములు, వారి మతవిశ్వాసములు, వారి దేవతాది పూజలు, వారి పండుగలు, పబ్బములు, వారి ఇండ్లలోని వ్యాధులు, పెండ్లిండ్లు, జననములు, మరణములు సర్వము నెరిగి వారికి తోడ్పడువారు పండితులు. వారికి మంచి చెడ్డలు చెప్పుదురు. నేడు తూర్పుదిశకు ప్రయాణము మంచిదికాదు. క్రొత్తగా కోడలినింటికి నీనాడు తీసుకొనిరారాదు. ఎల్లుండి మంచిది. ఈ పనిని నీవు ప్రారంభించవచ్చును మొదలైన నిజజీవితములోని దగ్గరితనమునకు రాజున కేమి సంబంధము." (111), "ప్రజాజీవితమును పండితులు పాలింతురు" (111) ఈ పంచాంగంపండితులు మంత్రులకు వ్యతిరేకంగా ప్రజల్లో ప్రచారం ప్రారం భించారు. గ్రామాలకు వెళ్ళి చక్కగా భోజనంచేసి ఉపన్యాసాలు చెప్పారు. "సామర్థ్యముచేత పరోపకార బుద్ధిచేత నన్యాయమును నధర్మమును సహించ లేని తీవ్రమైన ధర్మప్రవృత్తిచేత వారు నాయకులు." (133) వీళ్ళు రాజుకు వ్యతిరేకంగా మాట్లాడరు. మంత్రులకు వ్యతిరేకంగా మాట్లాడతారు. "మహా రాజు దయావంతుడు, సత్పురుషుడు" (143) అని చెపుతారు మైనారిటీ మత నాయకుడు సేనాతరభ దేవాలయంలోని చెరువులో విషం కలుపుతాడు ఆ నీళ్ళు తాగి మెజారిటీమతం జనం చస్తారు. జీవలుడు రహస్యంగా ఆ మతం పుచ్చు కున్నాడు కాబట్టి అతనిమీద చర్యతీసుకోడు. దీన్తో శకునాల పండితులకీ, చిలక జోస్యం పండితులకీ, శబ్దమంజరి పండితులకీ ఇంకా కలవరం పుడుతుంది. భోగదీవికి పోయి రాజును కలుసుకోవటానికి ప్రయత్నించి విఫలమవుతారు.

ఇక లాభంలేదని పండితబృందం జీవలుడ్ని బంధిస్తారు. లక్షణాక్షరాన్ని ఆక్రమించుకుంటారు. రాజువచ్చి చాలా సాత్వికంగా ఈ రాజ్యాన్ని మీ ఇష్టం వచ్చినట్టు పరిపాలించుకోవచ్చునని పండిత ప్రజానాయకులకు చెప్తాడు. పండిత ప్రతినిధి మేధావి "మహారాజా! తమరు సాక్షాద్భగవంతుడని నేను భావించుచున్నాను. ఒక్క ప్రాణి హింసింపబడకుండ నొక్క నెత్తురుబొట్టు గారకుండ తమరింతటి మహాకార్యమును సులభముగా బరిష్కరించితిరి. తమరే మహారాజులు, తమరి యాజ్ఞప్రకారమే యీ రాజ్యాంగము నిర్వర్తింపబడును" (2.5-6) విప్లవం విజయవంతమైంది. ప్రజాస్వామ్యం వచ్చింది. నాలుగు పేజీల తర్వాత రాజు కనపడడు రైళ్ళు, విమానాలూ వచ్చాయి. నూతన విద్యావిధానం వచ్చింది. పెట్టుబడిదారీ సమాజాన్ని పోలిన సమాజం వచ్చింది. ఇంతకీ పండితులు రాజుని దించేసి ప్రజాస్వామ్య సమాజాన్ని తీసుకురావడం ఏ కాలంలో ఏ దేశంలో జరిగింది? ఇది బ్రాహ్మణ ప్రజాస్వామ్యం. విశ్వనాథ ట్రేడ్ మార్క్ ప్రజాస్వామ్యం "అక్రూరుడు రాజ్యమునకు వచ్చిన మొదటి దినములలో ప్రజాస్వామికి భావములు లేతగా నుండెను. అక్రూరుడు, మత్స్యనాథుడు, హరిప్రసాదుడు, మేధావి, శ్రీనివాసుడు మొదలైనవారిందరు ప్రథమకులజులు. చదువుకొనుటకు, చదువు చెప్పుటకు, విద్యకు సంబంధించిన సర్వ వ్యవహారములు తీర్చుటకు, మానవునియందు సహజముగానున్న పరలోక వాంఛకు ననుగుణములైన యాచారములు నిర్వహించుటకు నేర్పడిన కులమది. వారే ప్రజాప్రతినిధులైరి. వారే యధికారులైరి. వారే వివేకులైరి. వారే ప్రపంచమును రక్షించుట కాధారభూతులైరి" (344) ఇది బ్రాహ్మణ కుల శక్తి. ఇక్కడ విశ్వనాథ కొత్తగా చెప్తున్నది ఏమంటే మానవులకు పరలోక వాంఛ సహజం. బ్రాహ్మణులు భారతదేశాన్ని మాత్రమేకాదు ప్రపంచాన్ని రక్షించారు. ఈ అబద్ధాలమీద వ్యాఖ్యానించటానికి ఏముంది? చరిత్రలో మనకి తెలిసి కులీన పరిపాలన అని ఒకటుంది. వారసత్వపు హక్కులు, ప్రత్యేక అధికారాలూ గల సంపన్నబృంద పరిపాలన. కులీన పరిపాలన ఫ్యూడల్ యుగంలోనే ఉంటుంది. ప్రజాస్వామ్యంలో వాళ్ళకి రాజ్యాధికారం పోయినా ప్రత్యేక ప్రతిపత్తిగల బృందంగా చెలామణి అవుతూనే ఉంటారు. విశ్వనాథ చెపుతున్న ప్రథమకులజ ప్రజాస్వామ్యానికీ దీనికీ రూపంలోనేకానీ సారాంశంలో పోలికలేదు. ఇలాంటి పండితులు ప్రజాస్వామిక విప్లవాన్ని తీసుకురాలేరు. కనీసం ఆ విప్లవానికి మేధావులుగా కూడా ఉండలేరు. ప్రపంచ చరిత్రలో తొలి ప్రజాస్వామిక విప్లవం ఫ్రెంచి విప్లవం. బూర్జువా వర్గనాయ

రత్వంలో స్వాతంత్ర్యం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం అనే మహత్తర నినాదాలతో స్త్రీపురుషులు అసంఖ్యాకంగా పాల్గొని చేసిన విప్లవం. ఆధునిక ప్రపంచ చరిత్రకి అది సమరగీతాన్ని ఆలపించింది. అందులో మహామేధావులుకూడా పాల్గొన్నారు ఫ్యూడల్ మత భావజాలానికి వ్యతిరేకంగా బూర్జువా ప్రగతిశీల భావాల్ని ప్రచారం చేశారు. దీని ఫలితంగా నాస్తిక, హేతువాద, సామ్యవాద ఉద్యమాలు వచ్చాయి రాజధాని భగవంతుడిగా భావిస్తూ, మత మూఢ విశ్వాసాల్ని మంత్రతంత్రాల్ని నమ్మే వారిసత్వ ఫ్యూడల్ పండితులు విప్లవాన్ని సమర్థించటంకూడా సాధారణంగా జరగదు.

పోనీ, విశ్వనాథ ఒక విప్లవం కల్పించాడు. ప్రజాస్వామ్యం వచ్చింది. మళ్ళీ దానిమీద విప్లవం ఎందుకు? అక్రూరాదులు చేస్తున్నది ప్రజాస్వామికము కాదు రాజుకంటే అధమంగా పరిపాలిస్తున్నారు "అక్రూరునికంటె పూర్వము తులానాథుడు వేయిరెట్లు మెరుగు. అక్రూరునికంటె జీవలుడు పదివందలరెట్లు మెరుగు" (273) అని గాఢంగా భావించేవాళ్ళు లేచారు ఈ వ్యతిరేక భావం కలవాళ్ళు ఒక సమితిగా ఏర్పడ్డారు. భానుశాలుడు, నీలకంఠం, కాలాది, నలరాజు, దేవాంతకుడు, హరిశ్చంద్రుడు ఆ సమితిలో సభ్యులు. అక్రూరాదుల్లో వీళ్ళు ఏ విషయాల్లో విభేదిస్తున్నారు? వీళ్ళ ప్రసంగాల్నిబట్టి ప్రభుత్వం అవినీతికి, ఆశ్రితపక్షపాతానికి, బంధుప్రీతికి ఆలవాలమయింది. ఎన్నికల్లో మనుషుల్ని ఎన్నుకోవటంలేదు. రాజకీయపక్షాల్ని ఎన్నుకుంటున్నారు. దేశానికి అక్రూరాదులు స్వాతంత్ర్యం తెచ్చారనేది నిజంకాదు. తులానాథ మహారాజు మంచివాడు కాబట్టి స్వాతంత్ర్యం వచ్చింది. "ఇతడు (అక్రూరుడు) మన జాతి సంప్రదాయములకు విరోధి. మన దేశములో నొక మతమున్నది. ఈ మతమున కితడు విరోధి. మతముయొక్క ప్రసక్తి లేకుండా రాజ్యాంగము నడుపవలయునని యతని సిద్ధాంతము" (279) లౌకికవాదాన్ని అనుసరించటం తప్పు "మన దేశము ప్రధానముగా వ్యవసాయ దేశము ఈ వ్యవసాయమునకు పరిశ్రమలకు నొకదానికొకటి పొసగదు" (281) "ఏ సిద్ధాంతము ననుసరించి యా పారిశ్రామిక దేశములయందు విప్లవములు చెలరేగినవో యా సిద్ధాంతములనే వ్యవసాయిక దేశములందు సమన్వయపరచనెంచినచో నది పొసగదు" (281) ఏ దేశాలయినా పారిశ్రామికం కాక తప్పదు. పరిశ్రమలు అభివృద్ధికావటం సమాజానికి మంచిదేకానీ చెడుకాదు. ఈ విధంగా అక్రూరాదులమీద విప్లవం చెయ్యాలనుకున్న నీలకంఠాదులు అక్రూరాదులకంటె ప్రగతిశీలవాదులు కారు. ఆ విప్లవంద్వారా ఏ రకమైన

సమాజాన్ని సాధించదలచుకున్నారో వాళ్ళకే స్పష్టమైన అభిప్రాయం లేదు. వాళ్ళకి విప్లవంకోసం ప్రజల్ని సమీకరించే ఓపిక లేదు సమితి నిర్ణయం ప్రకారం నీలకంఠుడు ఒక సాహిత్య సభలో అక్రూరుడ్ని కాల్చి చంపుతాడు. దాస్తో ప్రభుత్వం పడిపోయి భాషారాముని నాయకత్వంలో కొత్త ప్రభుత్వం వస్తుంది దీన్ని విప్లవం అని మతివున్నవాడు ఎవడూ అనడు. కొత్త ప్రభుత్వం తెచ్చిన మార్పులు అక్రూరవధ జరగకపోయినా అనివార్యంగా వచ్చేవే. పైగా ఆ వచ్చిన మార్పులు నీలకంఠాదులు ఆశించినవి కావు. వాళ్ళది ప్రతీఘాతుక చర్యేకానీ విప్లవచర్య కాదు. విశ్వనాథ అక్రూరుని హత్యని ఇలా సమర్థించాడు "అహింస, దయ, తితిక్ష, శమము, దమము మొదలైనవి సర్వదార్థమునం దంతర్వ్యాప్తములైన విషయములు. తద్విషయములు పురస్కరించుకొని చేయబడిన సంఘవ్యవస్థ యొకటి పురాతనముగా నాదేశమునందు కలదు ఆ వ్యవస్థవలన మారుచున్న కాలమునకు ననుగుణముగా దేశము వడపనిచో దేశమునకు పతనావస్థ సంభవించునని తద్విషయముల స్పర్శలేని యొకానొక వీక్షణమైన మానవ మనోనిర్మితమైన యొక సుఖభావము నుద్దేశించి నడచుచుండెడి రాజనీతి నతిడవలంబించెను." (316) భారతీయ పురాతన వ్యవస్థనిగురించి విశ్వనాథ చెప్పినదాంట్లో ఏమాత్రం సత్యంలేదు. పూర్వ కాలంలో రాజ్యంకోసం తండ్రిని చంపిన కొడుకులున్నారు. అన్నని చంపిన తమ్ముళ్ళున్నారు. వర్ణవ్యవస్థ అసంఖ్యాక ప్రజానీకాన్ని హింసతో అణచివేసింది. శమదమాదులు గల వ్యక్తులు అన్ని దేశాల్లోనూ అన్ని కాలాల్లోనూ ఉన్నారు. విశ్వనాథ నీలకంఠుని చర్యవల్ల కొత్త ఏమీ రాలేదని చెప్పాడు మరి ఇంత బాధ్యతారహితంగా హత్యచేయించడం ఎందుకు? అహింస శమ దమాది లక్షణాల్తో కూడిన వ్యవస్థ హత్యతోకానీ నిలవదా? దేశంలో భాషా రాష్ట్రాలు వచ్చాయి. భానుశాలుడు ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యాడు నీలకంఠం కుటుంబాన్ని అతడే పోషిస్తున్నాడు. రాజ్యాంగం ఏర్పడింది పరిశ్రమలు విద్యా, వైద్యసౌకర్యాలు, విమానాలూ, రైళ్ళువంటి రవాణా సౌకర్యాలు పెరిగాయి. భాషారాముని పరిపాలనలో 1960లో భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని పోలిన ప్రజాస్వామ్యం తూర్పుదేశంలో వచ్చింది. ఈ ప్రజాస్వామ్యాన్ని విశ్వనాథ వ్యతిరేకించాడా? సమర్థించాడా? స్పష్టంగా వ్యతిరేకించాడు ఒక సిద్ధాంతాన్ని, ఒక సామాజిక వ్యవస్థనీ దేనిని అయినా వ్యతిరేకించేటప్పుడు అంతకంటే మేలైన, అభ్యుదయకరమైన దానికోసం వ్యతిరేకించాలి. అలా కాకుండా పురోగామి విషయాన్ని తిరోగామి విషయంకోసం వ్యతిరేకిస్తే ఆ

వ్యతిరేకించటానికి కూటతర్కాన్ని, కుటిలవాదాన్ని ఆశ్రయించక తప్పదు. విశ్వనాథ అపనే చేశాడు. ఫ్యూడలిజానికి వ్యతిరేకంగా విప్లవంచేసిన బూర్జువా వర్గం మానవులందరూ సమానమనీ, సమానంగా సృష్టింపబడ్డారనీ, స్వేచ్ఛగా పుట్టారనీ అందరికీ సమాన హక్కులు ఉండాలని ప్రకటించారు. ఈ విలువల నుంచి పుట్టిందే ప్రజాస్వామ్యం. హక్కులు, స్వేచ్ఛ, సోదరభావం, ఆస్తి, న్యాయం అనే భావనల సముదాయమే సమానత్వం. సహజ, సాంఘిక, రాజకీయ, ఆర్థిక, న్యాయ, అంతర్జాతీయ రంగాల్లో మానవులందరినీ ఎలాంటి విచక్షణా లేకుండా సమానంగా చూడటమే సమానత్వం. స్వేచ్ఛసమానత్వాలు అవిభాజ్యాలు. స్వేచ్ఛకోసం సమానత్వాన్నికానీ, సమానత్వంకోసం స్వేచ్ఛని కానీ బలిపెట్టకూడదు పెట్టుబడిదారీవ్యవస్థ సుస్థిరంకాగానే ఈ ప్రజాస్వామిక విలువలన్నిటికీ ఆచరణలో అర్థం మారిపోయింది. సమానత్వం అంటే పెట్టుబడిదారుల మధ్య సమానత్వంగా, శ్రామికుల మధ్య సమానత్వంగా, స్వేచ్ఛ బూర్జువా వర్గానికి దోపిడీచేసే స్వేచ్ఛగా, శ్రామికులకు శ్రమని అమ్ముకునే స్వేచ్ఛగా మారిపోయింది. అందుకని ఈ ప్రజాస్వామ్యాన్ని బూర్జువా ప్రజాస్వామ్యం అని మార్క్సిస్టులు అంటారు వాస్తవమైన ప్రజాస్వామ్యం సోషలిస్టు సమాజంలోనే సాధ్యం అవుతుంది. కాబట్టి బూర్జువా ప్రజాస్వామ్యంకంటే ఉన్నతమైన, వాస్తవమైన సోషలిస్టు ప్రజాస్వామ్యంకోసం బూర్జువా ప్రజాస్వామ్యాన్ని విమర్శిస్తారు. ఫ్యూడల్ పండితులు మత మౌలికవాదులూ రాచరిక వ్యవస్థని ఫ్యూడల్ ప్రభువుల, మతాధిపుల యుగాన్ని పునరుద్ధరించటంకోసం ప్రజాస్వామ్యాన్ని విమర్శిస్తారు. విశ్వనాథ ఫ్యూడల్ కులమత ఛాందస దృక్పథంనుంచీ, మనుధర్మశాస్త్ర దృక్పథంనుంచీ ప్రజాస్వామ్యాన్ని విమర్శించాడు. ఆ విమర్శ సక్రమమైన అవగాహనతో చేయలేదు. "దేశమున సర్వసమానతా సిద్ధాంతము ప్రధానమైనదికాదు. ప్రజాస్వామికము ప్రధానమైనది. కాని ఈ ప్రజాస్వామిక సిద్ధాంతమునకు నాయువుపట్టు సర్వసమానతా సిద్ధాంతము"(217) అంటే సర్వసమానతలేని ప్రజాస్వామ్యం కావాలన్నమాట. "ఈ నూతన రాజ్యాంగ పథకము ప్రకారము నడచుచున్న ప్రతి మలుపులో నా దేశము యొక్క పూర్వ సంప్రదాయ పద్ధతు లడుగుతిగులుచునే యుండును." (329) ప్రజాస్వామ్యానికి కులమతాలు తప్పకుండా అడ్డువస్తాయి. స్త్రీ పరదాపద్ధతి తప్పకుండా అడ్డువస్తుంది. ప్రజాస్వామ్యం విజయవంతం కావాలంటే ఆ అడ్డుల్ని తొలగించాలి కానీ విశ్వనాథ పూర్వ సంప్రదాయ పద్ధతులకు అనుగుణ్యంగా లేదు కాబట్టి ప్రజాస్వామ్యమే పనికిరాదంటాడు. "సమానత యారోపితమైనదే

కాని సహజమైనదిగా కనిపించుటలేదు" (338) ఎందుకు కనిపిస్తుంది? వర్ణాశ్రమ, మతమౌఢ్య విషకలుషితమైన కళ్ళతో చూసేవాడికి, మనిషిని ఒక మతస్తుడుగానో కులస్తుడుగానో చూసేవాడికి సమానత ఆరోపితమైందిగానూ అసమానత సహజంగానూ కనిపించుటలో ఆశ్చర్యంలేదు. ఇంతకీ మనిషమీద వర్ణం, పేదరికం ఆరోపించబడ్డాయా? వర్ణంమీద, పేదరికంమీద మనిషి ఆరోపించబడ్డాడా? ఫ్రెంచివిప్లవ, అమెరికా స్వాతంత్ర్యయుద్ధ మానవ హక్కుల ప్రకటనలు ఎందుకూ కొరగానివంటారు? తలకిందులుగా చూసేవాళ్ళని తప్పుడు చైతన్యంతో బాధపడేవాళ్ళని మాటల్లో ఉద్ధరించటం సాధ్యంకాదు.

"మానవుడనగా నొక జీవుడు. వానికొక స్థితి కలదు. శరీరము నశించిన తరువాతకూడ నా జీవుడున్నాడు. అట్టి జీవులనంతముగా నున్నారు. ఒక జీవుడు తాను వచ్చి యొక పేదవాని కడుపునెందుకు పడెనో, వాని పూర్వజన్మ సంస్కార విశేషముచేత పడెనని చెప్పవచ్చును. అనగా నది వాని కర్మ. వాడుత్తమకర్మ చేసినచో నుత్తమ కులమునందు జన్మించును." (347) "ఒక జీవునియొక్క యీ యనంత ప్రయాణములలో నీనాటివానియొక్క పేదకులములోని జన్మ జీవునిదృష్ట్యా పరిగణించదగినది కాదు" (347) ఇది ఆధ్యాత్మిక ప్రజాస్వామ్యం. అద్వైత ప్రజాస్వామ్యం. మనుధర్మ ప్రజాస్వామ్యం. అసమానతావాద ఆధ్యాత్మిక సమర్థన. జీవుడు, కర్మ, జన్మ, కులం, పేదరికాలకి పరస్పర సంబంధం ఆమోదిస్తే ఇక ప్రజాస్వామ్యం ఎందుకు? సమతావాదం ఎందుకు? జీవుడు అంటే జీవం ఉన్నవాడు. అంటే ప్రాణం ఉన్నవాడు ఆ ప్రాణం శరీరంలోనే ఉంటుంది. ప్రాణానికి భిన్నంగా శరీరంలేదు. ప్రాణం పోవటం అంటే శరీరం పోవటం అనే అర్థం. శరీరం అంటే చర్మం కాదు. మెదడు, గుండె మొదలైన అవయవాలు కలిసిన శరీరమే మానవుడు. పుట్టటంలో చావటంలో అందరూ సమానమే. కులం, పేదరికం సామాజికమైనవి పుట్టిన తర్వాత మనిషికి కులం, పేదరికం లాంటివి సంక్రమిస్తాయి. తల్లిదండ్రులు పేదవాళ్ళయినప్పుడు వాళ్ళ బిడ్డలు పేదవాళ్ళవుతారు. పేదవాళ్ళల్లో కొంతమంది ధనికులయినవాళ్ళున్నారు. ధనికులు పేదవాళ్ళుగా అయిన వాళ్ళూ ఉంటారు. అప్పుడు జన్మ, కర్మ సిద్ధాంతాలు ఎగిరిపోవటంలేదా? పూర్వం పేదకులాలుగా ఉన్న కొన్ని కులాలు ఇప్పుడు ధనికకులాలయ్యాయి. ధనిక కులాలుగా ఉన్నవి పేదకులాలయ్యాయి. అంతకంటే ముఖ్యంగా ప్రతి కులంలోనూ పేదవాళ్ళూ ధనికులూ ఉన్నారు. వర్ణాంతర వివాహాలవల్ల పుట్టిన వర్ణసంకరులూ ఉంటారు. అమెరికాలోనూ, రష్యాలోనూ కులాలు లేవు.

విశ్వనాథ జీవుడుకు ఎంత కష్టం వచ్చింది? తాను పుట్టవలసిన కడుపు ఎడ్రసు తెలియక ఎంత ఇబ్బంది పడతాడు? ఈ ప్రజాస్వామ్యంతో, సమతావాదంతో జీవుడికి ఎంత వేదన వచ్చింది? కడుపు దొరక్క దిక్కుతోచని ఈ జీవుడు పడే బాధే విశ్వనాథ జీవుని వేదన సిద్ధాంతం అయివుంటుంది. ప్రజాస్వామ్యం గురించీ, సమానత్వం గురించీ, స్వేచ్ఛగురించీ చర్చిస్తూ జీవుడూ కర్మ జన్మ విశ్వాసాల్ని తీసుకురావటం మతి ఉండేవాడు చేసే పనేనా? ఇలాంటి మత మూఢవిశ్వాసాలమీద తిరుగుబాటునుంచి ప్రజాస్వామ్య సిద్ధాంతం వచ్చిందని కూడా తెలియవలసిన అవసరంలేదా? బూర్జువా ప్రజాస్వామ్యం కులమతాల్తో రాజీపడినప్పటికీ పరిపాలనా విధానంగా జీవిత దృక్పథంగా అది మానవులపట్ల ఏ రకమైన వివక్షణనీ సహించదు. మనదేశంలో అమలులో ఉన్న ప్రజాస్వామ్యంవల్లకూడా కరుడుగట్టిన కులవ్యవస్థ కొంతవరకైనా సడలిపోయిన మాట వాస్తవం. విమానాలవల్లా రైళ్ళవల్లా బస్సులవల్లాకూడా పరోక్షంగా కులవ్యవస్థ దెబ్బతింటుంది. అందుకే విశ్వనాథ రవాణా సౌకర్యాల్నికూడా విమర్శించాడు. ఈ విమానాలవల్ల పేదవాళ్ళకి ఏం ప్రయోజనం అంటాడు. ఇక్కడ పేదవాళ్ళు గుర్తుకువచ్చారు. ఇదే కుహనాతర్కం అంటే దేశంలో వివిధ ప్రాంతాల మధ్య సంబంధాలూ, దేశాలమధ్య సంబంధాలు రవాణా సౌకర్యాలు లేకుండా ఊహించగలమా? జాతీయోద్యమంలో వివిధ ప్రాంతాలమధ్య సంబంధాలు ఏర్పడటానికి అఖిలభారత సమావేశాలకీ రైళ్ళూ, బస్సులూ లేకపోతే సాధ్యమయ్యేవా? "నా యుద్దేశములో నీ హరిశ్చంద్రుడు మంత్రియై పది కాలాలపాటుండవలయునని. ఎందుకనగా నతని పేరు హరిశ్చంద్రుడు కమక" (522) 1960 లో సంజీవయ్య ముఖ్యమంత్రి అయ్యాడు. ఆయన విశ్వనాథకి కరీంనగర్ కళాశాల అధ్యక్ష పదవి ఇప్పించాడు. అందుకని పంచముడైన హరిశ్చంద్రుడు ముఖ్యమంత్రిగా పది కాలాలపాటు ఉండాలని చెప్పదలచుకొని దానికి అతని పేరు కారణంగా చెప్పాడు. సంజీవి అంటే చావకుండా కాపాడేది, చచ్చినవాళ్ళని బతికించే పౌరాణిక పదార్థం కదా! ఇది వ్యంగ్యమా, వెలికితనమా? మనిషికి ఉండే పేరుల్నిబట్టి కూడా మంత్రులూ ముఖ్యమంత్రులూ అవుతారన్నమాట. ఇలా ఏమీ అవగాహన లేకుండా తిరోగామి భావాల కుతర్కంతో విశ్వనాథ ప్రజాస్వామ్యాన్ని ఖండించాడు.

విశ్వనాథ ప్రజాస్వామ్యాన్ని ఖండించి ఇక సామ్యవాదంమీద దాడి చేశాడు. అసలు ఆయన దాడి లక్ష్యం సామ్యవాదమే. ఏ సామ్యవాదాన్ని

విమర్శిస్తున్నాడో తెలియదు. సామ్యవాదం పేరుతోకూడా అనేక సిద్ధాంతాలు ఉన్నాయి. సమిష్టివాదం, ఫేబియనిజం, శ్రామికసంఘ వాదం, వృత్తి సంఘ వాదం అని అనేక రకాల సామ్యవాదాలు ఉండేవి. వీటిని ఖండించి మార్క్స్, ఏంగెల్సులు శాస్త్రీయ సామ్యవాదం స్థాపించారు. దీన్నే మార్క్సిజం అనీ కమ్యూనిజమనీ అంటారు. హిట్లర్ జాతీయ సామ్యవాదం పేరుతో ఫాసిజాన్ని అమలుచేశాడు. వీటిల్లో ఏరకపు సోషలిజాన్ని విశ్వనాథ ఖండిస్తున్నాడో చెప్పడం సాధ్యంకాదు. ఈ నవలలో పినాకి అనే 'ప్రథమ కులజుడు' సామ్యవాదానికి ప్రతినిధి పాత్ర. కానీ ఈ పాత్ర చేసిన పనుల్లో కానీ, మాట్లాడిన మాటల్లో కానీ ప్రపంచ ప్రసిద్ధమైన ఏ సామ్యవాద సిద్ధాంతంతోనూ పోలికకూడా కనబడదు. ఒక చిన్న పట్టణంలో ఒక రహస్య విప్లవసంఘం ఉందట. ఆ సంఘ కేంద్రం పరదేశంలో ఉందట ఆ రహస్య సంఘ సభ్యులు ధనవంతులుగా ఉండాలట. ఆ సభ్యులు సమావేశాల్లో తాగుతారట. మాంసం తింటారట. అందులో పినాకి చేరాడు. "మాకు తల్లి దండ్రులు లేరు. ప్రాణదాతలు లేరు. మే మెవ్వరియందును కృతజ్ఞులము కాము. ఈ శరీరము తల్లిదండ్రుల దయవలన సృష్టింపబడినవన్న యవివేకపుటూహ మాకు లేదు. అందరు జంతువులు. జంతువులు ఋతుకాలమున సంగమించును. క్రొత్త జంతువులు పుట్టును ఇది ప్రకృతి ధర్మము. కనుక తల్లిదండ్రులను గౌరవించవలసిన యవసరము లేదు. ఈ సృష్టి యట్లే జరుగుచున్నది" (463) ఇది ఆ రహస్య సంఘంవాళ్ళ సిద్ధాంతమట. తల్లిదండ్రుల సంగమంవల్ల పిల్లలు పుడతారనడంలో తప్పేమీలేదు. పుట్టటం వరకు జంతు లక్షణంకూడా లేకపోలేదు. కానీ మానవులు ఇతర జంతువులకంటె విస్పందేహంగా ఉన్నతులు. సంగమంలోకానీ, కని పెంచడంలోకాని జంతులకంటె భిన్నమైన అనేక శారీరక, మానసిక, సామాజిక లక్షణాలు మానవుల్లో ఉంటాయి. కృతజ్ఞత, దయ, ప్రేమ, త్యాగం అనే ఉన్నతమైన విలువలు మానవులకి ఉంటాయి. మతవాదులు మనిషి శరీరాన్ని ఇంద్రియాల్ని కించపరిచి తమ సిద్ధాంతాల్ని అంగీకరించని వాళ్ళని పశువులని తిడుతుంటారు. శరీరం రక్తమాంసాల మయమనీ, అశాశ్వతమనీ క్షణభంగురమనీ ప్రచారం చేశారు. ఆ రక్తంలోకూడా బానిసల రక్తం, బానిస యజమానుల రక్తం వేరువేరుగా ఉంటాయని, రాజు రక్తం, అర్యుల రక్తం గొప్పదని సిద్ధాంతాలు చేశారు. చార్వాకుల్ని వాచస్పతి మిశ్రుడనే వేదాంతి "పశునామపిపశవః" అని తిట్టాడు. విశ్వనాథ సాహిత్యంలోకూడా ఇలాంటి అభిప్రాయాలు కొల్లలుగా

ఉన్నాయి. ప్రపంచంలో విప్లవకారులు ఎవరూ మనిషిని పశువు అనలేదు. మనిషిమీద ప్రేమతో, దేవుడు పేరుతో, కులమతాల పేరుతో, ఆచారాలపేరుతో మానవత్వాన్ని కోల్పోయిన మనిషిని, పరాయీకరణం చెందిన మనిషిని పరిపూర్ణ మానవుడుగా చెయ్యాలనే విప్లవకారుల ఆశయం. తండ్రి దోపిడీ దారుడైనప్పుడు, లోక కంటకుడయినప్పుడు, మతపిశాచి అయినప్పుడు, వర్ణ దురహంకారి అయినప్పుడు కొడుకో, కూతురో ప్రతిఘటించటంలో తప్పు ఏముంది ? హిరణ్యకశిపుడికి ఎదురుతిరిగినందుకు ప్రహ్లాదుడ్ని పూజిస్తు న్నారే మీరు ? తల్లిదండ్రులు లేరు. అన్నదమ్ములు లేరు. గురువు లేడు. చంపటం లేదు. చావటం లేదు. అన్నీ నేనే. యుద్ధం సేయరా డింభకా ! అని బోధించిన గ్రంథాన్ని అధికారగ్రంథంగా పూజిస్తున్నారే మీరు ? సింహా సనం కోసం తండ్రిని చంపిన కొడుకులూ, అన్నని చంపిన తమ్ముళ్ళతోనూ నిండిన రాచరిక వ్యవస్థని కీర్తిస్తున్నారే మీరు ? ఎంతోమంది విప్లవకారులు తల్లికీ తండ్రికీ రాసిన ఉత్తరాలు అచ్చుఅయి వున్నాయి. వాటిలో వాళ్ళ హృదయౌన్నత్యం కనిపిస్తుంది చదవండి. విశ్వనాథ చెప్పినట్టు ప్రమాణం చేసిన విప్లవ రహస్య సంఘం ఒక్కటి లేదు. 'అభినవ భారతి' ఈ పని చేసిందా ? 'అనుశీలక సమితి' ఈ పని చేసిందా ? 'యుగంతర్' ఈ పని చేసిందా ? ధనవంతులూ, తాగుబోతులూ విప్లవం కోసం రహస్య సంఘాలు పెట్టడం ఎక్కడయినా ఉందా ? మహత్తరమైన త్యాగాలతో సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా, దోపిడీవ్యవస్థకి వ్యతిరేకంగా పోరాటం చేసిన విప్లవ సంఘాలను ఎంత విప్లవ వ్యతిరేకి అయినా ఇలా చిత్రిస్తాడా ? అధ్యక్షుని మాటలు ఏమిటి ? ఒక పిస్టల్ ఎక్కడో గోతులో దాయటం ఏమిటి ? రాముడు మురారి ఆ సంఘ కార్యాలయంమీద దాడిచేసి సభ్యుల్ని చితకబాదటం ఏమిటి ? ఇంతకంటే పురాణకథ మరొకటి ఉంటుందా ? విప్లవ సంఘాలంటూ ఉంటే, వాటి కార్యక్రమం, సిద్ధాంతం, ఆశయాలు ప్రజల్లో పెద్దయెత్తున ప్రచారంలో పెట్టవద్దా ? వాళ్ళు పోలీసులకీ, ఇన్‌ఫార్మర్లకీ రహస్యంగా ఉంటారుకానీ ప్రజలకూడా తెలియకుండా రహస్యంగా ఉండటం ఏమిటి ? సరే. విప్లవం జరక్కుండానే రణజిత్తు అనే సామ్యవాది ముఖ్యమంత్రి అయ్యాడు పినాకి సిద్ధాంత కర్త అయ్యాడు. రణజిత్తు అన్ని గ్రామాల్లోనూ పంచాయితీలు ఏర్పాటుచేశాడు. వెలికులంవాళ్ళు పంచాయితీ సభ్యులై ప్రథమ కులజుల వంట గదుల్లోకికూడా రావటం అనే ధర్మం జరిగిపోతోంది అనేకమందిని లారీల్లో తీసుకుపోయి హత్యచేసి ఏదో ప్రమాదంలోనో అనారోగ్యంతోనో చచ్చినట్టు

ప్రకటించాడు. రణజిత్తుని సంహరించి పినాకి సర్వదేశమునకు అధిపతి అయ్యాడు. సామ్యవాదం పూర్తిగా వచ్చేసింది. కార్మిక వర్గంకానీ రైతాంగం కానీ మధ్యతరగతి ప్రజలు కానీ అసలు రంగంలోనే లేరు. ఆ పేరులుకూడా వినిపించవు. పార్టీ లేదు. ఒక నాయకుడ్ని మరొక నాయకుడు హత్య చెయ్యటంతో సామ్యవాద సమాజం వచ్చేసింది. గృహస్థాశ్రమ ధర్మం నాశనమయ్యింది. స్త్రీలనూ పురుషుల్నీ విడదీసి పనులు చేయించారు. కుటుంబాన్ని రద్దుచేశారు. మరి స్త్రీ పురుష సంబంధాలు ఎలా? ఇదిగో విశ్వనాథ చెపుతున్నాడు "వారమున కొక దినమున నొక యుత్సవము జరుగును.... అప్పుడు నృత్యములు చేయుదురు. ఆ సందర్భములో నొక్క స్త్రీయు, నొక్క పురుషుడును పరస్పరము వాంఛ కలిగినవారైనచో వారు కార్యదర్శులతో చెప్పుదురు. వారిద్దరును కలిసి కొన్నాళ్ళు జీవించుటకు ప్రత్యేక గృహములు కలవు. ఆమె గర్భవతి యైనంతనే ఎవరిదారిని వారు పోవుదురు" (570) ఇలా జరుగుతుంటే పినాకికి ఒక సమస్య ఎదురైంది. ఏమిటి? "తొలినాడు భార్యాభర్తలుగ నున్నవారే పరస్పరము వాంఛించుకొనుచున్నారనియు, ఈ కలిసికొనెడు నుపాయమును వారు తొలినాటి సంబంధమును బలపరచుకొనుటకే యుపయోగించుచున్నారనియు వార్తలు వచ్చెను" (570) దంపతులమధ్య సంబంధం, ఇచ్ఛ పరలోక చింతనతోకూడి శాశ్వతిమైనది కదా, అందుకని ఇలా జరిగింది. ఈ విషయం తెలిసి పినాకి "పూర్వ మే గ్రామమునందున్న స్త్రీలు నా గ్రామమునం దుంచబడరాదు" (570) అని శాసనంచేసి ఆ సమస్య పరిష్కరించాడు ప్రపంచంలో సామ్యవాద సమాజాన్ని ఇంత నీచంగా వికృతీకరించినవాడు ఎవడన్నా ఉన్నాడా? విశ్వనాథమీద ఆయన శిష్యులకి ఎంత ఆరాధన అయినా ఉండవచ్చును దీన్నికూడా సమర్థించేటంత మూఢభక్తులు ఉండరనుకుంటాను. నీకు తెలిసిన కంచుకోత్సవాలూ, తంత్రం ముసుగులో జరిగిన మాతృపుత్ర కామకేళీ విలాసాలూ వల్లభమత సుఖరోగ భోగవాదమూ, నవసమాజంమీద ఆరోపించటం ఎందుకు? ఫ్యూడల్, బూర్జువా పండితులు నిత్యజీవితంలో తాము చేసే క్షుద్ర కార్యాలన్నీ కమ్యూనిస్టులు చేస్తున్నట్టు ప్రచారం చెయ్యటం 19వ శతాబ్దంనుంచీ ఉంది. వాళ్ళ మానసపుత్రుడే విశ్వనాథ. స్త్రీ పురుష సంబంధాలను ఎంతో ఉన్నతస్థాయికి అభివృద్ధిచేసింది సామ్యవాదులే. కుటుంబవ్యవస్థ రష్యా, చైనాల్లో రద్దుకాలేదు. భార్యాభర్తల మధ్య, తల్లిదండ్రులు, పిల్లల మధ్య ప్రజాస్వామిక సంబంధాల్ని సాధించింది సామ్యవాదులు మాత్రమే ఇంకా సాధించవలసింది చాలా ఉన్నప్పటికీ పిత్ర

స్వామిక సమాజపు సంకెళ్ళనుంచి స్త్రీని విముక్తిచెయ్యటానికి పోరాడిన, పోరాడుతున్నవాళ్ళల్లో సామ్యవాదులది ప్రథమ స్థానం. "సామ్యవాదములో యువకులు వృద్ధులను తిరస్కరించుచుందురు" (557) ఇదొక అబద్ధం. సామ్యవాద దేశాల్లోనే వృద్ధులకు విశ్రాంతినీ, ప్రత్యేక సౌకర్యాల్నీ కలిగిస్తారు. భూస్వామ్య వ్యవస్థలో, బూర్జువా వ్యవస్థలో డబ్బులేకపోతే వృద్ధులకు తిండి పెట్టేవాళ్ళుకూడా ఉండరు. "పూర్వము గ్రామమొక కుటుంబము. పంచాయితీ పితృస్థానము. నేడు గ్రామము రాజ్యము పంచాయితీ రాజస్థానీయము" (551) కొంతమంది విమర్శకులు విశ్వనాథ గ్రామీణ జీవితాన్ని, గ్రామాల్లోని ఆర్థిక సంబంధాల్ని చిత్రించాడని ప్రశంసించారు. వర్ణాశ్రమ ధర్మాల్నీ, ఫ్యూడల్ జీవిత సంబంధాల్నీ చెప్పటానికి, వాటిని ఆదర్శీకరించటానికి అనుకూలంగా విశ్వసనీయంగా ఉంటుంది కాబట్టి విశ్వనాథ గ్రామీణ జీవితాన్ని నేపథ్యంగా తీసుకున్నాడు బ్రిటిషువాళ్ళు రాకముందు గ్రామాలు స్వయంసమృద్ధాలుగా ఉండేవి. ప్రయాణ సౌకర్యాలూ, రవాణా సౌకర్యాలూ లేనికాలంలో గ్రామాలు స్వయంపోషకాలుగా ఉండేవి. అలాంటి స్థితిలో ప్రజల అవసరాల్ని ఆ గ్రామంలోనే ఉత్పత్తిచేసేవారు వినోద కాలక్షేపానికి, విలాసజీవితానికి, ఆధ్యాత్మిక జిజ్ఞాసకీ అవసరమైన నటులు, నర్తకులు, పౌరాణికులు, పురోహితులు మొదలైనవాళ్ళు ప్రతి గ్రామంలో ఉండేవాళ్ళు సాముదాయిక వ్యవహారాల్ని జరపటానికీ, వివాదాల్ని పరిష్కరించటానికీ గ్రామంలోనే పంచాయితీ ఉండేది. రాజోద్యోగులు పన్నులు వసూలు చెయ్యటానికి మాత్రమే గ్రామాలకి వచ్చి వెళ్ళేవారు. ఆ గ్రామం ఒక కుటుంబం అనేది నిజంకాదు. వర్ణవ్యవస్థవల్ల కుటుంబాలు స్పష్టంగా చీలిపోయి ఉండేవి విభిన్న కులాలమధ్య తీవ్రమైన అసమానతలు ఉండేవి. పెద్దకులాలవాళ్ళు కిందికులాలవాళ్ళని బానిసలనుగా చేసి పీడించుకుతినేవాళ్ళు. పంచముల్ని గ్రామం అవతల పెట్టి నీచమైన పనులన్నీ వాళ్ళతో చేయించేవాళ్ళు. ఆహారంలో, వస్త్రధారణలో, సాంఘిక ప్రతిష్ఠలో తీవ్రమైన వ్యత్యాసాలు ఉండేవి. పై కులాలవాళ్ళు షడ్రసోపేతమైన ఆహారం తింటే ఎక్కువమంది కింది కులాలవాళ్ళు ఎంగిలికూడో, గంజో తీసుకునేవారు. అంటరానితనం పాటించబడేది బ్రాహ్మణులు మేలైన కాషాయవర్ణ వస్త్రాలు కట్టుకునేవారు పంచములు జంతుచర్మాన్ని ధరించేవారు. పంచాయతీ పితృస్థానీయంలో ఉండేదనేది ఒక పెద్ద అబద్ధం. పంచాయితీ పెత్తందార్లు గ్రామంలో వర్ణధర్మాన్ని కాపాడే మనువు పాత్ర నిర్వహించేవారు. అసమానత్వంమీద, అంటరానితనంమీద ఏమాత్రం ప్రతిఘటన వచ్చినా కర్కశంగా

అణిచివేసేవారు. కిందికులాలవాళ్ళు చిన్న తప్పులు చేసినా కఠినంగా శిక్షించే వారు. అందరికీ ఒకటే పంచాయితీ ఉంటే కులధర్మం దెబ్బతింటుందనుకుంటే ప్రతి కులాన్నీ ముఖ్యంగా శూద్ర పంచమ కులాల్ని చీల్చి కుల పంచాయితీలు పెట్టేవారు. ప్రతిగ్రామం స్వయంసమృద్ధంగా ఉండటం సాధ్యంకాదు. గ్రామా నికి కావలసినవన్నీ ఆ గ్రామంలోనే దొరకవు. పక్క గ్రామాల్తో సంబంధాలు పెట్టుకోక తప్పదు. ఈ సంబంధాల్ని పంచాయితీ నిర్వహించేది. ఇలాంటి గ్రామాలు దేశం అంతటా ఉండేవని చెప్పటానికి చారిత్రక ఆధారాలు లేవు. ఈ గ్రామీణ వ్యవస్థవల్ల దేశానికి ఎంతో నష్టం వచ్చింది. వర్ణధర్మమే ప్రభుత్వపాత్ర నిర్వహించేది కనుక ప్రజల్లో రాజ్యస్పృహ ఉండేదికాదు. రాజ్యాన్ని ఎవడు పరిపాలించినా ఆ ప్రజలకు ఒకటే. ఎంత బలహీనమైన విదేశీయులైనా సులభంగా దాడిచేసి రాజ్యాన్ని ఆక్రమించుకునేవారు. గ్రామాలు అలా ఉండడంవల్ల తమకే మేలుకాబట్టి మహమ్మదీయుల్తోసహా ప్రాచీన, మధ్య యుగాల్లోని ఏ రాజులూ వాటిని మార్చటానికి పూనుకోలేదు బందిపోటు దొంగతనాలనుంచి గ్రామాలకు రక్షణ ఉండేదికాదు. రోగాలూ, క్షామమూ ఎక్కువగా ఉండేవి. గ్రామమే ప్రపంచం కావటంవల్లా, కుల విషవలయం వల్లా, పౌరాణికులూ పురోహితులూ చెప్పే పురాణకథలవల్లా గ్రామ ప్రజలు సంకుచితంగా, మూఢవిశ్వాస పిశాచాలుగా ఉండేవారు. ఈ హిందూ ఫ్యూడల్ గ్రామాన్ని విశ్వనాథ ఆదర్శగ్రామంగా తన సాహిత్యంలో ప్రచారంచేశాడు. బ్రిటిషువాడు రావటంతో ఆ గ్రామం ఎగిరిపోయింది. భారత దేశాన్ని అంత ర్జాతీయ మార్కెట్టులో కలిపినట్టుగా, గ్రామాల్ని దేశమార్కెట్‌కు అనుబంధం చేశారు. గ్రామాలకి పట్టణాల్తోనూ, పక్క గ్రామాల్తోనూ విస్తృత సంబంధాలు ఏర్పడ్డాయి పంచాయితీలు పోయి కోర్టులు ఏర్పడ్డాయి. తమకు అవసరమైన ప్రాంతాల్లో నీటిపారుదల సౌకర్యాలు కల్పించారు. రైతు తనకు ఇష్టంవచ్చిన పంట వేసుకోవచ్చును. పట్టణాలకి తీసుకుపోయి అమ్ముకోవచ్చును. గ్రామాల లోని యువకులు పట్టణాల్లో చదువుకోవటం ప్రారంభించారు. ఫ్యూడల్ గ్రామం వలసవాద గ్రామంగానూ, దళారులడ ముడిసరుకులు అమ్మే గ్రామంగానూ మారిపోయింది. స్వాతంత్ర్యానంతరం కొద్దికాలానికి ప్రవేశపెట్టిన పంచాయితీ విధానంవల్ల ప్రజల్లో రాజకీయ చైతన్యం పెరిగింది. ఆధునిక వ్యవస్థలోకి గ్రామాలు ప్రవేశించాయి. గ్రామాలనుంచి జాతీయనాయకులుకూడా వస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో భాగంగా గ్రామాలు ఉండటమే ప్రాచీన గ్రామీణ వ్యవస్థకంటే అన్నివిధాలా మేలు. అయితే పెట్టుబడిదారీ వ్యవస్థలో గ్రామ

ప్రగతి పాక్షికంగానే ఉంటుంది. సామాజికంగా పట్టణప్రాంతాల్లో జీవించే వాళ్ళకి ఉండే సౌకర్యాలు గ్రామాల్లో ఉండవు. సామ్యవాద సమాజంలో పరిశ్రమల్ని జాతీయం చేయటం, సహకార వ్యవసాయ క్షేత్రాల్ని ఏర్పాటు చేయటం, వ్యవసాయిక పరిశ్రమలు స్థాపించటంతో గ్రామాల స్వరూపం పూర్తిగా మారిపోతుంది ఇదంతా పట్టించుకోకుండా విశ్వనాథ వర్ణాశ్రమ దృక్పథంనుంచి ప్రాచీన పంచాయితీ వ్యవస్థని సమర్థిస్తూ ప్రగతిశీలమైన మార్పుల్ని ఖండించాడు.

పినాకి నాయకత్వంలో సామ్యవాదం వచ్చిన తర్వాత మరొక విప్లవం వచ్చింది. కరజీవుడనే సేనాధిపతి కారాగారంలో ఉన్న పినాకి సోదరుడు మురారినీ, సోదరుడుతో సమానమైన రాముడినీ కాల్చిచంపి సామ్యవాదంపట్ల తనకున్న నిజాయితీని నిరూపించుకోవలసిందిగా పినాకిని కోరతాడు. అసలు సామ్యవాది ఎవడూ మురారిలాంటివాళ్ళని జైల్లో పెట్టడు. అతను దోపిడీవ్యవస్థ పునరుద్ధరణకి ప్రయత్నించినవాడూ కాడు విప్లవ ప్రతీఘాతుకుడూ కాడు. ఇలా అన్నని చంపి, తండ్రిని బంధించి రాజభక్తి నిరూపించుకోమని రాజులు పరీక్షలుపెట్టటం చరిత్రలో ఉందికానీ సామ్యవాదులు అలా చెయ్యటం ఎక్కడా ఉండదు. సరే. పినాకి మురారిని చంపటానికి నిరాకరిస్తాడు ఆ సాకుతో కరజీవుడు మురారిని చంపి, చివరకు పినాకిని చంపి సైనిక ప్రభుత్వం స్థాపిస్తాడు ఇంకా ఒకరిద్దరు సైనిక నియంతలు వస్తారు. చివరికి మళ్ళీ రాచరికం వస్తుంది. విశ్వనాథ కలపండి రాజు మళ్ళీ పరిపాలనలోకి వస్తాడు. వల్లభాచారి చెప్పినట్టు విశ్వనాథ సముద్రపుదిబ్బలో విప్లవాల్ని గురించి చెప్పాడు. కానీ శాస్త్రీయమైన, వాస్తవంగా జరిగే విప్లవాలు కావు ఆ విప్లవాల్ని విశ్వనాథ వ్యతిరేకించాడుకానీ సమర్థించలేదు. చారిత్రిక దృష్టి లేకపోవడంవల్ల కృతిక విప్లవాల్ని, కృతక వ్యవస్థల్ని సృష్టించి కూటతర్కంతో ఖండించాడు. సారాంశంలో సముద్రపుదిబ్బలో విశ్వనాథ "రాజు శాశ్వతముగా జీవించుగాక" "మనుధర్మం వర్ధిల్లుగాక" అని చెప్పాడు.

రామాయణ కల్పవృక్షం, వేయిపడగలు, శ్రీ కుమారాభ్యుదయం, చెలియలికట్ట, దమయంతీ స్వయంవరం, వీరవల్లడు, ఒద్దన్నసేనాని, సముద్రపు దిబ్బ గ్రంథాల్ని అనేక ఉల్లేఖనల్తో, విపులమైన విశ్లేషణతో, విస్తారంగా రాయక తప్పలేదు. ఈ సుదీర్ఘ విశ్లేషణ కేవలం జి వి. సుబ్రహ్మణ్యం, వల్లభాచార్లకోసం కాదు. విశ్వనాథ సాహిత్య నిజస్వరూపం తెలుగుజాతి ముందు పెట్టటంకోసం. మనుధర్మ పిశాచి, మత కుల విషసర్పం, చాణక్యుని

పిలక, గోల్వాల్కర్ కుర్చీ, బ్రాహ్మణ మతభృత్యుడు, శూద్ర, పంచమ మహా జనద్రోహి, స్త్రీస్వేచ్ఛా హంతకుడు, నిరంకుశ రాజాస్థాన శకుని, మానవత్వ విద్వేషి, ప్రజాస్వామ్య, సామ్యవాద, సమతావాద, ప్రజావిప్లవ వ్యక్తీకరణ, కేంద్రీకరణ వంచకుడైన విశ్వనాథని అపరవాల్మీకి అనీ, అభినవ వ్యాసుడనీ, సరస్వతీ అవతారమనీ ప్రచారంచేసిన, చేస్తున్న దుర్విమర్శకుల దుష్ట పన్నాగాల్ని ప్రజల దృష్టికి తేవటంకోసం వివరంగా రాయవలసివచ్చింది. విశ్వనాథ రచనలన్నిటిమీదా విశ్లేషణాత్మక విమర్శ రాయాలనే సంకల్పం ఉన్నప్పటికీ ప్రస్తుత సందర్భంలో సాధ్యంకాదు. విశ్వనాథ ఇతర గ్రంథాలుకూడా ఇదే పంథాలో ఉన్నాయి. సంఘసంస్కరణోద్యమ లక్ష్యాలుగా నేను పేర్కొన్నవి విశ్వనాథ సాహిత్యంలో ఉన్నాయని వల్లభాచార్య చెప్పింది పచ్చి అబద్ధం. విశ్వనాథ సాహిత్యం ఎవడూ చదవడనీ, చదివినా అర్థంకాదనీ వల్లభుడు ఉన్నవి లేనట్టూ, లేనివి ఉన్నట్టూ చెప్పే వంచనకు పాల్పడ్డాడు. పైగా ఈ నాటి తరానికి విశ్వనాథనిగురించి సరిగ్గా తెలియదట. విశ్వనాథ శిష్యులు విశ్వనాథ చెప్పిందేమిటో వివరించలేదట. ఆయన అభిమానులు ఆయనని తమ క్యాంపులో చేర్చుకునేవారేకానీ ఆయన అభిప్రాయాల్ని వివరించగలిగినవాళ్ళు కాదట. అందుకని వల్లభాచార్య అనే మొనగాడు విశ్వనాథ సాహిత్యంలోని అభిప్రాయాల్ని వివరించటానికి అవతరించాడు కాబోలు. ఎందుకీ డప్పాలు కొట్టడం? విశ్వనాథ సాహిత్యంలో ఉన్నవీ లేనివీ వివరించిన, వివరిస్తున్న వాళ్ళు అనేకమంది ఉన్నారు. ఇటీవల విప్లవ సాహిత్యోద్యమంలో ఆటుపోట్లూ, ప్రభుత్వం అణిచివేతనీ అవకాశంగా తీసుకొని ఒక విశ్వవిద్యాలయంలో పండితులు విద్యార్థుల్తో విశ్వనాథ సాహిత్యంమీద పరిశోధనలు చేయిస్తున్నారు. ఆ గ్రంథాల్ని ప్రచురిస్తున్నారు. ఇదివరకు పి. వి. నరసింహారావు కరుణాకటాక్షాలతో విశ్వనాథ శారద అని రెండు వాల్యూములు చెక్కభజన వ్యాసావళినీ, ఇటీవల కొండలరావు చలవతో తెలుగు ఎకాడమీ అనే ప్రభుత్వ సంస్థతోనే ఒక మోనోగ్రాఫ్ వేయించుకున్నారు. వాస్తవ పరిస్థితి ఇదయితే, పైసా సొంతఖర్చు లేకుండా విశ్వనాథమీద పొగడ్తల సంపుటులు వస్తావుంటే ఎవరి 'పంట' పండినట్టు? ఎందుకీ అసంబద్ధ ప్రసంగాలు?

మతాలమధ్య సామరస్యం, ఆధునిక విద్యావికాసం, వెనకబడిన కులాలను ఉద్ధరించటం, విజ్ఞానశాస్త్ర చైతన్యాన్ని కలిగించటం అనే సంఘసంస్కర్తలు బోధించిన విషయాలుగా నేను పేర్కొన్నవాటిని విశ్వనాథసాహిత్యంలో ఉన్నాయని నిరూపించే బాధ్యతను ఆనారి మొదటే వదులుకున్నాడు. కాబట్టి

విశ్వనాథ సంఘసంస్కరణోద్యమానికి పూర్తిగా వ్యతిరేకి అనే నా వాదాన్ని ఖండించటంలో విఫలమయ్యాడు. విఫలమయినప్పుడు నిజాయితీ ఉన్నవాడు వితండవాదం చెయ్యక తన తప్పుని బాహాటంగా అంగీకరిస్తాడు. వల్లభునికి ఆ సంస్కారం, ఆ ప్రజాస్వామ్య దృక్పథం ఉన్నాయనే నమ్మకం నాకులేదు. పిడివాదం అసలు పూర్వపక్షాన్ని గుర్తించటానికే నిరాకరిస్తుంది. ○

విష పత్రికలు

వీళ్ళు,
ఛీ, అతివాదులు
ఛ, హింసావాదులు
థు, అరాచక వాదులు
మొన్న బస్సులు
నిన్న రైల్వేస్టేషన్స్
రేపు పోలీసు స్టేషన్స్
అంతా ఛండాలం
అదుపులేదు - ఆజ్ఞలేదు!

వాళ్ళు,
ఎంత ముద్దొస్తున్నారో!
రాడికల్ పిల్లల తలల గుత్తుల్ని
తూటాల మాలలుగా వేసుకొని
కాకీ కలర్‌పై కుంకుమ ఎరుపు
అబ్బ! వర్ణచిత్రంలా లేదూ!
ఎక్స్‌పోజ్ చేసి, బాక్స్ కట్టి,
ఫ్రంట్ పేజీలో వేసి
కాపీలు పెంచండి!

(వార్తాపత్రికల వార్తల వ్యత్యాసాన్ని చూసి)

—నల్లూరి రుక్మిణి

వలలం

వాడిదగ్గర బోలెడన్ని అస్త్రాలున్నాయి
నీ బలహీనతలన్నీ వాడి అస్త్రాలే!
మతం ఒక స్కడ్
కులం ఒక పేట్రియట్
నీ వ్యసనం -
వాడు సంపాయించిన ఓటు!
నీకూ-నీకూ మధ్య ప్రబలిన
అనైక్యత
వాడు పొందిన అణుబాంబు.
వాడు నిర్మించిన చట్టం-

వాడి చేతికి మట్టి అంటనివ్వదు,
నీ గొంతుకను పెగలనివ్వదు.
బలవంతంగా నీ ప్రాణాన్ని లాగేసి
వాడు జనం మధ్య దాన్ని
సానుభూతి కటౌట్‌గా నిలబెట్టగలడు
గమనించావా!
ఆ మూల వేరు పిలకలు
ప్రతి గ్రామంలోనూ వ్యాపిస్తున్నాయి
నువ్వు పురుగువై మూలంలో చేరితే
వాడి అస్త్రాలన్నీ కుప్పకూలిపోతాయి

—అష్టచైతన్య

పాటని చంపటం నీవల్లేమౌతుంది?

వాడి ప్లానంతా పాటని చంపాలనే....
నిరంతర ఘోష, బాధ, కసి...పాటని లేకుండా చేయాలనే...
పాటకి ఉరి బిగించి హాయిగా ఊరేలాలనే...ఊరేగాలనే...
కానీ,
పాట పుట్టింది ఊరి బయట కాదు....ఊరిలో
పాట బ్రతుకుతుంది ఊరి చివర కాదు....మధ్యలో
పాట పారిపోదు ... అలలా వ్యాపించుకు పోతుంది
కాలిక్రింద దుమ్ము సైతం పాటపోరుకి హోరెత్తుతుంది.
ధ్వజమెత్తటం పాట ప్రాణం
దండించటం పాట నైజం
నీ పుట్టుకే పాట పురుడుకి కారణమైనప్పుడు
విను లేకుండాచేయటమే పాట గానమైనప్పుడు....
నిన్ను చంపి పాట ఎర్రని పువ్వుల తోటౌతుంది
అంతవరకూ....పాట
నీ 'పాడి'కి సిద్ధమౌతుంది, సాయుధ సన్నద్ధమౌతుంది.

—ప్రభాత్

మీ ఆఖరి ఘడియల్లో....

ఏదో ఒకే వేషంతో గద్దెనెక్కుతారో
మిత్రులుగా నటిస్తూ కల్సి కూర్చుంటారో
వేషాలన్నీ తీసి నగ్నంగా "కోటాలు" నిర్ణయించుకుంటారో
మీ చావుఘడియ మాత్రం త్వరితం చేస్తున్నది
మిమ్మల్నందరినీ బహిష్కరించి
దీక్షతో మీ పునాదులు తవ్వుతున్నవాడు
వాడు ఇప్పుడు మీరు పారించిన నల్లడబ్బుని
తన శ్రమసంపదగా లెక్కించుకుంటాడు
మీరు తెగ్గోసిన తలల్ని పోలింగ్ బూతుల దగ్గర
కసిగా నెత్తుటి అప్పు తీర్చుకునేందుకు లెక్కించుకుంటాడు
నిజంగా మీకు పోలైన ఓట్లని లెక్కించి

వాడి ఆచరణని పదునెక్కించుకుంటాడు

* * * *

ఆ! నిజమే
వాడు మీ భూముల్లోని మట్టిపెళ్లే
మీ ఫ్యాక్టరీల్లో కూలీ కార్మికుడే
నేటి ప్రజాయుద్ధ సైనికుడు
రేపటి ప్రభుత్వానికి పర్యాయపదం

—ఎం.ఎస్.ఆర్.

సూరీడులా ఉదయించు!

ఇక్కడి నీ స్వేదం
అక్కడ మధువై
మత్తెక్కిస్తుంటుంది!
ఇక్కడి నీ కష్టం
అక్కడ సుఖాల బృందావనమై
వెలుస్తుంది!
ఇక్కడి నీ జీవితం
అక్కడ కాళ్ళ క్రింద తివాచీగా
అవతరిస్తుంది!
ఇక్కడి నీ పేగుల అరుపులు
అక్కడ వెస్టర్న్ మ్యూజిక్కైపోతుంది!
ఇక్కడి నీ కళ్ళలోని వేదనాశ్రువులు
అక్కడ ముత్యాల దండలై
మెరుస్తాయి!
ఇక్కడి నీ ఆక్రందన
అక్కడ అరణ్యరోదనై
అల్లాడుతుంది!
ఇంకా ఎందుకు విలపిస్తావ్....?
ఇంకా ఎందుకు
నిట్టూర్పులు విడుస్తావ్...?
నీవే చైతన్యుడవై నర్తించు
విప్లవమూర్తివై విజృంభించు!
ఈ కష్టాల కారడవులు
ఈ విషాదాల చీకట్లు
అదృశ్యమయిపోతాయి!
ఇంకా ఎందుకు ఆలోచిస్తావ్....
ఇంకా ఎందుకు ముడుచుకుపోతావ్...
నీ ప్రతి అడుగులో పిడుగులు
కురిపించు
నీ ఆలోచనలో ఆవేశాలు మెరిపించు!
గుండెల్లో ఆవేదనలు
గుడిసెల్లో ఆకలి మంటలు
నీకు జేజేలు పలుకుతాయి!
నీవు నడుస్తుంటే... నిన్ను వెన్నంటి
అండగా నిలబడుతాయి!
ఇంకా ఎందుకు సందేహిస్తావ్....?
ఈ చీకట్లలో సూరీడువై ఉదయించు!
ఈ వాడిన బ్రతుకులకు -
కొత్త జీవితాలను అందించు!!

—కె. లుగేంద్రనాథ్ పిళ్ళై

శ్రీకాకుళ పోరాట పాటలు :

జేగంటలు

సేకరణ: మానేపల్లి

[ఈ పాట— 1969 - 70 లనాటి ప్రపంచ పోరాటాన్ని వివరిస్తుంది. వివిధ దేశాల్లో వివిధ ప్రాంతాల్లో చెలరేగుతున్న అజేయమైన ప్రజాయుద్ధ వాస్తవాన్ని ఎలుగెత్తి చాటి, కార్మిక, కర్షక రాజ్యం స్థాపించటం తథ్యమనే నిజాన్ని మన ముందుంచుతుంది. ఈ పాట శ్రీకాకుళ సాయుధ పోరాటంలో పాల్గొన్న ఒక కామ్రేడ్ రచించాడు. దీన్నే 1969 ప్రాంతాల్లో, పోరాట ప్రదేశాల్లోనూ ఆ దరిమిలా జైలుశిక్ష లనుభవిస్తున్నప్పుడూ సామూహికంగా గానం చేశారు. అప్పట్లో - వెలువడిన సంకలనాల్లో ఈ పాట కనిపించదు. కా॥ దుప్పల గోవిందరావుగారి నోట్సులోంచి దీన్ని సేకరించాను. వారికి కృతజ్ఞతలు]

రండోయ్ రండోయ్
ప్రజావిముక్తి సమరంలో
చేరగ వేగమె రండోయ్

ఈ భూములు ఈ గనులు
ఫ్యాక్టరీలు ఈ బ్యాంకులు
ఈ సంపద మనదేనోయ్

మన రక్తం త్రాగి త్రాగి
మన ప్రాణాల్ పీల్చి పీల్చి
శ్రమశక్తిని దోచిదోచి
తెగబలిసిన కామందులు
భూస్వాములు జమీందార్లు
దోపిడి రక్కసిమూకల
హతమార్చగ ప్రతిబూని
రండోయ్ రండోయ్

నీ పలుగూ నీ పార
నీ కత్తీ నీ సుత్తీ
నీ గొడ్డలి నీ బరిసె
నీ కర్ర నీ కర్రా
నీ విల్లూ నీ సిల్లా
చేతబూని ఎదుర్కొనగ
తరలి రండోయ్ రండి

గ్రామాల విముక్తిచేసి
పట్టణాలు చుట్టుముట్టి
కార్మిక కర్షక రాజ్యము
స్థాపించుట నిజమేనోయ్
క్షణం క్షణం కదలి కదలి
కణం కణం రగిలి రగిలి
దళం దళం కలిసి కలిసి
పెనుతుఫాను ప్రభంజనం
ప్రజాసేన నిర్మించగ
పిడికిలెత్తి బాసచేసి
కార్మికులూ కర్షకులూ
నేతగాడు జీతగాడు
హమాలీలు కళాసీలు

కమ్మరులు కుమ్మరులు
వడ్రంగులు జాలరులు
పీడిత తాడితులంతా
కదంతొక్కి కదలిరండి
రండోయ్ రండోయ్

తుదిసమరం జరుగుతోంది
జగమంతా కదులుతోంది
సోవియెట్ అమెరికాలు
యుద్ధోన్మాదుల కూటమి
బుగ్గియగుట నిజమేనోయ్
ఒంటరిగా లేము మనము
కోటికోట్ల సేన మనం
చైనాలో ఎర్రసేన
పాలస్తీనా కమాండోలు
అమెరికాలో నల్లపులులు
క్యాంప్‌సోస్‌లో విద్యార్థులు
మలయాలో బర్మాలో
నగ్జల్‌బరీ శ్రీకాకుళం
ఫిలిప్పైన్ జావాలో
ఉరుగ్వేలో పెరుగ్వేలో
ఆసియాలో ఆఫ్రికాలో

దక్షిణాది అమెరికాలో
కదంతొక్కు ప్రజాసేన
అందరమూ ఒకేబాట
మొహరించు మహాసేన
అందరిదీ ఒకేబాట

మావోయాంగ్ కేంద్రంగా
జనయుద్ధ వ్యూహంగా
కెరటాలుగ పొంగి పొంగి
అగ్నిశిఖగ మండి మండి
చీకట్లను కాల్చి కాల్చి
స్వాతంత్ర్యం సమధర్మం
సౌభ్రాత్రం సౌహార్ద్రం
ప్రాణంగా ప్రణవంగా
నవజగతిని నిర్మించగ
రణశంఖం పూరించగ
అగ్నివీణ సారించగ
గణగణగణ గణగణగణ
గణగణగణ గణగణగణ
జేగంటలు మ్రోగించగ
కదంతొక్కి కదలిరండి.

[ఈ పాట రచయిత పేరు స్పష్టంగా తెలియకున్నా, ఇతడు శ్రీకాకుళం జిల్లావాడు కాదనీ, ఇతర జిల్లాలనుంచి - బహుశా గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచి వచ్చి శ్రీకాకుళ పోరాటంలో పనిచేశాడనీ పాటలోని భాషనుబట్టి అర్థం చేసుకోవలసివుంటుంది]

ఓరన్నా పేద రైతా

ఓరన్నా పేదారైతా
గిరిజనా వీరారైతా
శత్రువూ మాటలు నమ్మి
చేయకురా తప్పూపనులు

శత్రువూ మాటలు నమ్మితె
చావూ తప్పదురా నీకు
శత్రువునూ సంహరించి
విముక్తి పొందవేర

అదిగదిగో మన వీరుడు
ఆ పొడి కొండలలోన
చూడుము - గంగన్న
చండాడె శత్రువులాను

ఆ రోడ్లు ఎందుకురన్న
మన పీకలు తీయుటకన్న
తెలియురా తెలివోడ
విలువైన గిరిజన రైతా

ఇండ్లన్నీ తగులబెట్టి
కొండాకు విన్ను నెట్టి
కొండాదిగి రమ్మని పిలువ
పొంగిపోతున్నా వేల

అన్నా మమ్మందరినీ
క్రిందాకి దించివేసి 1
మందంగా కుప్పావేసి
మాడ్చి చంపుతాడన్న

మీ ఇల్లు తగులబెట్టి
మీ అన్నను కాల్చి చంపి
కొండలకు విన్నూ నెట్టి
చెట్టుకొక పిట్టనుజేసి
కొండాదిగి రమ్మని పిలువ
పొంగిపోతున్నా వేల

చారెడు నూకలకోసం
చెట్లాపై పిట్టాలన్ని
నేలపై వ్రాలగానే
వలయందు చిక్కుపడెను

నీ అన్నాదమ్ములను
నిలువునా కాల్చినట్టి
పోలీసూ కుక్కల వెనుక
పోటీకూ వీర రైతా

మనజాతీ గౌరవమ్మూ
మంటాగలపకూ రన్న
తెగువతో పోరుసల్పి
తొడ చరిచీ ముందూకురుకు

అదిగదిగో సీయార్పీ పోలీస్
అరుగూదెంచాడు అన్న
నీ దెబ్బా రుచీచూచి
నిబ్బారం కోలూపోయే 2

ఆ భూములు మనవేనన్న
కాజేసే దొరలూ మొన్న
ఆ భూమి పంచగ-పదరా
పోరాడూ వీరా రైతా

అన్నా నీ శక్తి ఇలలో
అడ్డూలేదూ విజం
కడని అధికారమ్ము
కలుగు సుఖమూ, పొందూ

'శ్రీకాకుళ సత్యం' పేరుతో వెలువడిన కా॥ వెంపటాపు సత్యనారాయణ పాటల పుస్తకం (విరసం ప్రచురణ-7, మార్చి 1973) లో ఈ పాట లేదు. కాని దుప్పల గోవిందరావుగారి నోట్సులో ఇది వెంపటాపు సత్యనారాయణ రచనగా ఉన్నది. ఈ పాటలో, పాడే శైలికి అనుగుణంగా పదాల చివర అక్షరాల దీర్ఘాలు కనిపిస్తాయి.

1 క్రిందాకి దించివేసి- గిరిజనుల్ని కొండలమీంచి బలవంతంగా పల్లపు ప్రాంతాలకు దించివేసి. 2 నిబ్బారం కోలూపోయే- నిబ్బరం కోల్పోయాడు.

1968 నవంబర్ 25న శ్రీకాకుళంలో పార్వతీపురం ఏజన్సీ ప్రాంతంలోని గిరిజనులు- పార్టీ ఆదేశం మేరకు సాయుధ తిరుగుబాటు ప్రారంభించారు. పోలీసుల్ని సాయుధంగా ఎదిరించి నిలవడం కాల్పులకు సమాధానంగా ఎదురు కాల్పులు జరపడం ప్రారంభించారు. అనేక ప్రాంతల్లో పోలీసులు వెనుకంజ వేశారు. పోలీసులమీద బండలు దొర్లించారు గిరిజనులు. గిరిజనులకు పోలీసులకు మధ్య జరిగిన కాల్పుల్లో కా॥ మొయిలం అనే దళ కమాండరు తుపాకీ దెబ్బకు ఒక పోలీస్ జవాను మరణించాడు గిరిజనోద్యమంలో మొదటిసారిగా పోలీసుకూడ చచ్చిన సంఘటన ఇదే! (శ్రీకాకుళ సాయుధ రైతాంగ పోరాటం, ఏ. అప్పలనాయుడు రచన, విరసం ప్రచురణ - 1985)

ఇది 1969 ఫిబ్రవరి ముందునాటి పరిస్థితి. ఆ తరువాత సీయార్పీ దిగింది. 1969 సెప్టెంబర్‌లో పార్వతీపురం ఏజన్సీలోని - ఎగువకోనంగూడ దిగువకోనంగూడ, ఎగువకీడవాయి, డిప్పగూడ మొ॥ గిరిజన గూడల్లో పోలీసులు, వారి తాబేదార్లు గృహదహనాలు సాగించారు. ఏజన్సీ వదలి పల్లపు ప్రాంతాలకు తరలమని, భూములిస్తామనీ ప్రభుత్వం ప్రలోభాలు చూపింది ఈ వైఖరిని ఎదిరించి పోరాడమని గిరిజన పేదరైతులకిస్తున్న పిలుపు ఈ పాట.

అన్నలారా ఆర్టీసీ బస్సు కాల్చకండి!

అన్నలారా ఆర్టీసీ బస్సు కాల్చకండి!
నర్సక్కను వాళ్ళు చంపితే చంపారు
మీరు మాత్రం ప్రజల ఆస్తికి
దయచేసి నష్టం కలిగించకండి
ప్రజలు ప్రయాణం చెయ్యరు కదాని
విమానాల్ని కాల్చేరు జాగ్రత్త
అవికూడా ప్రజల ఆస్తే
ఆకలి నిరుద్యోగం
ఇలాంటి ఇబ్బందులుంటే
వచ్చి పార్లమెంటులో చెప్పుకోండి
అర్జీలు పెట్టుకోండి
బంద్ ప్రకటించి
జాతీయాదాయానికి
నష్టం కలిగించకండి

ఫ్యాక్టరీలో
కార్మికుడి కాలో చెయ్యో విరిగిందని
మీరే ఇలా సమ్మె చేయిస్తే
మన తలసరి ఆదాయం
ఎలా పెరుగుతుంది -
చెప్పండి ?
మీ అండే చూసుకుని
పొలంమీద జీతగాళ్ళు
కడుపు నిండటం లేదని
కూలిరేట్లు పెంచాలని మొండికేస్తే-
మన ఆహార ధాన్యాల ఉత్పత్తి
తగ్గిపోదా చెప్పండి ?
అన్నలారా అర్థంచేసుకోండి
ఆర్టీసీ బస్సు కాల్చకండి !

-ఎల్. వి. సుధీర్‌కుమార్

సమీక్ష

అజ్ఞాతసముద్రం

కవిత్వం అంటే చేయితిరిగినవారి కలాలనుంచి కారే రసాలు కాదనే అనిపిస్తుంది. పోరాటాల్లోంచి, అడవితల్లి అంబుల పొదిలోంచి అగ్నివర్షం కురిపిస్తూ వస్తుంది కవిత్వం. దోపిడి వ్యవస్థను నిలదీస్తూ, ముఖాముఖి ఎదుర్కొంటూ, ఆ ఘర్షణలోంచి పుట్టిన నిప్పురవ్వలే "భూమి నా తల వెల నిర్ణయించు" కవితా సంకలనంలోని కవితలు.

పట్టుకుంటే 'లక్ష' అని ప్రకటించీ, చెట్లకు కట్టి కాల్చేస్తే అంతకు పదిరెట్ల బహుమానాలు ఇస్తుందీ ప్రభుత్వం. అందుకే పట్టుకున్న దాఖలాలు చాలా తక్కువ. ఎన్‌కౌంటర్లు ఎక్కువ. ఒకటికాదు, రెండుకాదు వందల తలలకు రేట్లు నిర్ణయించి పత్రికల్లో ప్రకటించారు. కాని పీడిత ప్రజల పక్షాన నిలిచి రాజీలేని పోరాటాన్ని చేస్తున్న వీరులు ప్రజల గుండెల్లో గూడుకట్టుకొని వుంటారు. నేలతల్లి విముక్తి పోరాటంలో, మట్టిమనుషుల ప్రతిఘటనల్లో నిజంగా భూమి తన తలే అవుతుంది. కష్టజీవి చెమటకు ఖరీదుగట్టే షరాబు లేదని శ్రీశ్రీ ఆనాడే చెప్పాడు. ఇవ్వాళ ప్రభుత్వం ప్రకటించిన రేట్లు దాని బూటక ప్రజాస్వామ్యపు తిత్తికి తూట్లే అని సముద్రుడు ఘోషిస్తున్నాడు.

నక్సల్బరి అన్నిరంగాలలో కొత్త విలువల్ని నిర్దేశించింది. ప్రచండమైన మార్పుల్ని తీసుకొచ్చింది. ప్రజాపోరాటాల్ని వివరించకుండా, ప్రజావీరుల్ని స్మరించకుండా రాసిందేదైనా ఇవ్వాళ ప్రజాసాహిత్యం కాపటంలేదు.

'అహ్మదీపూర్' ఎన్‌కౌంటర్ అమరవీరుల గురించి, నక్సల్బరి ఒడ్డల వారసత్వంగురించి 'మీ పాటకు ప్రాణం పోస్తాం' కవితలో అనుభవించి పలవరించాడు. కర్తవ్య నిర్దేశంచేశాడు. 'భవిష్యత్తు'ని సాక్షాత్కరింపజేశాడు.

"మళ్ళీ అదే కంఠం భీకరంగా/పిలుపునిస్తుంది/విప్లవం వర్ధిల్లాలి"

'బేబాకి' అంటే రుణం తీర్చుకోవడం ఒక ముసలితల్లి దేవుని అర్రలోని చల్లారని వేడిగాలి స్పర్శని ఇంకా అనుభవిస్తోంది. అయుధాన్ని స్మరిస్తూ 'బేబాకి' చేసుకొంటాననంటోంది ఆ తల్లి కన్నతల్లే అయింది. ఆ తల్లి ఆయుధాన్ని అందియ్యడమేకాదు, విప్లవబాటలో సమున్నతంగా నిలబెడుతుంది.

నా తల్లి నన్నీ దారిలోనే కన్నది. "కొండలపై లోతైన గాయంలా అడవులనుండి పుట్టే రక్తపు వాగులా, మందుగుండు వాసనలో ఒదిగిన నిశ్శ

ద్దంలా, మౌనభాష నుదుటి రక్తసింధూరంలా" నా తల్లి నన్నీ దారిలోనే కన్నది నన్ను నిలబెట్టింది.

"నీ గుండెల వెచ్చదనంలో జీవిగా ఎదిగినవాణ్ణి
నీనుండి దూరంగా విడిపోలేని రక్తహీనుణ్ణి."

బూటకపు సమాజాన్ని గురించి చెప్తూ—

"నిన్నటి ప్రజాస్వామ్యవాది ఇవాల్టి సమాధిగానో
రేపటి తోడేలుగానో మారాల్సిన పరిస్థితి"

ఈ పరిస్థితిని నిర్మూలించేందుకు సమాజం గుండెలమీదికి సమాజం డాక్టర్లని ఆహ్వానిస్తున్నాడు. శస్త్రచికిత్సచేసి సమాజాన్ని నిలబెట్టమంటున్నాడు. రండి!

—వీరయ్య

లేఖ

చరిత్ర రచన వీరుల భోజ్యంగా రాయాలా?

ఆ నడుమ "భారత కార్మికోద్యమం" (సుకోమల్‌సేన్) అనే పుస్తకం వచ్చింది. "సక్సల్బరీ వెలుగులో" (సుమంతా బెనర్జీ) అనే పుస్తకం వచ్చింది. తర్వాత "ఇండియన్ బిగ్ బూర్జువాజీ" (సుశీల్‌కుమార్ ఘోష్) అనే పుస్తకం వచ్చింది. దానివెనకే "మనకు తెలియని మన చరిత్ర" అనేపుస్తకం వచ్చింది. అటుతర్వాత కులంసమస్యపై ఎ ఐ ఎల్ ఆర్ సి సెమినార్ పుస్తకం వచ్చింది. దీనికన్నా ఆరేళ్ళముందు "నేషనాలిటీ క్వశ్చన్ ఇన్ ఇండియా" అనే సెమినార్ పుస్తకం వచ్చింది. ఇపుడు మార్చి అరుణతారలో అరుణ్‌గారి పరిచయ సమీక్షద్వారా "ఇండియా అండ్ ది రాజ్" (సుశీల్‌కుమార్‌ఘోష్) అనే పుస్తకం వచ్చినట్టు తెల్సింది. అరుణ్‌గారి పరిచయ సమీక్ష బాగుంది.

భారతదేశంలో ఇన్నిరకాల చరిత్రలున్నాయి - ఇన్నిరకాల రూపాలలో 'రాజ్యం' కొనసాగుతున్నది. ఇలా విడివిడిగా ముక్కలుగా ఏనుగు - ఏడుగురు గుడ్డివాళ్ళలాగా పరిశీలించడంతప్ప ఒక సమగ్రతతో వీటిని పరిశీలించలేమా? అరుణ్‌గారి పరిచయ సమీక్ష చదవగానే ఈ ప్రశ్న మళ్ళీ తలెత్తింది.

రాజ్, రాజ్యం, state అంటే "ప్రభుత్వ రాజకీయాలు" అనే అర్థానికి కుదించి ఆలోచించడం మార్క్సిస్టుల్లోనూ బలంగా కొనసాగుతున్నది అని సుశీల్‌కుమార్ ఘోష్ పుస్తకం మరోసారి నిర్ధారిస్తున్నది.

Culture is nothing but Politics అని మావో అన్నాడని విన్నాను. సంస్కృతి అనేది రాజకీయమే అయినప్పుడు సాంస్కృతిక పోరా

టాలు రాజకీయ పరివర్తనకోసం చేసే పోరాటాలుకూడా అవుతాయి. శక్తి ఉద్యమాల్ని ఈ కోణంతోనే సాంఘిక ఉద్యమాలు అని పేర్కొనడం జరుగుతున్నది. కాగా సుసీత్‌కుమార్ ఘోష్ తన పుస్తకం పరిధిలోకి వీటిని తీసుకున్నట్లు కనపడదు.

పితృస్వామిక భావజాలం అనేదికూడా సంస్కృతి రూపంలో కొనసాగుతున్న రాజకీయాలే. కాని స్త్రీసమస్య తాలూకు పోరాటాల్ని ఘోష్ తన పరిధిలోకి తీసుకున్నట్టు కనపడదు.

ఉత్పత్తి సంబంధాల్లో చేయబడే పరాయీకరణే రాజ్యం. కులం అనేది స్పష్టంగా ఉత్పత్తి సంబంధాల్ని తెలిపే రాజ్యం. కాగా అస్పృశ్యత, పీడిత కుల పోరాటాలు, మత పోరాటాలు తన పుస్తకం పరిధిలోకి తీసుకున్నట్టు కనపడదు. హేతువాద, సంస్కరణ ఉద్యమాల్నికూడా తన పరిధిలోకి తీసుకున్నట్టు కనపడదు.

భారత కార్మికోద్యమ చరిత్ర వేరుగానూ, రాజకీయోద్యమ చరిత్ర వేరుగానూ, ఆర్థిక చరిత్ర వేరుగానూ, సాంస్కృతికోద్యమ చరిత్ర వేరుగానూ, కులసమస్య పోరాటచరిత్ర వేరుగానూ, జాతుల సమస్య చరిత్ర వేరుగానూ, స్త్రీసమస్య పోరాటచరిత్ర వేరుగానూ, సాంఘికోద్యమాల చరిత్ర వేరుగానూ రాస్తే ఇక సమగ్ర చరిత్ర రాసే చరిత్ర పేరేమిటి? అయా సెక్షన్ల పోరాటాల వివరణ చేయదల్చుకున్నాసరే ఒక సమగ్రతలో అవిభాజ్య భాగంగా వాటిని విశ్లేషించగలిగే దృక్పథం, పద్ధతి, అప్రోచ్ మనకు అలవడవలసున్నది

జాతీయోద్యమ చరిత్రలో అదర్ డొమినియన్ పేరిట విడి శీర్షిక పెట్టి రైతాంగ పోరాటాలగురించి రాయడం మంచిపద్ధతి కాదు. ఈ పద్ధతి తనకు తెలియకుండానే దళారీ కాంగ్రెసే ప్రధాన పోరాటం చేసినట్టుగానూ, మిగిలిన పోరాటాలు ఏదో సహాయపాత్ర నిర్వహించినట్టుగానూ దృక్పథాన్ని అచరిస్తున్నది. ఇది తప్పుడు అంచనాలవి ఇవ్వగలదు

సాంఘికోద్యమం, కార్మికోద్యమం, రైతాంగపోరాటాలు, స్త్రీ, కుల, జాతుల సమస్య పోరాటాలు, రాజకీయాలు, ఉత్పత్తి సంబంధాలు, మానవ సంబంధాలు, పరస్పర ఆధారితమైనవి. పరస్పరం ప్రభావితం చేసుకొనేవి కావడంవల్ల ఒకానొక నిర్దిష్టకాలపు మనిషిని - అతని సమాజాన్ని, అతని పోరాటాల్ని వీటన్నిటిని సమగ్రతలో చెప్పవలసివుంటుంది. సాహిత్యం, సంస్కృతి ఉత్పన్నమైన తీరు అవి తిరిగి సమాజంపై ప్రభావం వేసిన తీరు కూడా ఘోష్ తన పరిధిలోకి తీసుకున్నట్టు కనపడదు.

కనక ఘోష్, జాతుల సమస్య బాధితులు కానివారిని, కులసమస్య పీడితులు కానివారిని, స్త్రీ సమస్య తాడితులు కానివారిని, కార్మికులు కానివారిని, సంస్కృతి పీడితులు కానివారిని మాత్రమే ప్రజలుగా గుర్తించి వారిదిమాత్రమే పోరాటంగా, చరిత్రగా తన పుస్తకానికి పరిధి విధించినట్లున్నట్టయిందేమో!

—బి. యస్. రాములు

విరసం విశేషాలు

○ తెలుగు సాహిత్యంలో పాట నిర్వహించే పాత్ర గురించి విశాఖ విరసం 17-4-91న సెమినార్ నిర్వహించింది. కామ్రేడ్ వంగపండు ప్రసాదరావు అధ్యక్షత వహించారు.

ఉదయం సెషన్‌లో "పల్లెపాటలు - ప్రజాసాహిత్యం" అనే అంశంమీద కా॥ చలసాని ప్రసాద్ ప్రసంగిస్తూ పాటునుంచి పాట పుట్టిందనీ, తెలుగువాడితోపాటే కవిత్వం, పాటకూడా పుట్టాయన్నారు. పిట్టకథలు, పొడుపుకథలు, సామెతలుకూడా సాహిత్యమేనన్నారు. పల్లెపాటల్లో ప్రజల బాధలు, గాథలు, తిరుగుబాట్లు ఎలా ప్రతిఫలించాయో వివరించారు.

సాయంత్రం సెషన్‌లో కా॥ వరవరరావు "పోరుబాటలో పాట"గా పాట ఎలా పరిణామం చెందిందో విశ్లేషణాత్మకంగా చెప్పారు. పల్లెపాటలకు, ప్రజల పాటలకు తేడావుందనీ పోరాటాలూ, ప్రాపంచిక దృక్పథం గురించి చెప్పేవి ప్రజల పాటలని వివరించారు. గొంతు ఎండుకుపోతున్న గ్రామీణుడు పంచాయితీ ఆఫీసుల్లో ఏర్పాటుచేసిన టివి ప్రకటనలు చూసి తనసుతాను మర్చిపోతున్నాడనీ, ఆఫ్రికాలాంటి దేశాలలో అక్కటి ప్రభుత్వాలు ప్రాచీన జానపద కళారూపాలను అత్యాధునిక సాంకేతిక నైపుణంతో ప్రచారంచేసి, ప్రజాఉద్యమాలను పక్కదోవ పట్టిస్తున్నాయనీ అన్నారు. ఒకప్పుడు నిరాసక్తంగా ఉండే తెలంగాణా గ్రామాలు నేడు ఉద్రిక్తతతో నిండివున్నాయనీ, నిన్నటి వరకు నడకలతో వున్న విప్లవం నేడు పరుగులు పెడుతోందనీ, పాట విప్లవోద్యమాభివృద్ధికి తోడ్పడుతోందనీ వరవరరావుగారన్నారు.

○ విరసం సభ్యుడు కా॥ బి యస్. రాములుపై 1984లో ఆయుధాల చట్టం కింద నమోదుచేసిన కేసును ఇటీవల కొట్టివేశారు.

మేడే సందర్భంగా జగిత్యాల పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఆవరణలో హమాలి, చాట అడకూలీల సనిపుం ఎర్రజెండా ఆవిష్కరించిన సందర్భంగా విరసం సభ్యుడు కా॥ బి యస్. రాములు ఉపన్యసిస్తూ ప్రపంచ గుత్తాధిపత్యాన్ని వ్యతిరేకిస్తూ శ్రామికులు ఏకంకావాలని పిలుపునిచ్చారు. హమాలీ కూలీ సంఘ సభ్యులను మార్కెట్ కమిటీ ఉద్యోగులుగానే ప్రకటించాలని కోరారు.

మురిసిపోకు

సూరీడ్ని పట్టుకొని చీకటి చేశాననుకోకు
తెల్లారితే వెలుగురేఖలు నీ గదిగోడలు బ్రద్దలు కొడతాయ్
సూరీడ్ని పట్టుకొని సముద్రాన్నే బంధించాననుకోకు
అది ఉప్పెనై నీకు ముప్పును కలిగిస్తుంది
సూరీడ్ని పట్టుకొని కేరింతలు కొట్టకు
అజ్ఞాతంలోని ఆటమ్స్ నీ మరణ శాసనం రాస్తున్నాయ్
ప్రమోషన్ల పరుగులో అడుగు ముందుకెయ్యకు
నువ్వు తవ్వుకున్న గోతిలో కుప్పకూలి చావకు.

—పి. కె.

స్వీకారం

1) ఓటు నా తల వెల నిర్ణయించు, కవితాసంపుటి, సముద్రుడు, వెల 2 రు.
2) ధర్మజలానికి ఖరీదుకట్టే...షరాబు ...? కథల సంపుటి, కాలువ మల్లయ్య వెల 12 రు. ప్రతులకు : నవోదయ బుక్‌హౌస్, 3-3-865, ఆర్య సమాజ్‌వీధి, కాచిగూడ X రోడ్స్, హైదరాబాద్-500 027.

అల్లం రాజయ్య కథ 'మధ్యవర్తులు' (ఆంధ్రజ్యోతి, దీపావళి సంచిక, 1990) కొడవటిగంటి కుటుంబరావుగారి ప్రతిష్ఠాత్మక అవార్డు పొందింది. రాచకొండ విశ్వనాథశాస్త్రి, కాళీపట్నం రామారావుగార్లు ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు. రచయితకి అభినందనలు.

మద్రాసు,
20-4-91

ఇట్లు,
కొడవటిగంటి వరూధిని

క్రాంతి ప్రచురణగా వెలువడింది

Selected works of MAO TSE TUNG

VOLUME VI

ప్రతులకు : పీస్ బుక్ సెంటర్,
1-8-518/16/2, వెంకటేశ్వర టెంపుల్ దగ్గర,
చిక్కడపల్లి, హైదరాబాద్-500 020.

KLNA101 M106

129 ARUNA TARA - MAY 1991 H/GTR-70

Annual Subscription Rs. 40/- Single Issue Rs. 4/-

అక్టోబర్ 30

నీ చావూ నా చావూ నిన్ననే సరయూలో స్రవించింది. బుల్లితెరపై హసించింది. శ్రీరామ మూత్ర సరస్సు అది. గంగకన్న పవిత్రం. నగరాల్లోకి పెట్రోలై పాకి భగ్ భగ్. మానవుణ్ణి అవమానించే యీ కాళరాత్రి, శత్రువు ఎదురుచూస్తున్నాడు చచ్చిన భవిష్యత్తుకోసం. గడియారాన్ని వెనక్కి యింకా వెనక్కి రామచంద్రుని పాదాల దగ్గరికి అక్కడే శిలువ కాలానికి.

గడియారాన్ని ముందుకు తిప్పుతున్నాడు మిత్రుడు. ఈ ముల్లు కసుక్కున శత్రువు గుండెలో దిగి జిమ్మని, మానవుడి నుదుట రక్తతిలకం. శత్రువు శరీరంలో జరుజర్రున పాకు. కనెక్షన్లన్నీ తెంచు కల్లోలం రేపు.

వన్ టూ త్రీ ఫోర్ ఫైవ్ సిక్స్ సెవెన్ మరో వంద అంకెల్ని హుషారుగా కలిపితే ఆన్సరొస్తుందా?

ఎన్ని కళేబరాల్ని కలిపి కుడితే వాడికి పీతాంబరమౌతుంది? రాముడి తర్వాత కృష్ణుడు. ముక్కోటి దేవతలకి రక్తాంబరాలా? శంబూక హంతకుడికి శవాలే నైవేద్యం. అద్దాల మేడలో వెయ్యి అయోధ్యలు రామరాజ్యానికింకా ఎన్ని శిలలు, ఎన్ని తలలు? శవాల లెక్కింపులో స్వయంతృప్తి. శత్రువు గణితం అది.

మిత్రుడా అశక్తుణ్ణి. ఈ అర్ధరాత్రి సజీవమైన భూమికోసం కలగంటున్నా. నిర్జీవ గ్రహంకోసం కాదు. సూర్యుడు మనపై ప్రసరించిన వెలుతుర్ని ప్రాచీన శిథిలాలపైకాదు ఒకరి ముఖంపై మరొకరు ప్రసరించుకోవాలి ఈ గ్రహంపై మనుషుల్ని ఏకంచేసే మరో శక్తికోసం కలగంటున్నాను. అడవుల్లోంచి, కొండల్లోంచి, సంక్షుభిత జనంలోంచి పుడికి పుప్పెనౌతున్న కంఠంకోసం. ఆ కంఠనాళాలపై మాత్రమే భూమి వినూత్నమైన భాషతో పుష్పిస్తుంది.

—ఆర్. శివశంకర్

Printed at Konarka Printers, Kavali on behalf of Venkataramana Printers, Guntur-1. Revolutionary Writers' Association

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపత్రిక

పుస్తకం సంఖ్య	KLVA101M106
పుస్తకం పేరు	అరుణతార
తారీఖు	08 February 2025
ముందు అట్ట	[illegible]
వెనుక అట్ట	[illegible]
మొత్తం పేజీలు	61
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	no
తయారు చేసినది	Susmitha
పేజీలు విడదీసినది	Bhanusree
స్కాన్ చేసినది	akshaya
పరీక్ష చేసినది	HASEEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	[illegible]